నిజాల నిగ్గు తేల్చే
# చర్చ
తెలుగు దిన పత్రిక







## దీపావళి శుభాకాంక్షలు

పాఠకులకు, ప్రకటనకర్తలు, శ్రేయోభిలాషులకు దీపావళి శుభాకాంక్షలు నేడు దీపావళి పర్వదినం సందర్భంగా పత్రికా కార్యాలయానికి సెలవు. కావున రేపు (మంగళవారం 21-10-2025) సంచిక వెలువడదు. పునర్దర్శనం బుధవారం.

**- ఎడిటర్ - చర్చ**

## గిన్నిస్‌కెక్కిన అయోధ్య 'దీపోత్సవం'..

మంత్రముగ్ధులను చేసిన లేజర్ షో..!



2లో

## తక్షణ కాల్పుల విరమణకు పాక్, అఫ్ఘాన్ అంగీకారం



**దోహా,అక్టోబర్ 19 :-**పాకిస్థాన్, అఫ్ఘానిస్థాన్ తక్షణ కాల్పుల విరమణకు అంగీకరించాయి. ఖతార్, తుర్కియే మధ్యవర్తిత్వంలో శనివారం జరిగిన చర్చల్లో ఈ మేరకు అంగీకారం కుదిరింది. రానున్న రోజుల్లో మరిన్ని సమావేశాల్లో పాల్గొనేందుకు ఇరు దేశాలు అంగీకరించాయి. కాల్పుల విరమణ కొనసాగింపు, దాని అమలును నమ్మదగిన రీతిలో తనిఖీ చేయడం కోసం సమావేశాలను నిర్వహించాలని నిర్ణయించాయి. ఖతార్ విదేశాంగ శాఖ ఆదివారం ఈ వివరాలను వెల్లడించింది. దాదాపు వారం పాటు ఇరు దేశాల మధ్య జరిగిన ఘర్షణల్లో, పదుల సంఖ్యలో మరణించగా, వందలాది మంది గాయపడిన సంగతి తెలిసిందే.

# తెలంగాణ రాష్ట్ర అభివృద్ధిలో యాదవులది కీలక పాత్ర

- నమ్మకానికి మారుపేరు యాదవులు
- సీఎం రేవంత్ కీలక వ్యాఖ్య





**హైదరాబాద్ అక్టోబర్ 19 :** హైదరా బాద్‌లో శ్రీకృష్ణ సదర్ సమ్మేళన్ ఆ ధ్వర్యంలో అత్యంత వైభవంగా జరి గిన సదర్ కార్యక్రమంలో ముఖ్య మంత్రి ఎ. రేవంత్ రెడ్డి పాల్గొన్నా రు. తెలంగాణ రాష్ట్ర అభి వృద్ధిలో యాదవులు కీలక పాత్ర పోషిస్తు న్నారని, వారికి ప్రభుత్వంలో తగిన ప్రాతినిధ్యం, సముచిత స్థానం కల్పి స్తామని ఈ సందర్భంగా ముఖ్య మంత్రి స్పష్టం చేశారు.హైదరాబాద్ ఇందిరా పార్క్ - ఎన్టీ ఆర్ స్టేడియంలో యాదవ సోదరు లు శ్రీకృష్ణ సదర్ సమ్మేళన్ ఆధ్వ ర్యంలో నిర్వహించిన సదర్ కార్యక్ర మంలో ముఖ్యమంత్రి ప్రసంగిం చా రు. నమ్మిన వారికోసం ఎంత కష్ట మొచ్చినా, నష్టమొచ్చినా యాద వులు అండగా నిలబడుతారని, వారి అండతోనే హైదరాబాద్ ప్ర పంచ పెట్టుబడులకు ఆదర్శ నగరంగా మారిందని ప్రశంసించారు.యాదవ సోదరుల ఖదర్ హైదరా బాద్ సదర్ అని, ఎంతో చరిత్ర కలి గిన సదర్ ఉత్సవాలను ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని కోరి నప్పుడు వెంటనే ఆమోదించడమే కాకుండా నిధులు కేటాయించామని గుర్తుచేశారు. యాదవుల సహకా రంతోనే తెలంగాణ రాష్ట్రాన్ని ముం దుకు తీసుకెళతామని అన్నారు.ఈ కార్యక్రమంలో మంత్రులు పొన్నం ప్రభాకర్, పొంగులేటి శ్రీనివాస రెడ్డి, వివేక్ వెంకటస్వామి, వాకిటి శ్రీహరి, హరియాణా మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు, ఎంపీ అనిల్ కుమార్ యాదవ్ తో పాటు సదర్ సమ్మేళన్ ప్రతినిధులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## మల్లోజుల, ఆశన్న విప్లవ ద్రోహులు..



2లో



## తెలుగు ప్రజలకు ఏపీ సీఎం చంద్రబాబు దీపావళి శుభాకాంక్షలు

**అమరావతి,అక్టోబర్ 19 :** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రజలకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దీపావళి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ మేరకు ఆయన తన సోషల్ మీడియా మాధ్యమం ఎక్స్ ఖాతాలో పోస్ట్ చేశారు. దీపావళి ప్రాశస్త్యాన్ని తెలియచెబుతూ సీఎం చంద్రబాబు, రాష్ట్రం ప్రగతి పథంలో ప్రకాశించాలని ఆకాంక్షించారు. 'దీపం జ్యోతిః పరంబ్రహ్మ దీపం సర్వతమోపహమ్ ఎ దీపేన సాధ్యతే సర్వమ్ సంధ్యా దీప నమోస్తుతే ఎఎ పరబ్రహ్మగా మిగతా2లో...

## ఇంతకు ముందు లెక్క ఉండది.. అందరి లెక్కలు తేలుస్తాం : కేటీఆర్




**హైదరాబాద్ అక్టోబర్ 19 :**కేసీఆర్ మళ్లీ ముఖ్యమంత్రి కావాలిందేనని.. తెలంగాణ మళ్లీ పట్టాలు ఎక్కాల్సిందేనని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారకరామారావు అన్నారు. ఇంతకు ముందు లెక్క ఉండదని.. అందరి లెక్కలు తేలస్తామన్నారు. రాజేంద్ర నియోజకవర్గానికి చెందిన మాజీ డీసీఎంఎస్ చైర్మన్, మాజీ ఎంపీపీ చెక్కల ఎల్లయ్య ముదిరాజ్, ఆయన కుమారుడు పెద్దషాపూర్ మాజీ సర్పంచ్ చెక్కల చంద్రశేఖర్, 2018లో జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో ఇండిపెండెంట్ అభ్యర్థిగా పోటీచేసిన అంజిబాబు దంపతులు తమ అనుచరులతో కలిసి బీఆర్ఎస్ పార్టీలో చేరారు. తెలంగాణ భవన్‌లో ఆదివారం వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కేటీఆర్ మాట్లాడుతూ.. ఆక్రమణల పేరుతో పేదల ఇండ్లను కూలుతున్నారని.. ఇప్పటివరకు ఒక్క బడా వ్యక్తి ఇంటిని కూల్చలేకపోయిందని.. మూసీకి అడ్డంగా కడుతున్నవారిని ఎవరూ పట్టించుకోవట్లేదని విమర్శించారు. బడా నేతల ఇళ్లు కూల్చివేసేందుకు హైడ్రాకు దారి దొరకడం లేదని.. కానీ, మిగతా2లో...

# వైసీపీపై పవన్ కల్యాణ్ సంచలన వ్యాఖ్యలు



**అమరావతి, అక్టోబర్ 19 :** ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ సీఎం, జనసేన అధినేత పవన్ కల్యాణ్ వైసీపీపై తీవ్ర సంచలన వ్యాఖ్యలు చేశారు. దీపావళి పండుగ సందర్భంగా రాష్ట్ర ప్రజలందరికీ శుభాకాంక్షలు తెలిపారు. చీకటిపై వెలుగు, చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీక దీపావళి అని అభివర్ణించారు. ప్రజలంతా దీపావళిని పర్యావరణ హితంగా చేసుకోవాలి. రాష్ట్రంలోని వైసీపీ పార్టీపై మరోసారి విరుచుకుపడ్డారు. గత ఎన్నికల్లో నయా నరకాసురులను మిగతా2లో...

## తెలంగాణలో మళ్లీ వానలు..!



**హైదరాబాద్ అక్టోబర్ 19 :**తెలంగాణలో రాగల మూడు నాలుగు రోజులు వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం హెచ్చరించింది. దక్షిణ అండమాన్ సముద్రాన్ని ఆనుకొని ఉన్న ఆగ్నేయ బంగాళాఖాతంపై ఉపరితల ఆవర్తనం సగటు సముద్రమట్టానికి 1.5 కిలోమీటర్ల ఎత్తు వరకు మిగతా2లో...

## నక్సల్స్ రహిత జిల్లాలకు మహర్దశ: కిషన్ రెడ్డి



**హైదరాబాద్ అక్టోబర్ 19 :** తమ ప్రభుత్వం చేపట్టిన చర్యలతో పెద్ద ఎత్తున మావోయిస్టులు లొంగిపోతున్నారని కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి జి. కిషన్ రెడ్డి తెలిపారు. నక్సల్స్ రహిత జిల్లాలకు మహర్ధశ పడుతుందని ఆయన అన్నారు. గత మూడు రోజుల్లోనే మూడు వందల మంది నక్సల్స్ లొంగిపోయారని, అందులో తెలుగు వారు ఎక్కువ మంది ఉన్నారని ఆయన ఆదివారం అంబర్‌పేటలో జరిగిన కార్యక్రమంలో ప్రసంగిస్తూ అన్నారు. పదేళ్ళ క్రితం దేశంలో 125గా ఉన్న నక్సల్స్ ప్రభావిత జిల్లాలు, ఇప్పుడు 11కు తగ్గాయని అన్నారు. అవి కూడా నక్సల్స్ మిగతా2లో...

## దేశ భద్రత విషయంలో రాజీ పడే ప్రసక్తే లేదు

- కేంద్రమంత్రి బండి సంజయ్ సంచలన ట్వీట్..!



**హైదరాబాద్ అక్టోబర్ 19 :**కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ ఆదివారం 'ఎక్స్'లో సంచలన పోస్టు పెట్టారు. తెలంగాణలోని రాజకీయ నాయకులకు స్పష్టమైన హెచ్చరిక చేస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రజాస్వామ్యం పేరుతో ప్రసంగాలు చేస్తూ.. ఒకవైపు మావోయిస్టుల సాయుధ మిగతా2లో...

# మల్లోజుల, ఆశన్న విప్లవ ద్రోహులు..

**హైదరాబాద్ అక్టోబర్ 19 :–** దేశంలో మావోయిస్టుల లొంగుబాట్లకు సంబంధించి తాజాగా కీలక పరిణామం చోటు చేసుకుంది. మావోయిస్టు కేంద్ర కమిటీ అభయ్ పేరుతో నాలుగు పేజీల లేఖ విడుదల చేసింది. ఈ లేఖలో ఇటీవల పోలీసులు ఎదుట లొంగిపోయిన మల్లోజుల వేణు గోపాల్ , ఆశన్నలు వంటి నేతల వ్యవహారాన్ని ప్రత్యేకంగా గుర్తించి, వారిని విప్లవ ద్రోహులుగా పేర్కొంది. శత్రువుల ఎదుట లొంగిపోయి పార్టీ నష్టానికి కారణమైన నేతలకు తగిన శిక్ష ప్రజలే విధిస్తారని మావోయిస్టు కేంద్ర కమిటీ పేర్కొంది. పార్టీ కేంద్ర కమిటీతో చర్చించకుం డానే వారిద్దరు లొంగిపోయారని ఆరోపించింది. వారిద్దరినీ పార్టీ నుంచి బహిష్కరిస్తున్నట్లు తెలిపింది. ప్రాణభీతి ఉన్నవారెవరైనా లొంగిపోవచ్చు ని.. కానీ ఆయుధాలు మాత్రం అప్పగించకూడదని కోరింది. గత కొన్ని రోజులుగా కీలక మావోయిస్టు నేతలు లొంగిపోతున్నారు. కాగా 2 రోజుల్లో 258 మంది లొంగిపోయారని అమిత్ షా ట్వీట్ చేసిన నేపథ్యంలో ఈ లేఖ కలకలం సృష్టిస్తోంది. '2011 చివరి నుంచి విప్లవోద్యమం గడ్డు స్థితిని ఎదుర్కొంటూ వస్తోంది. 2018లో మవోయిస్టు పార్టీ ఒకసారి తాత్కాలిక వెనుకంజ వేసింది. అప్పటి నుంచి మల్లోజుల బలహీనతలు బయటపడ్డాయి. 2020 కేంద్ర కమిటీ సమావేశంలో.. మల్లోజుల దండకారణ్య విప్లవాచరణలోని కొన్ని లోపాలపై సొంత విశ్లేషణలతో నిర్ధారించి ఒక పత్రాన్ని ప్రవేశపెట్టాడు. దాన్ని కేంద్ర కమిటీ తిరస్కరించింది. ఆ తర్వాత ఎప్పటికప్పుడూ జరిగిన కేంద్ర కమిటీ, పొలిట్ బ్యూరో ఆయన తప్పుడు రాజకీయ భావనలను పార్టీ విమర్శించింది. అనంతరం ఆయనను పార్టీ సరిదిద్దడానికి కృషి చేసింది. 2011లో జరిగిన దండకారణ్య స్పెషల్ జోన్ కమిటీ ప్లీనం మల్లోజుల వ్యక్తివాదాన్ని, అహంభావాన్ని, తీవ్రమైన పెత్తందారీతనాన్ని విమర్శించి, వాటిని



సరిదిద్దుకోవాలని కోరింది. అయితే, 2025 మే నెలలో జరిగిన ఆపరేషన్ కగార్ దాడిలో మా పార్టీ ప్రధాన కార్యదర్శి కామ్రేడ్ బసవరాజు అమరత్వం తర్వాత మల్లో జులలో దీర్ఘకాలంగా ఉన్న సైద్దాంతిక, రాజకీయ, నిర్మాణ బలహీనతలు గుణాత్మక మార్పును సంతరించుకుని శత్రువు ముందు మోకరి ల్లేలా చేశాయి' అని అభయ్ లేఖలో పేర్కొన్నారు. 'విప్లవానికి ద్రోహులుగా మారిన మల్లోజుల, ఆశన్నల ముఠా సరైన మార్గంలో విప్లవ ఉద్యమాన్ని పునర్మిస్తామనడం బూటకం. వాళ్లు కేంద్ర, రాష్ట్ర ఇంటజిజెన్స్ ఏజెన్సీల నియంత్రణలో ఉంటూ చేసే ప్రజా పోరాటాలు, నిర్మించే విప్లవ ఉద్య మం, ప్రభుత్వ ప్రాయోజిత ప్రజా పోరాటాలుగా, విప్లవ ఉద్యమంగానే ఉంటాయి. అందుకే ఈ విప్లవ ద్రోహులు ప్రజాపోరాటాల పేరుతో ప్రజల వద్దకు వస్తే వారిని తన్ని తరమాల్సిందిగా పిలుపు నిస్తున్నాం. కగార్ యుద్ధంతో ప్రాణభీతి ఉన్నవారు ఎవరైనా లొంగిపోతే లొంగిపోవచ్చు కానీ.. పార్టీకి, విప్లవ ప్రజలను చెందిన ఆయుధాలను శత్రువుకు అప్పగించకూడదని కోరుతున్నాం. అది విప్లవ ద్రోహమే కాకుండా విప్లవ ప్రతి ఘాతకత అవుతుంది. విప్లవ ప్రతిఘాతకులను విప్లవ ప్రజలు శిక్షించక తప్పదు' అని లేఖలో అభయ్ హెచ్చరించారు. 'విప్లవోద్యమంలో వెనకంజలు, ఓటములు తాత్కాలికమే' 'భారతదేశంలో ఉత్పత్తి సంబంధాల్లో మార్పులు– మన రాజకీయ కార్యక్రమం', 'భారతదేశంలో కులసమస్య మన దృక్పథం', 'భారతదేశంలో బాతుల సమస్య– మన పార్టీ వైఖరి', 'భారతదేశంలో దళారీ నిరంకుశ బూర్జువా వర్గం పై పార్టీ వైఖరి –రాజకీయ కార్యక్రమం' డాక్యుమెంట్లను మరింతగా సంశ్లేషించి మారిన సామాజిక పరిస్థితులకు, మారుతున్న విప్లవయుద్ధ స్వాభావిక లక్షణాలకు తగినట్టుగా మన రాజకీయ– సైనిక పంథా మరింతగా సంపన్నం చేసుకుని భారత విప్లవోద్యమాన్ని కొనసాగిద్దామని యావత్తు దేశ ప్రజానీకానికి పిలుపునిస్తున్నాం. విప్లవోద్యమంలో వెనకంజలు, ఓటములు తాత్కాలికమే సోను, సతీష్ ముఠా ద్వారా సృష్టించబడ్డ ఈ స్థితిని పార్టీలో ఏర్పడిన సంక్షోభంగా గుర్తించి, ఈ సంక్షో భాన్ని అధిగమిద్దాం. ప్రస్తుతం మన స్వీయాత్మక శక్తులు నష్టపోయి, బలహీనపడ్డ స్థితిని అంగీకరిస్తూ, మన విప్లవోద్యమంపై శత్రువు.అధికృత సంపాదించిన స్థితిని గమనంలో ఉంచుకుని పార్టీని, పీ.ఎల్.జె.ఎ.ను, ఐక్య సంఘటనను మొత్తంగా విప్లవోద్యమాన్ని కాపాడుకుం టూ దేశవ్యాప్త విప్లవోద్యను పునర్నిర్మాణానికి పూనుకుందాం. సోను, సతీష్‌లు శత్రువుకు సరెండరయినా రేపు మరొకరు సరెండరైనా మన పార్టీ శత్రువుకు సరెండర్ కాదని దేశ ప్రజలకు హామీ ఇస్తున్నాం. వర్గాలున్నంతకాలం వర్గ పోరాటాలు వాటి ఉన్నత రూపాలుగా ప్రజాయుద్ధాలు కొనసాగడం తిరుగులేని చారిత్రక నియమం. ఈ నియమాన్ని లొంగుబాట్లు మార్చలేవు. కాబట్టి తాత్కాలిక వెనకంజలో సైతం విప్లవోద్యము పురోగమనం కోసం కృషి చేయడానికి గొప్ప ఆత్మవిశ్వాసంతో, ధైర్యసాహసాలతో ముందుకుసాగుదాం అంతిమ విజయం ప్రజలదే' అని అభయ్ పేర్కొన్నారు.

---

# మా ప్రభుత్వం రాగానే ధరణి చట్టాన్ని తొలగించి భూభారతి తెచ్చాం : రేవంత్

**హైదరాబాద్ :–** భూమి మీద ఆధిపత్యం కోసం గతంలో యుద్ధాలు జరిగాయని సిఎం రేవంత్ రెడ్డి తెలిపారు. సర్వేలో తప్పులు చేస్తే ప్రజలు మీ మీద తిరగబడే అవకాశం ఉందని అన్నారు. లైసెన్స్ సర్వేయర్లుగా శిక్షణ పొందిన అభ్యర్థులకు లైసెన్స్ పంపిణీ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా శిల్పకళావేదికలో సిఎం మీడియాతో మాట్లాడుతూ.. కన్నతల్లి పై ఉన్న మమకారాన్నే తెలంగాణ ప్రజలు భూమిపై చూపించారని, గత ప్రభుత్వం తెచ్చిన ధరణి చట్టం.. కొంతమంది దొరలకు చుట్టంగా మారిందని విమర్శించారు. ధరణి చట్టాన్ని అడ్డుపెట్టుకొని భూమి మీద ఆధిపత్యం చెలాయించాలని చూశారని, తమ గెలుపునకు అనేక కారణాలు ఉండొచ్చు..బిఆర్ఎస్ ఓటమికి ధరణి చట్టమే కారణం అని అన్నారు. అధికారంలోకి వస్తే.. ధరణి నుంచి విముక్తి కలిగిస్తామని హామీ ఇచ్చామని, తమ ప్రభుత్వం రాగానే




ధరణి చట్టాన్ని తొలగించి భూభారతి తెచ్చామని తెలియజేశారు. గత ప్రభుత్వం నోటిఫికేషన్లు ఇవ్వలేదని..ఇచ్చినా పరీక్షలు పెట్టలేదని, ఒకవేళ పరీక్షలు పెట్టిన ప్రశ్నాపత్రాలు జిరాక్స్ సెంటర్లలో దొరికేవి అని అన్నారు.గత ప్రభుత్వ హయాంలో టిజిపిఎస్సి పునరావాస కేంద్రంగా ఉండేదని, తమ ప్రభుత్వం రాగానే టిజిపిఎస్సిని ప్రక్షాళన చేశామని



రేవంత్ పేర్కొన్నారు. తమ ప్రభుత్వం వచ్చిన ఏడాదిలోనే 60 వేల ఉద్యోగాలు భర్తీ చేశామని, తాము ఉద్యోగాలు ఇస్తుంటే.. కోర్టుల్లో కేసు వేసి ఆపాలని చూశారని మండిపడ్డారు. కోర్టుల్లో పోరాడి అభ్యర్థులకు నియామక పత్రాలు అందజేశామని, త్వరలో గ్రూప్–3,4 అభ్యర్థులకు నియామక పత్రాలు అందజేస్తామని అన్నారు. దేశ జిడిపిలో తెలంగాణ వాటా ప్రస్తుతం 5 శాతంగా ఉందని, జిడిపిలో తెలంగాణ వాటా త్వరలో నే 10 శాతానికి చేరాలని కోరారు. ఉద్యోగులు కష్టపడి తేనే.. ప్రజలు సమస్యలు పరిష్కరిస్తేనే ప్రభుత్వానికి మంచి పేరు వస్తుందని రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు.

---

# దేశ భద్రత విషయంలో రాజీ పడే ప్రసక్తే లేదు

(మొదటి పేజీ తరువాయి)

నెట్‌వర్క్‌లకు మద్దతు ఇస్తున్న వారు వెంటనే తమ సంబంధాలు తెంచుకోవాలని.. లేనిపక్షంలో వారి బండారం బయటపడడం ఖాయమన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా మార్గదర్శకత్వంలో కేంద్ర సంస్థలు మావోయిస్ట్ నెట్‌వర్క్ వద్దే ఆగవని.. అవినీతి, నేరాలు, తీవ్రవాద సంబంధాలను కాపాడే వ్యవస్థ మొత్తం వెలికి తీసి కఠినంగా అణచివేస్తాయన్నారు. ఎవరైనా సరే.. ఎంత పెద్దవారైనప్పటికీ.. దేశ భద్రత విషయంలో మావోయిస్టుల వైపు నిలబడితే క్షమించేది లేదన్నారు. జాతీయ భద్రతకు విఘాతం కలిగించే వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.ఇదిలా ఉండగా.. ఇటీవల మావోయిస్ట్ అగ్రనేత మల్లోజుల వేణుగోపాల్ సహా పలువురు మావోయిస్టులు లొంగిపోయిన విషయం తెలిసిందే. అయితే, ఆయన మావోయిస్టులతో తెలంగాణకు చెందిన పలువురు రాజకీయ నేతలకు సంబంధాలు ఉన్నట్లుగా పేర్కొన్నారు. మల్లోజుల వేణుగోపాల్ అలియాస్ భూపతి, మావోయిస్ట్ పార్టీలో అంతర్గత విభేదాలు ఉన్నాయని పేర్కొన్నారు. మావోయిస్టు గెరిల్లాలు, కొందరు తెలంగాణ రాజకీయ నేతల మధ్య కుమ్మక్కైనట్లుగా మల్లోజుల చెప్పినట్లుగా జాతీయ మీడియాలో వార్తలు వచ్చాయి. ప్రస్తుతం ఈ అంశంపై

---

# రేవంత్ రెడ్డికి బూతులు, ప్రతిపక్షాలపై తిట్లు తప్ప.. రైతుల మీద సోయి లేదు.. హరీశ్‌రావు ధ్వజం

**హైదరాబాద్ అక్టోబర్ 19 :–** రేవంత్ రెడ్డికి బూతులు.. ప్రతిపక్షాల మీద తిట్లపై ఉన్న సోయి రైతుల మీద లేదని మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత హరీశ్‌రావు విమర్శించారు. రేవంత్ రెడ్డికి తిట్ల మీద ధ్యాస తప్ప.. పత్తి, మొక్క జొన్న రైతుల తిప్పలు కనపడటం లేదా అని ప్రశ్నించారు. యుద్ధప్రాదిపాదికన కొనుగోలు కేంద్రాలు ప్రారంభించాలని



డిమాండ్ చేశారు.సిద్దిపేట జిల్లా చిన్నకోడూరు మండలం గంగాపూర్ రైతులతో హరీశ్‌రావు ముచ్చటించారు. వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడుతూ.. అధిక వర్షాలు పడి ఇప్పటికే పత్తి రైతులకు దిగుబడి తగ్గి నష్టం వచ్చిందని.. ఉన్న పత్తిని కొనక కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు మరింత నష్టం చేస్తుందని తెలిపారు. పత్తి మద్దతు ధర 8వేల 100 ఉంటే ప్రభుత్వం కొనక దళారులకు రైతులు 5వేల 900 లకు అమ్ముకుంటున్నారని పేర్కొన్నారు. ఈ ప్రభుత్వం పత్తి రైతులకు క్వింటాలుకి 2వేల రూపాయలు నష్టం కలిగిస్తుందని అన్నారు.రాష్ట్రంలో 6లక్షల ఎకరాలు మొక్క జొన్న సాగు జరిగిందని హరీశ్‌రావు తెలిపారు. మక్కలు మార్కెట్ లో పెట్టుకుని రైతులు పడిగాపులు కాస్తున్నారని పేర్కొన్నారు. ఇప్పటికే 30%– 40% వరకు రైతులు దళారులకు అమ్ముకుంటున్నారని అన్నారు. ప్రభుత్వం ఇచ్చే మద్దతు ధర 2420.. దళారులకు అమ్ముకోవడం వల్ల క్వింటాలుకు 500 రూపాయలు నష్టం కలుగుతుందని చెప్పారు. ప్రభుత్వ నిర్లక్ష్యం వలన ఎకరానికి రైతులకు రూ. 10వేలు నష్టం వస్తుందని అన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో సకాలంలో మక్కలు కొన్నామని.. కానీ ఇప్పుడు కాంగ్రెస్ సర్కార్‌లో మక్కలు చేతికి అందిన ఫలితం దక్కడం లేదని పేర్కొన్నారు.సీఎం రేవంత్ రెడ్డికి ప్రతిపక్షాల మీద నోరు పారేసుకునుడే తప్ప రైతుల మీద పట్టింపు లేదని హరీశ్‌రావు విమర్శించారు. రెండు రైతుబంధులు ఇచ్చిండు... రెండు రైతుబంధులు ఎగ్గొట్టిండని మండిపడ్డారు. సగం ఋణ మాఫీ చేసిండు..

---

# గిన్నిస్‌కెక్కిన అయోధ్య 'దీపోత్సవం'..

**అయోధ్య, అక్టోబర్ 19 :–** దీపావళి పండుగ వేళ శ్రీరాముడు కొలువైన అయోధ్యలో దీపోత్సవం కన్నులపండువగా జరిగింది. వేలాదిగా తరలివచ్చిన భక్తులు 26 లక్షలకు పైగా దివ్వెలను వెలిగించారు. ఇంత భారీ మొత్తంలో దీపాలను వెలిగించడం భారీ జనసందోహంతో హారతి కార్యక్రమం నిర్వహించడం ద్వారా రెండు ప్రపంచ రికార్డులు ఈ పవిత్ర నగరానికి దాసోహమయ్యాయి. భక్తిపారవశ్యంతో చేపట్టిన ఈ మహత్తర ఘట్టాన్ని వీక్షించిన గిన్నిస్ బుక్ ప్రతినిధులు ఫిదా అయిపోయారు. మెగా దీపోత్సవాన్ని అద్భుతంగా నిర్వహించినందుకు యూపీ ముఖ్య మంత్రి యోగి ఆదిత్యనాథ్‌కు గిన్నిస్ సర్టిఫికెట్లు అందజేశారు.చోటీ దివాలీని పురస్కరిం చుకొని.. సరయూ నది ఒడ్డున ఒడిశా పర్యాటక శాఖ, ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం, జిల్లా యంత్రాంగం సంయుక్తంగా దీపోత్సవాన్ని నిర్వహించింది.

# తెలుగు ప్రజలకు ఏపీ సీఎం చంద్రబాబు దీపావళి శుభాకాంక్షలు

(మొదటి పేజీ తరువాయి)

భావించే దీపాన్ని ఆరాధించే పవిత్ర దినం అయిన దీపావళి సందర్భంగా రాష్ట్ర ప్రజలకు శుభాకాంక్షలు. లోకాన్ని పీడిస్తున్న నరకాసురుడు అనే రాక్షసుడిని శ్రీకృష్ణ, సత్యభామ కలిసి వధించిన రోజు ఇది. దీపావళి అంటేనే చీకట్లను పారద్రోలి వెలుగులు తీసుకువచ్చే పండుగ. ఈ దీపావళి పండుగ ప్రజల జీవితాల్లో మరిన్ని వెలుగులు తీసుకురావాలని.. రాష్ట్రం ప్రగతితో ప్రకాశించాలని ఆకాంక్షిస్తున్నా' అని చంద్రబాబు పేర్కొన్నారు.

# ఇంతకు ముందు లెక్క ఉండది.. అందరి లెక్కలు తేలుస్తాం : కేటీఆర్

(మొదటి పేజీ తరువాయి)

పేదల వద్ద నివాస పత్రాలు ఉన్నా రాత్రికి రాత్రే కూల్చివేస్తున్నారని ఆరోపించారు. సీఎం రేవంత్ సోదరుడు తిరుపతి రెడ్డి ఇల్లు చెరువులోనే ఉందని.. ఆ ఇంటి జోలికి మాత్రం వెళ్లడం లేదన్నారు. పట్నం మహేందర్‌రెడ్డి గెస్ట్‌హౌస్ చెరువులో ఉన్నా పట్టించుకోవడం లేదన్నారు. మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, వివేక్ ఇళ్లు చెరువులోనే ఉన్నా వాటిని ముట్టుకోవడం లేదని.. కేవీపీ రామచంద్రరావు ఇంటి జోలికి కూడా వెళ్లడం లేదని.. పెద్ద ఇండ్ల అడ్రస్‌లు కూడా హైడ్రాకు తెలియదంటూ సెటైర్లు వేశారు. పేదల ఇళ్లు కూలిస్తే అడిగేవారే లేరని భావిస్తున్నారన్నారు. పెద్దల వద్ద డబ్బులు గుంజి బెదిరింపులకు దిగుతున్నారని.. రియల్ ఎస్టేట్ కుప్పకూలడానికి ప్రభుత్వ విధానాలే కారణమని మండిపడ్డారు.ఈ దిక్కుమాలిన ఆలోచనలు, విధానాలతోనే రాష్ట్రంలో రియల్ ఎస్టేట్ కుప్పకూలిపోయిందని విమర్శించారు. అధికారంలోకి రాగానే సీఎం మొదట దెబ్బకొట్టింది రాజేంద్రనగర్ నియోజకవర్గాన్నేనన్నారు. 2023 కేబినెట్ భేటీలో 400 కిలోమీటర్ల మెట్రో మంజూరు చేశామని.. ఎయిర్‌పోర్టు మెట్రోకు టెండర్లు పూర్తి చేస్తే రేవంత్ వచ్చాక రద్దు చేశారని.. తనకు భూములు ఉన్నాయనే అనుమానంతో ఆ పని చేశారని విమర్శించారు. రాజేంద్రనగర్‌లో భూములున్నాయని సబితా ఇంద్రారెడ్డిపై ఆరోపణలు చేశారని.. భూములు చూపితే రాసిస్తానని సబితా ఇంద్రారెడ్డి చెబుతున్నారన్నారు. రేవంత్‌రెడ్డికి తాను బంపర్ ఆఫర్ ఇస్తున్నా.. భూములు ఎక్కడున్నాయో చూపించాలని.. కంపెనీలు, భవనాలు నావేనని చెబుతూ రెండేళ్లుగా జల్లెడ పడుతున్నారన్నారు. గత దీపావళికి మంత్రి బాంబులేటి.. బాంబులు పేలుతాయని చెప్పారని.. మళ్లీ దీపావళి వచ్చిందంటూ చురకలంటించారు. బీఆర్ఎస్ హయాంలో పారిశ్రామికవేత్తలకు గొడుగులు పట్టి తీసుకువెళ్లామని.. కాంగ్రెస్ పాలనలో పారిశ్రామివేత్తలకు తుపాకులు పెడుతున్నారని.. ప్రభుత్వం చేయాల్సిన పనులు చేయకుండా దందాలు చేస్తోందని తీవ్రస్థాయిలో మండిపడ్డారు.

# తెలంగాణలో మళ్లీ వానలు..!

(మొదటి పేజీ తరువాయి)

విస్తరించి ఉందని.. దాని ప్రభావంతో మంగళవారం నాటికి ఆగ్నేయ బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడే అవకాశం ఉందని పేర్కొంది. ఇది 48 గంటల్లో పశ్చిమ వాయువ్య దిశగా కదులుతూ దక్షిణ మధ్య బంగాళాఖాతంలో వాయుగుండంగా బలపడే అవకాశం ఉందని ఉందని చెప్పింది. ఈ క్రమంలో ఆదివారం కొత్తగూడెం, ఖమ్మం, మహబూబాబాద్, వరంగల్, హన్మకొండ, జనగాం, యాదాద్రి భువనగిరి, రంగారెడ్డి, వికారాబాద్, మహబూబ్‌నగర్, నాగర్ కర్నూల్, వనపర్తి, నారాయణపేట, జోగులాంబ గద్వాల జిల్లాల్లో మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని పేర్కొంది.సోమ, మంగళవారాల్లో పలుచోట్లు ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో కూడిన వానలు కురిసే అవకాశం ఉందని పేర్కొంది. బుధవారం కరీంనగర్, పెద్దపల్లి, భూపాలపల్లి, ములుగు, కొత్తగూడెం, ఖమ్మం, నల్గొండ, సూర్యాపేట, మహబూబాబాద్, వరంగల్, హన్మకొండ, జనగాం, సిద్దిపేట, యాదాద్రి భువనగిరి, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్ మల్కాజ్‌గిరి, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి, మహబూబ్‌నగర్, నాగర్ కర్నూల్, వనపర్తి, నారాయణపేట జిల్లాల్లో వానలు కురిసే ఛాన్స్ ఉందని వివరించింది. ఈ మేరకు ఆయా జిల్లాలకు ఎల్లో అలెర్ట్ జారీ చేసింది. ఇదిలా ఉండగా.. గడిచిన 24గంటల్లో పలుచోట్ల తేలికపాటి నుంచి మోస్తరు వర్షం కురిసింది. ఖమ్మం, కొత్తగూడెంలో వర్షాలు కురిశాయని టీజీడీపీఎస్ వివరించింది.

# నక్సల్స్ రహిత జిల్లాలకు మహర్దశ: కిషన్ రెడ్డి

(మొదటి పేజీ తరువాయి)

రహిత జిల్లాలుగా మారుతాయని, వాటికీ మహర్ధశ పడుతుందన్నారు. వచ్చే ఏడాది మార్చి నెలాఖరు నాటికి దేశంలో నక్సలిజం పూర్తిగా అంతమొందించాలని కేంద్రం పట్టుదలగా ఉందని ఆయన వివరించారు.'ఆపరేషన్ కగార్'తో సత్ఫలితాలు వస్తున్నాయని, ఇప్పటికే వందలాది మంది నక్సల్స్ లొంగిపోవడానికి ముందుకు వస్తున్నారని ఆయన తెలిపారు. నక్సల్స్ ముందుకు వచ్చి హింసా మార్గాన్ని వదిలి జనజీవన స్రవంతిలో కలిసేందుకు ముందుకు రావడాన్ని స్వాగతిస్తున్నానని అన్నారు. హింస ద్వారా ప్రజాస్వామ్య వ్యవస్థలో ఏమీ సాధించలేరనే సందేశం మరోసారి స్పష్టమైందని ఆయన తెలిపారు. త్వరలోనే దేశంలో నక్సల్స్ రహిత జిల్లాలుగా మాతుతాయని ఆయన చెప్పారు. ఇంతకాలం నక్సలిజం కారణంగా అనేక జిల్లాలు అభివృద్ధికి నోచుకోలేదని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు.

# వైసీపీపై పవన్ కల్యాణ్ సంచలన వ్యాఖ్యలు

(మొదటి పేజీ తరువాయి)

ప్రజాస్వామ్య యుద్ధంలో ప్రజలు ఓడించారని వ్యాఖ్యనించారు. వైసీపీ నాయకులు ప్రజల మధ్య విభేదాలు సృష్టించి అశాంతి రేకెత్తిస్తున్నారని ఆరోపించారు.

# రక్షిత దీపావళి కోసం కరీంనగర్ పోలీస్ కమిషనరేట్ సమగ్ర మార్గదర్శకాలు జారీ: గౌష్ ఆలం, ఆధ్వర్యంలో భద్రతా చర్యలులి

**చర్చ :- కరీంనగర్ :**కరీంనగర్ రాబోయే దీపావళి పండుగను సురక్షితంగా, ప్రశాంతంగా మరియు ప్రమాద రహితంగా జరుపుకునేందుకు కరీంనగర్ పోలీసు కమీషనరేట్, పోలీస్ కమీషనర్ శ్రీ గౌష్ ఆలం, మార్గదర్శకత్వంలో, ప్రజలకు సమగ్ర భద్రతా జాగ్రత్తలు మరియు మార్గదర్శకాలను శనివారంనాడు జారి చేశారు. అగ్ని ప్రమాదాలు, గాయాలు మరియు శబ్ద కాలుష్యాన్ని నివారించడానికి బాధ్యతాయుతంగా మరియు జాగ్రత్తగా జరుపుకోవాల్సిన అవసరాన్ని శ్రీ గౌష్ ఆలం, తెలిపారు. ముఖ్యంగా బాణసంచా వాడకం, దీపాలు వెలిగించడం మరియు పర్యావరణ పరిరక్షణకు సంబంధించి ప్రజలు తప్పనిసరిగా పాటించాల్సిన ముఖ్యమైన జాగ్రత్తలు:



### బాణసంచా భద్రతా మార్గదర్శకాలు

- లైసెన్స్ పొందిన విక్రేతల నుండి మాత్రమే కొనుగోలు: ప్రజలు అధికారం కలిగిన మరియు లైసెన్స్ పొందిన విక్రేతల నుండి మాత్రమే పటాకులను కొనాలని సూచించారు.
- బహిరంగ స్థలంలో మాత్రమే కాల్చాలి: నివాస ప్రాంతాలు, భవనాలు, మండే పదార్థాలకు దూరంగా, నియమించబడిన,
- 'డడ్' క్రాకర్ల విషయంలో జాగ్రత్త: మండని క్రాకర్‌ను తిరిగి వెలిగించడానికి ప్రయత్నించవద్దు. 15-20 నిమిషాలు వేచి ఉండి, ఆపై పారవేయడానికి ముందు నీటిలో నానబెట్టండి.
- నిషిద్ధ స్థలాలు: ఇళ్ల లోపల, టెర్రస్‌లపై లేదా మూసివేసిన ప్రదేశాలలో బాణసంచా కాల్చడం ఖచ్చితంగా నివారించాలి.
- గురిపెట్టడం వద్దు: వెలిగించిన క్రాకర్లను ప్రజలు, జంతువులు లేదా నిర్మాణాల వైపు గురిపెట్టడం లేదా విసిరేయడం చేయవద్దు.

### దియా మరియు లైటింగ్ భద్రత

- స్థిరమైన ప్లేస్‌మెంట్: దియాలు మరియు కొవ్వొత్తులను స్థిరమైన, మండని ఉపరితలాలపై ఉంచండి.
- దూరం పాటించండి: వాటిని కర్టెన్లు, కాగితపు అలంకరణలు మరియు విద్యుత్ వైర్లకు దూరంగా ఉంచాలి.

### గమనించకుండా వదిలివేయవద్దు:

వెలిగించిన దియాలు లేదా కొవ్వొత్తులను గమనించకుండా వదిలివేయవద్దు. పడుకునే ముందు లేదా గది నుండి బయటకు వెళ్లే ముందు వాటిని ఆర్పివేయండి.

- విద్యుత్ అలంకరణలు: ధృవీకరించబడిన నాణ్యత కలిగిన లైట్లను మాత్రమే ఉపయోగించండి మరియు సాకెట్లను ఓవర్‌లోడ్ చేయకుండా ఉండండి.

### శబ్దం మరియు పర్యావరణ ఆందోళనలు

- సమయ పరిమితులు: క్రాకర్లు పేల్చడానికి గౌరవనీయులైన సుప్రీంకోర్టు ఆదేశించిన సమయ పరిమితులను ఖచ్చితంగా పాటించడం తప్పనిసరి.
- నిశ్శబ్ద మండలాలు: ఆసుపత్రులు, నర్సింగ్ హోమ్‌లు మరియు విద్యాసంస్థలు వంటి 'నిశ్శబ్ద మండలాలు' సమీపంలో పటాకులు పేల్చడం ఖచ్చితంగా నిషేధించబడింది.
- గ్రీన్ క్రాకర్లను ప్రోత్సహించండి: గాలి మరియు శబ్ద కాలుష్యాన్ని తగ్గించడానికి తక్కువ ధ్వని, పర్యావరణ అనుకూలమైన ('గ్రీన్') పటాకులను ఉపయోగించాలని పౌరులను ప్రోత్సహించడం జరిగింది.

### అత్యవసర సంప్రదింపు నంబర్లు

ఏదైనా అత్యవసర పరిస్థితి, అగ్నిప్రమాదం లేదా ప్రమాదం సంభవించినప్పుడు, ప్రజలు తక్షణ సహాయం కోసం వెంటనే ఈ క్రింది నంబర్లను సంప్రదించాలని సూచించారు:


- పోలీస్ కంట్రోల్ రూమ్ : 100
- ఫైర్ కంట్రోల్ రూమ్: 101
- ఎమర్జెన్సీ రెస్పాన్స్ సపోర్ట్ సిస్టమ్ : 112

కరీంనగర్ పోలీస్ కమిషనరేట్ పండుగ వాతావరణాన్ని కాపాడటానికి, చట్టం మరియు శాంతిభద్రతలను నిర్వహించడానికి పూర్తిగా సంసిద్ధంగా ఉందని మరియు పౌరులు తమ వంతు సహకారం అందించి, ఈ దీపావళిని సురక్షితమైన మరియు సంతోషకరమైన పండుగగా జరుపుకోవాలని సీపీ కోరారు.

# తెలంగాణ విద్యార్థి, ఉద్యమ నాయకురాలు 'మంజుల'ను ఆదుకోరూ

- గుండె, లివర్ సమస్యతో ఇబ్బందులు
- ఆర్థిక ఇబ్బందులతో అరకొర వైద్యంతో సరిపెట్టుకుంటున్న వైనం
- ఇంటికే పరిమితం దాతలు ఆదుకోవాలని విజ్ఞప్తి







**చర్చ, భద్రాద్రి కొత్తగూడెం:**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పినపాక నియోజకవర్గం గుండాల మండలం మారుమూల లింగగూడెం గ్రామానికి చెందిన జాడి మంజుల గత 15 సంవత్సరాలుగా గుండెవాపు, ఊపిరితిత్తుల్లో బిపి పెరుగుతూ తీవ్ర అనారోగ్య సమస్యతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మంజుల సాంఘిక సంక్షేమ వసతి గృహాల్లో సాగింది. ఉన్నత విద్య అభ్యసించిన అనంతరం వామపక్ష భావజాలం కలిగిన సిపిఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ అనుబంధ విద్యార్థి సంఘం పిడిఎస్‌యూలో చేరి తనదైన శైలిలో విద్యార్థుల సమస్యలపై అనేక పోరాటాలు చేసింది. మలిదశ తెలంగాణ ఉద్యమ సమయంలో విద్యార్థి జేఏసీలో కీలకపాత్ర పోషించి, అనేక కార్యక్రమాల్లో క్రియాశీలకంగా ముందు వరుసలో ఉండి ఉద్యమించింది. తెలంగాణ ఉద్యమంలో జిల్లా స్థాయి నుండి రాష్ట్ర స్థాయి దాకా మహిళా విద్యార్థి నాయకురాలుగా పేరు ప్రఖ్యాతలు సంపాదించుకుంది.

తెలంగాణ ఉద్యమ జాతిపిత జయశంకర్ నుండి కోదండరాం వరకు అలాగే తెలంగాణ ఉద్యమాన్ని రగిలించిన ఉద్యమ నేత కెసిఆర్, హరీష్ రావు, ఈటెల రాజేందర్ వరకు మంజుల సుపరిచితురాలు. 2013 తెలంగాణ ఉద్యమ సమయంలో సహచర విద్యార్థి ఉద్యమకారుడు, తెలంగాణ జానపద, ధూంధాం కళాకారుడు కొండ జంపన్నతో కులాంతర, ఆదర్శ వివాహం చేసుకున్నారు. అనంతరం కొత్తగూడెంలోనే వివాహ జీవితం కుమారుడికి జన్మనిచ్చిన తరువాత 2015లో అనారోగ్యానికి గురైంది. హైదరాబాద్ అపోలో హాస్పిటల్‌లో వైద్య చికిత్స పొందుతూ ఎన్ని ఇబ్బందులు ఉన్నా ఉద్యమానికి దూరం కాకూడదని పీడీఎస్‌యూ, పిఓడబ్ల్యులో చేరి అనేక కార్యక్రమాలు చేపట్టింది. 2019 సంవత్సరంలో తిరిగి అనారోగ్య సమస్య తీవ్రతరం కావడంతో అపోలో ఆస్పత్రిలో చికిత్స తీసుకుంటున్న సమయంలో డాక్టర్లు గుండె, లివర్ రెండు మార్చాలని, లేకపోతే బ్రతకడం కష్టమని చెప్పారు.

### ఆర్థిక ఇబ్బందులతో ఇంటికే పరిమితం...

ప్రస్తుతం గత ఐదు నెలలుగా పూర్తిగా అనారోగ్యం పాలైన మంజుల బయటకు రాలేని పరిస్థితులు దాపురించినాయి. తెలంగాణ ఉద్యమ ఉద్యోగ సంఘ నాయకులు సంగం వెంకట పుల్లయ్య సహకారంతో హైదరాబాదులోని మహావీర్ హాస్పిటల్‌లో చికిత్స పొందుతోంది. గుండె, లివర్ మార్చాలంటే ఖర్చు కూడా లక్షల్లో అవుతుందని వైద్యులు స్పష్టం చేశారు. ఇప్పటికే చాలా డబ్బులు వైద్య చికిత్సకు పెట్టామని, అప్పుల్లో కూరుకుపోయామని, తీవ్ర ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్నట్లు మంజుల తెలిపారు. లక్షలు ఖర్చు పెట్టి వైద్యం చేయించుకోలేని అతి నిరుపేద కుటుంబానికి చెందిన జాడి మంజుల పరిస్థితి నేడు అత్యంత దయనీయంగా మారింది. ప్రస్తుతం స్నేహితులు, తెలంగాణ సంక్షేమ సంఘం నాయకులు, శ్రేయోభిలాషులు, కొంతమంది తమ శక్తి మేరకు ఆర్థిక చేయూతను అందిస్తున్నా అవి వైద్య చికిత్సకు ఏమాత్రం సరిపోవడంలేదని ఆవేదన వ్యక్తం చేస్తోంది. ఆస్పత్రిలో ఉంటూ వైద్యం చేయించుకోలేని స్థితిలో మంజుల ఇంటివద్దనే ఉంటుంది. మెరుగైన వైద్యం కోసం ఎదురుచూస్తున్న మంజులకు దాతలు ముందుకు వచ్చి ఆర్థిక చేయూతను అందించాలని మంజులతోపాటు తెలంగాణ ఉద్యమకారులు, తోటి మిత్రులు విజ్ఞప్తి చేస్తున్నారు. చేయూతనందించదలచిన దాతలు ఫోన్ పే, గూగుల్ పే నెంబర్ 9704732305, 9640542268 ద్వారా ఆర్థికసాయం అందించి ప్రాణాన్ని నిలబెట్టాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

# ఐకెపి హమాలీలకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేసి,ఒకే రకమైన కూలీ రెట్లు ఇవ్వాలి

- ఏఐటీయూసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్. బాల్ రాజు
- కార్మికులకు అండగా సిపిఐ ఉంటుంది.
- సిపిఐ జిల్లా కార్యదర్శి పంజాల శ్రీనివాస్.






**చర్చ :- కరీంనగర్ :**రాష్ట్రవ్యాప్తంగా ఐకెపి కోఆపరేటివ్ సొసైటీ సెంటర్స్ లలో పనిచేస్తున్న హమాలీ కార్మికులందరికీ ప్రభుత్వం ప్రత్యేకమైన సంక్షేమ బోర్డు ఏర్పాటు చేసి హమాలీల అందరికీ ఒకే రకమైన కూలి రేట్లు ఇవ్వాలని ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్ బాల్ రాజు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.
ఆదివారం కరీంనగర్ నగరంలోని బద్దం ఎల్లారెడ్డి భవన్ లో జిల్లా ఐకెపి కోఆపరేటివ్ సొసైటీ సెంటర్స్ హమాలీ కార్మిక సంఘం జిల్లా జనరల్ బాడీ సమావేశం అధ్యక్షులు నెల్లి రాజేశం అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశమునకు ముఖ్యఅతిథిగా హాజరైన బాల్ రాజు మాట్లాడుతూ సంవత్సరానికి రెండుసార్లు మాత్రమే పని ఉండే హమాలీ కార్మికులు చాలీచాలని కూలీలతో తమ కుటుంబాలను పోషించుకుంటూ అటు ప్రభుత్వానికి ఇటు రైతులకు మేలు చేస్తున్నారని, హమాలీల కష్టానికి తగ్గ ఫలితం దక్కడం లేదని, రోజురోజుకు నిత్యవసర వస్తువుల ధరలు పెరిగిపోతున్నాయని హమాలీల కూలి రేట్లు మాత్రం పెరగడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఐకెపి కోఆపరేటివ్ సొసైటీ సెంటర్స్ లలో కార్మికులందరికీ కనీస మౌలిక సదుపాయాలు ప్రభుత్వం కల్పించాలని, త్రాగునీరు, మెడికల్ కిట్టు, టెంట్లు ఇతర సదుపాయాలు కల్పించాలని, ప్రతి హమాలీ కార్మికునికి మండల తహసీల్దార్ చే గుర్తింపు కార్డులు ఇవ్వాలని, పనిచేస్తున్న క్రమంలో హమాలీ కార్మికులకు ప్రమాదవశాత్తు ఏదైనా ప్రమాదం జరిగితే ప్రభుత్వమే హాస్పిటల్ ఖర్చులు భరించి చికిత్స అందించి వారి కుటుంబాలను ఆదుకోవాలని,ప్రతి కార్మికునికి హెల్త్ ఇన్సూరెన్స్ ప్రభుత్వమే చేయించి ఇవ్వాలని, కేంద్ర ప్రభుత్వ రాష్ట్ర ప్రభుత్వ ఆధీనాల్లో ఉన్న సివిల్ సప్లై గోదాముల్లో పనిచేస్తున్న కార్మికులకు ఏ విధమైన కూలి రేట్లు ఇస్తున్నారో ఐకెపి కో-ఆపరేటివ్ సొసైటీ సెంటర్లలో పనిచేసే కార్మికులకు కూడా ఆ కూలి రేట్లు వర్తింపచేయాలని, ఈ ఎస్ ఐ పి ఎఫ్ సౌకర్యాన్ని కల్పించాలని బాల్ రాజు కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు.సిపిఐ జిల్లా కార్యదర్శి పంజాల శ్రీనివాస్ మాట్లాడుతూ కార్మికుల,కర్షకుల సంక్షేమం వారి హక్కుల పరిరక్షణ కనీస వేతనాల కోసం పోరాటాలు నిర్వహించే ప్రతి కార్మికులకు సిపిఐ అండగా ఉంటుందని, శ్రమకు తగ్గ ఫలితం ఉండాలంటే కార్మికులంతా ఐక్యంగా ఉండాలని,స్థానిక కార్మికుల పొట్టలు కొట్టే ఇతర రాష్ట్రాల కార్మికులకు ఎవ్వరు కూడా పని కల్పించకూడదని, జిల్లావ్యాప్తంగా ఐకెపి సోసైటీ సెంటర్స్ లలో పనిచేసే అమాలి కార్మికులందరికీ ఎక్కడ ఎప్పుడు ఎలాంటి ఆపద వచ్చిన సిపిఐ ముందుండి వారి కోసం పోరాడుతుందని, కార్మికులందరికీ అత్యంత భరోసా కల్పించే జెండా ఎర్రజెండా మాత్రమేనని, కార్మికుల హక్కులను కాల రాస్తే పాలక ప్రభుత్వాలపై కార్మికుల తో కలిసి పోరాటాలు నిర్వహిస్తామని పంజాల శ్రీనివాస్ పేర్కొన్నారు ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు కటికరెడ్డి బుచన్న యాదవ్ మాట్లాడుతూ కరీంనగర్ జిల్లాలో ఐకెపి కోఆపరేటివ్ సొసైటీ సెంటర్స్ లలో వేలాదిమంది హమాలి కార్మికులు పనిచేస్తున్నారని, అసంఘటిత రంగంలో పనిచేస్తున్న వారికి పని భద్రత లేదని, కూలి రేట్ల పెంపు కోసం గతంలో అనేకసార్లు జిల్లా అధికారులకు విన్నవించినప్పటికీ హమాలీలకు పనికి తగ్గ కూలి ఇవ్వకపోవడం మూలంగా హమాలీల కుటుంబాలు తీవ్ర దుర్భర పరిస్థితుల్లో ఉన్నారని వారిని ప్రభుత్వం అధికారులు ఆదుకోవాలని బుచ్చన్న యాదవ్ కోరారు. ఈ జనరల్ బాడీ సమావేశంలో జిల్లా ఐకేపీ, కో - ఆపరేటివ్ సొసైటీ సెంటర్స్ హమాలీ కార్మికుల సంఘం జిల్లా అధ్యక్షుడు నెల్లి రాజేశం,ప్రధాన కార్యదర్శి కటికరెడ్డి బుచన్న యాదవ్, ఏఐటీయూసీ జిల్లా సహాయ కార్యదర్శి పిట్టల సమ్మయ్య,హమాలీ కార్మిక సంఘం జిల్లా నాయకులు జంగం లింగయ్య, ఓజ్జ కొమురయ్య, మొగిలిపాలెం మల్లేశం, నాళం భూమయ్య,గంగుల ఐలయ్య,పినిశెట్టి రాజు,గుర్తురి శ్రీనివాస్, శాతరాజు సంపత్, బోయిని సంజీవ్,మెరుగు కొమురయ్య,గజ్జె అంజయ్య,సాగంటి రాజు తదితరులు పాల్గొన్నారు

# చెన్నారావు కుటుంబానికి మంత్రి తుమ్మల పరామర్శ



**చర్చ, అశ్వారావుపేట:** రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తన సమీప బంధువు అయినా తుమ్మల చెన్నారావు కుటుంబ సభ్యులను దమ్మపేట మండలం గండుగులపల్లిలో ఆదివారం పరామర్శించారు. చెన్నారావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను ఓదార్చారు. తుమ్మల వెంట దమ్మపేట సీనియర్ నాయకులు ఆలపాటి ప్రసాద్, పైడి వెంకటేశ్వరరావు, అచ్యుతరావు, కాసాని నాగప్రసాద్, కె.వి తోపాటు, సత్తుపల్లి నియోజకవర్గ సీనియర్ నాయకులు చల్లగుళ్ళ నరసింహారావు, విద్యాసంస్థల అధినేత చలసాని సాంబశివరావు, తదితరులు ఉన్నారు.

# పంచారామాలకు ఇల్లందు నుంచి ప్రత్యేక బస్‌లు

**చర్చ, ఇల్లందు:**కార్తీక మాసం సందర్భంగా ఇల్లందు నుండి ప్రముఖ పుణ్యక్షేత్రాలైన అన్నవరంనకు డీలక్స్ బస్, పంచారామాలకు ప్రత్యేక సూపర్‌లగ్జరీ బస్సులు నడపనున్నట్లు డిపో ఇన్‌చార్జి ఇ. సునీత, విలేజ్ బస్ ఆఫీసర్ వేమూరి నాగరాజులు ఒక ప్రకటనలో తెలిపారు. కార్తీక మాసంలో ఈనెల 26, నవంబర్ 2, 9, 16 తేదీల్లో రాత్రి 9 గంటలకు ఇల్లందు నుండి పంచారామాలకు సూపర్‌లగ్జరీ బస్సు బయలుదేరుతుందన్నారు. పంచారామాలకు పెద్దలకు రూ.2250, పిల్లలకు రూ.1150, అన్నవరంనకు పెద్దలకు రూ.780, పిల్లలకు రూ.440గా చార్జీలు నిర్ణయించినట్లు వివరించారు. కార్తీక పౌర్ణమి సందర్భంగా నవంబర్ 4న కూడా సూపర్ లగ్జరీ బస్సు నడుపుతున్నట్టు చెప్పారు. ఇల్లందు డిపో పరిధిలోని భక్తులు ఈ సదవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని వారు భక్తులను కోరారు.

# ఇందిరా మహిళా శక్తి క్రాకర్స్ దుకాణాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే



**చర్చ, అశ్వారావుపేట:** డ్వాక్రా మహిళలకు బ్యాంకు లింకేజీ ద్వారా ప్రభుత్వం మంజూరు చేసినటువంటి రుణాలతో అశ్వారావుపేట మున్సిపాలిటీలోని స్వయం సహాయక సంఘాలు ఆర్థికంగా అభివృద్ధి చెందాలనే ఉద్దేశంతో ఏర్పాటు చేసిన దీపావళి క్రాకర్స్ షాప్‌ను ఎమ్మెల్యే జారే చేతుల మీదుగా ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం మహిళల అభివృద్ధి కోసం అనేక సంక్షేమ కార్యక్రమాలు తీసుకురావడం జరుగుతుందని చెప్పారు. ప్రభుత్వం నిర్దేశించినటువంటి రుణాలను సక్రమంగా వినియోగించుకుని మహిళలు ఆర్థికంగా బలోపేతం కావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు తుమ్మా రాంబాబు, ఆత్మకమిటీ చైర్మన్ సుంకవల్లి వీరభద్రరావు, మండల నాయకులు జూపల్లి ప్రమోద్, ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# భవ్యశ్రీ లక్ష్మిని సత్కారించిన మాజీ ఎమ్మెల్యే మెచ్చా



**చర్చ, అశ్వారావుపేట:**జాతీయ స్థా యి చెస్ పోటీలకు ఎంపికైన డిఏవి స్కూ ల్ విద్యార్థిని భవ్యశ్రీ లక్ష్మిని మాజీ ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు ఆదివారం శాలువ కప్పి ఘనంగా సత్కరించారు. ఈ సంద ర్భంగా మెచ్చా నాగేశ్వరరావు మాట్లా డుతూ భవ్యశ్రీ చి న్న వయసులోనే జాతీయ స్థాయికి చేరడం గర్వకారణం అన్నారు. ఆమె ప్రతిభ అశ్వా రావుపేటకు పేరు ప్రఖ్యాతలు తీసుకువచ్చిందన్నారు. వచ్చే నెలలో డిల్లీలో జరగబోయే జాతీయ చెస్ టోర్నమెంట్‌లో కూడా విజయం సాధించి సత్తుపల్లికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. ద

# మెగా జాబ్ మేళా పోస్టర్‌ను ఆవిష్కరించిన మంత్రి తుమ్మల, ఎమ్మెల్యే




**చర్చ, సత్తుపల్లి:**సింగరేణి సంస్థ ఆధ్వర్యంలో సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి దయానంద్, కాంగ్రెస్ నాయకులు డాక్టర్ దయానంద్ విజయ్ కుమార్ కృషితో ఈనెల 26న వేంసూర్‌లోగల రాణి సెలబ్రేషన్ ఫంక్షన్ హాల్‌లో మెగా జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. ఈ మేరకు జాబ్‌మేళా పోస్టర్‌ను ఆదివారం మంత్రి తుమ్మల ఆవిష్కరించి మాట్లాడారు. హైదరాబాద్, బెంగళూరు నగరాలకు చెందిన 50కి పైగా కంపెనీల ప్రతినిధులు ఈ జాబ్ మేళాకు హాజరవుతారని, సత్తుపల్లిలో 3,000 మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించనున్నారని, నిరుద్యోగ యువతీ యువకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. జాబ్ మేళాకు ముందుగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలని చెప్పారు. సింగరేణి ప్రభావిత ప్రాంతాలలో ముఖ్యంగా కిష్టారం గ్రామాన్ని కాలుష్యం బారి నుంచి కాపాడేందుకు సింగరేణి సంస్థ ప్రణాళికబద్ధంగా పనిచేయాలని, అందుకు కావలసిన ప్రణాళికలను సిద్ధం చేయాలని మంత్రి తుమ్మల ఆదేశించారు. ఈ పోస్టర్ ఆవిష్కరణలో జేవిఆర్ ఓసి, పిఓ ప్రహ్లాద్, కిష్టారం ఓసి, పిఓ ఎన్.వి.నరసింహారావు, కాంగ్రెస్ సీనియర్ నాయకులు, చల్లగుళ్ల నరసింహారావు, దోడ్డా శ్రీనివాసరావు, పట్టణ అధ్యక్షులు గాదె చెన్నకేశవరావు, ఎండి కమల్ పాషా, పలువురు కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజల జీవితాల్లో దీపావళి వెలుగులు నింపాలి: కలెక్టర్ జితేష్ వి. పాటిల్




**చర్చ, భద్రాద్రి కొత్తగూడెం:** ప్రజల జీవితాల్లో దీపావళి పండుగ కోటి కాంతులు నింపాలని జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ ఆకాంక్షించారు. చీకటి మీద వెలుగు, చెడు మీద మంచి, దుష్ట శక్తుల మీద దైవశక్తి సాధించిన విజయానికి దీపావళి ప్రతీక అని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన జిల్లా ప్రజలందరికీ దీపావళి శుభాకాంక్షలు తెలిపారు. పండుగను కుటుంబ సభ్యులతో సంతోషభరితంగా, ఆనందోత్సవాలతో జరుపుకోవాలని సూచించారు. టపాసులు కాల్చేటప్పుడు అప్రమత్తంగా ఉండాలని, ముఖ్యంగా చిన్నపిల్లలు బాణాసంచా కాల్చేటప్పుడు తల్లిదండ్రులు తప్పనిసరిగా పర్యవేక్షణ చేయాలని అన్నారు. సురక్షితమైన పద్ధతుల్లో పండుగను జరుపుకోవడంతోపాటు ప్రమాదాలను నివారించుకోవాలని, పర్యావరణానికి హాని కలిగించే టపాసులు ఉపయోగించకుండా హరిత దీపావళి జరుపుకోవాలని కలెక్టర్ పిలుపునిచ్చారు.

## ఐద్వా డివిజన్ మహాసభను జయప్రదం చేయండి

- రాష్ట్ర కోశాధికారి మాచర్ల భారతి



చర్చ, సత్తుపల్లి:అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం సత్తుపల్లి డివిజన్ మహాసభ ఈనెల 27న సత్తుపల్లి పట్టణంలో జరగనుందని, ఈ మహాసభను జయప్రదం చేయాలని ఐద్వా రాష్ట్ర కోశాధికారి మాచర్ల భారతి పిలుపునిచ్చారు. ఆదివారం స్థానిక రావి వీర వెంకయ్య భవనంలో మహిళా సంఘం ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆమె మాట్లాడుతూ సమాజంలో మహిళల సమాన హక్కుల కోసం మహిళా సంఘం ఆధ్వర్యంలో మహత్తరమైన పోరాటాలు చేసి పలు హక్కులు సాధించుకున్నామన్నారు. చీప్ లిక్కర్ ప్రవేశపెట్టడానికి వ్యతిరేకిస్తూ పోరాడి, దానిని నిలువరించినట్లు చెప్పారు. లక్షల సంఖ్యలో ఉన్న ఇంటి పని వారిని సంఘటితపరిచి స్నేహ ఇంటి పని వాళ్ళ సంక్షేమ సంఘం ఏర్పాటు చేసి, కనీస వేతన చట్టం సాధించామన్నారు. పని హక్కు, ఆహార భద్రత, మద్యం, ప్రజా పంపిణీ వ్యవస్థ పటిష్టం తదితర అంశాలపై వేలాదిమంది మహిళలను కూడగట్టి హక్కులను సాధించుకున్నట్లు గుర్తుచేశారు. మహిళలపై పెరుగుతున్న హింస, అభద్రత, నిరుద్యోగం, తగ్గుతున్న స్త్రీ, పురుష నిష్పత్తి, విద్య, వైద్యం ప్రజలందరికీ అందుబాటులో లేకపోవడం, పెరుగుతున్న నిత్యవసరాల ధరలు, వారిని సమస్యల సుడిగుండంలోకి నెట్టివేస్తున్నాయి అన్నారు. కేంద్రంలో ఎన్డీఏ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఈ పదేళ్ల కాలంలో మహిళలు, మైనార్టీలు, దళితులు, అట్టడుగు వర్గాలకు భద్రత కరువైందన్నారు. ఈ సమావేశంలో సత్తుపల్లి, పెనుబల్లి, సత్తుపల్లి టౌన్, తల్లాడ మండల అధ్యక్ష కార్యదర్శులు జాజిరి జ్యోతి, మిట్టపల్లి నాగమణి, చెరుకు కుమారి, లలిత, లక్ష్మి కుమారి, పాకలపాటి ఝాన్సీ, బండి సత్యవతి, రజిని, పుష్పవల్లి, ప్రభావతి, రైతు సంఘం జిల్లా నాయకులు శీలం సత్యనారాయణ రెడ్డి, వ్యవసాయ కార్మిక సంఘం సత్తుపల్లి డివిజన్ కార్యదర్శి జాజిరి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.


## కరీంనగర్ అర్బన్ బ్యాంక్ ఎన్నికల బరిలో బీజేపీ ప్యానల్

- పోటీకి దింపాలని కేంద్ర మంత్రి బండి సంజయ్ పై ఒత్తిడి తెస్తున్న బీజేపీ శ్రేణులు
- బాస సత్యనారాయణ ఛాంబర్ లో బీజేపీ జిల్లా నేతల సమావేశం
- రేపో ఎల్లుండో తుది నిర్ణయం తీసుకోనున్న బండి సంజయ్



చర్చ :- కరీంనగర్ :కరీంనగర్ కోఆపరేటివ్ అర్బన్ బ్యాంకు ఎన్నికల షెడ్యూల్ వెలువడింది. రేపటి నుండి నామినేషన్ల పర్వం మొదలు కానుంది. నవంబర్ 1న ఎన్నికలు జరగబోతున్నాయి. కాంగ్రెస్ తరపున ప్యానెల్ ను నిలబెట్టేందుకు ఆ పార్టీ సిద్ధం కావడంతో భారతీయ జనతా పార్టీ సైతం ప్యానల్ ను బరిలోకి దింపాలని ఆ పార్టీ శ్రేణుల నుండి ఒత్తిళ్లు వస్తున్నాయి. ఈ మేరకు కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ పై ఆయ శ్రేణులు ఒత్తిడి తెస్తున్నాయి. ఈ నేపథ్యంలో బీజేపీ కరీంనగర్ జిల్లా అధ్యక్షులు గంగాడి క్రిష్ణారెడ్డి అధ్యక్షతన జిల్లా ముఖ్య నేతలు ఈరోజు పార్టీ మాజీ అధ్యక్షులు బాస సత్యనారాయణ నివాసంలో సమావేశమై అర్బన్ బ్యాంకు ఎన్నికల్లో ప్యానెల్ ను బరిలో దింపే అంశంపై సుధీర్ఘంగా చర్చించారు. గంగాడి క్రిష్ణారెడ్డి, బాస సత్యనారాయణతోపాటు మాజీ మేయర్లు సునీల్ రావు, డి.శంకర్, వాసాల రమేశ్, కోమాల ఆంజనేయులు, ఓదెలు, బోయినిపల్లి ప్రవీణ్ రావు. కన్నె క్రిష్ణ తదితరులు ఈ సమావేశానికి హాజరయ్యారు. ఎన్నికల్లో బీజేపీ పక్షాన ఇండిపెండెంట్ ప్యానెల్ ను బరిలో దించేతేనే బాగుంటుందనే అభిప్రాయాన్ని మెజారిటీ నేతలు వ్యక్తం చేశారు. ఈ విషయంలో బండి సంజయ్ పట్ల అర్బన్ బ్యాంక్ ఓటర్లకు సానుకూలత ఉందని, ఎన్నికల్లో ప్యానెల్ గెలుపుకు ఇది ఎంతగానో ఉపయోగపడుతుందని అభిప్రాయపడ్డారు. వాస్తవానికి కేంద్ర మంత్రి బండి సంజయ్ రాజకీయాల్లోకి వచ్చాక తొలిసారి ప్రజాప్రతినిధిగా చేపట్టిన పదవి కరీంనగర్ అర్బన్ బ్యాంక్ డైరెక్టర్ మాత్రమే. అర్బన్ బ్యాంకు డైరెక్టర్ గా ఉన్న సమయంలోనే కరీంనగర్ కోఆపరేటివ్ బ్యాంకు సహా పలు బ్యాంకులను నష్టాల సాకుతో మూసివేసేందుకు రిజర్వ్ బ్యాంక్ చర్యలు చేపట్టింది. ఆ సమయంలో బ్యాంకు ఛైర్మన్ గా ఉన్న డి.శంకర్ తో కలిసి డైరెక్టర్ బండి సంజయ్ అర్బన్ బ్యాంకును కాపాడటంలో కీలక పాత్ర పోషించారు. రుణాల రికవరీలో ముందంజలో నిలిపారు. అవినీతి, అక్రమాలకు తావులేకుండా బ్యాంకు సేవలు కొనసాగించడంలో కీలక పాత్ర పోషించారు. అర్హులైన వారందరికీ రుణాలు వచ్చేలా చేశారు. సంజయ్ డైరెక్టర్ గా ఉన్న సమయంలోనే అత్యధికంగా అర్బన్ బ్యాంకు సభ్యత్వం ఇప్పించారు. ప్రస్తుతం కరీంనగర్ కోఆపరేటివ్ అర్బన్ బ్యాంకులో 9,600 మంది ఓటర్లున్నారు. వీరిలో అత్యధిక మంది ఓటర్ల బండి సంజయ్ పట్ల అభిమానం ఉన్నవారేనని అర్బన్ బ్యాంకు ఓటర్లు చెబుతున్నారు. అర్బన్ బ్యాంకు లో అవినీతి, అక్రమాలు తగ్గాలంటే బీజేపీ పక్షాన ప్యానెల్ ను బరిలోకి దింపాలని కోరుతున్నారు. ఈ మేరకు బండి సంజయ్ కు, బీజేపీ నాయకులకు ఫోన్లు చేసి ఒత్తిళ్లు తెస్తున్నారు. దీనిని దృష్టిలో ఉంచుకుని జిల్లా బీజేపీ నాయకులు ఈరోజు సమావేశమై పోటీ చేసే అంశంపై చర్చించారు. బీజేపీ శ్రేణులు, అర్బన్ బ్యాంకు ఓటర్ల మనోభావాలను సైతం కేంద్ర మంత్రి బండి సంజయ్ దృష్టికి తీసుకెళ్లారు. బీజేపీ పక్షాన ప్యానెల్ ను బరిలో దింపాలనే భావనను వారు వ్యక్తం చేసినట్లు తెలిసింది. అయితే ఈ విషయంపై ఇంకా తుది నిర్ణయం తీసుకోలేదు. రేపు లేదా ఎల్లుండి ఈ విషయంపై తుది నిర్ణయం ప్రకటించే అవకాశాలున్నాయి.

## దీపావళి అందరి జీవితాల్లో వెలుగులు నింపాలి: ఎమ్మెల్యే మట్ట రాగమయి




చర్చ, సత్తుపల్లి:నియోజకవర్గ ప్రజల జీవితాల్లో దీపావళి పండుగ కోటి కాంతులు నింపాలని ఎమ్మెల్యే రాగమయి ఆకాంక్షించారు. చీకటి మీద వెలుగు, చెడు మీద మంచి, దుష్ట శక్తుల మీద దైవశక్తి సాధించిన విజయానికి దీపావళి ప్రతీక అని పేర్కొన్నారు. సత్తుపల్లి నియోజకవర్గ ప్రజలందరికీ దీపావళి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పండుగను కుటుంబ సభ్యులతో సంతోషభరితంగా, ఆనందోత్సవాలతో జరుపుకోవాలని సూచించారు. టపాసులు కాల్చేటప్పుడు అప్రమత్తంగా ఉండాలని, ముఖ్యంగా చిన్నపిల్లలు బాణాసంచా కాల్చేటప్పుడు తల్లిదండ్రులు తప్పనిసరిగా పర్యవేక్షణ చేయాలని ఆమె సూచించారు. సురక్షితమైన పద్ధతుల్లో పండుగను జరుపుకోవడంతోపాటు ప్రమాదాలను నివారించుకోవాలని, పర్యావరణానికి హాని కలిగించే టపాసులు ఉపయోగించకుండా హరితదీపావళి జరుపుకోవాలని ఎమ్మెల్యే రాగమయి పిలుపునిచ్చారు.

## నక్సల్స్‌తో సంబంధాలున్న నేతలకు బండి సంజయ్ హెచ్చరిక



చర్చ :- కరీంనగర్ :నక్సల్స్ గ్రూపులకు మద్దతు ఇస్తున్నారని కొంత మంది తెలంగాణ నేతలపై కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ హెచ్చరికలు జారీచేశారు. ఆయుధ గుంపులకు మద్దతు ఇస్తూ ప్రజాస్వామ్యం పేరుతో మాట్లాడుతున్నవారు తమ సంబంధాలను తెంచుకోవాలని లేకపోతే వారి గురించి మొత్తం బయటకు వస్తుందని హెచ్చరిస్తూ సోషల్ మీడియాలో పోస్టు పెట్టారు.మావోయిస్టు కేడర్ల వద్దే కాకుండా, అవినీతి, నేరపరమైన కార్యకలాపాలు, తీవ్రవాద సంబంధాలను కాపాడే నెక్సస్‌ను కూడా కేంద్ర ప్రభుత్వం గుర్తిస్తున్నదని ప్రకటించారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ, కేంద్ర హోం మంత్రి అమిత్ షా మార్గదర్శకత్వంలో దేశ భద్రత కోసం కఠిన చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.ఎవరైనా కావొచ్చు, ఎంత పెద్ద నాయకులైనా కావొచ్చు, దేశ భద్రతకు విరుద్ధంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తప్పవని బండి సంజయ్ హెచ్చరించారు.ఆషామాషీగా బండి సంజయ్ ఇలాంటి వ్యాఖ్యలు చేశారని అనుకోవడానికి లేదన్న అభిప్రాయం వినిపిస్తోంది. నక్సల్ నెట్ వర్క్ ను ఇప్పటికే కేంద్రం ఛేధించింది. పరిమిత సంఖ్యలోనే నక్సలైట్లు మిగిలారు. అదే సమయంలో మిగిలిపోయిన టాప్ కమాండర్లు కొంత మంది తెలంగాణలోనే తలదాచుకున్నారని ప్రచారం జరుగుతోంది. తెలంగాణ కు చెందిన కొంత మంది రాజకీయ నేతలు షెల్టర్ ఇస్తున్నారన్న అనుమానాలు ఉన్నాయి. ఈ క్రమంలో బండి సంజయ్ ఇలాంటి ప్రకటన చేయడం వ్యూహాత్మకమేనని భావిస్తున్నారు.బండి సంజయ్ చేసిన ప్రకటన ఏ విధంగా చూసినా అది రాజకీయ ప్రకటన కాదు. కేంద్ర హోంశాఖ సహాయ మంత్రిగా ఉన్న ఆయనకు ఖచ్చితంగా ఏదో పక్కా సమాచారం రావడంతోనే హెచ్చరికలు జారీ చేస్తూ ఈ ట్వీట్ పెట్టారని అనుమానిస్తున్నారు.

## అర్ధరాత్రి ఆర్టీఏ చెక్‌పోస్టుపై ఏసీబీ సోదాలు



- రూ.25 వేల నగదు స్వాధీనం

చర్చ, భద్రాద్రి కొత్తగూడెం:పాల్వంచ ఆర్టీఏ చెక్‌పోస్టులో అవినీతి మరోసారి వెలుగులోకి వచ్చింది. వాహనాల చెకింగ్ పేరుతో నెలకొన్న 'క్యాష్ చెకింగ్' వ్యవస్థపై ఏసీబీ అధికారులు శనివారం అర్ధరాత్రి విస్తృత సోదాలు నిర్వహించారు. వరంగల్ ఏసీబీ డీఎస్పీ సాంబయ్య ఆధ్వర్యంలో పాల్వంచ మండలం నాగారం చెక్‌పోస్టు పరిసర ప్రాంతాల్లో ఈ సోదాలు కొనసాగాయి. ఏసీబీ ఇన్‌స్పెక్టర్లు సట్ల రాజు, లావుడియా రాజు, ఇతర సిబ్బంది ఈ ఆపరేషన్‌లో పాల్గొన్నారు. చెక్‌పోస్టు సిబ్బంది వాహనదారుల నుంచి డబ్బులు వసూలు చేస్తున్నారన్న ఫిర్యాదులపై ఏసీబీ ముందుగా సమాచారం సేకరించి, ఆ తర్వాత దాడులకు దిగింది. డీఎస్పీ సాంబయ్య మాట్లాడుతూ ఈ చెక్‌పోస్టులో పర్మిట్, ఓవర్‌లోడ్, ఫైన్, టాక్స్ కలెక్షన్ లాంటి అంశాలు సక్రమ ంగా అమలుకావడం లేదని, అధికారిక రసీదులు ఇవ్వకుండా డబ్బులు వసూలు చేస్తున్నట్లు సమాచారం అందిందన్నారు. సోదాల్లో ఇప్పటివరకు అనధికారంగా వసూలు చేసిన రూ.25 వేల పైచిలుకు నగదు స్వాధీనం చేసుకున్నామన్నారు. ఆ నగదు విషయమై ఎంవిఐ మనోహర్ ఎలాంటి సమాధానం ఇవ్వలేకపోయారని ఏసీబీ అధికారులు వెల్లడించారు. ఈ నగదు ఎక్కడిది అనే అంశంపై పూర్తిస్థాయి విచారణ జరపాల్సి ఉందన్నారు. ఏసీబీ ప్రాథమిక విచారణలో ప్రతి వాహనానికి రూ.200 నుంచి రూ.500 వరకు, ఇసుక రవాణా వాహనాలకు రూ.2000 వరకు నిర్దిష్ట రేటు వసూలు చేస్తున్నట్టు తేలింది. దాడుల్లో అధికారులు చెక్‌పోస్టు రికార్డులు, రసీదు పుస్తకాలు, కం ప్యూటర్ డేటా సీజ్ చేశారు. సిబ్బంది మొబైళ్లను పరిశీలించి లావాదేవీల ఆధారాలు సేకరిస్తున్నారు. ఈ అవినీతి వ్యక్తిగతం కా దని, వ్యవస్థాత్మక రూపం దాల్చిందని ఏసీబీ అధికారులు భావిస్తున్నారు.

## మందుగుండు సామాగ్రి అమ్మకాలకై 'మామూళ్ళు

- బాణాసంచా దుకాణాల ఏర్పాటులో అవినీతి రాజ్యం
- కింది స్థాయి నుండి పైస్థాయి అధికారుల లంచాల పర్వం



చర్చ, భద్రాద్రి కొత్తగూడెం:ప్రతీయేటా దీపావళి సందర్భంగా ఏర్పాటు చేసే బాణాసంచా విక్రయ దుకాణాల అనుమతులకు అధికారులు ముప్పుతిప్పలు పెడుతున్నారని వ్యాపారులు వాపోతున్నారు. ముందస్తుగా దరఖాస్తు చేసుకున్నా పండుగ ముందురోజు వరకు కూడా అనుమతులు ఇవ్వడంలేదని ఆందోళన చెందుతున్నారు. అధికారుల చుట్టూ చెప్పులు అరిగేలా తిరిగినా కనికరించడంలేదని కన్నీటిపర్యంతం అవుతు న్నారు. లక్షలు వెచ్చించి తీసుకువచ్చే బాణాసంచాను అమ్ము కునేందుకు సరైన సమయంలో అనుమతులు ఇవ్వకపో వడంతో భారీగా నష్టపోయే పరిస్థితులు ఉన్నాయంటున్నారు. ఇప్పుడిస్తాం... అప్పుడిస్తాం అంటూ ఆయా శాఖల అధికారులు తమ చుట్టూ తిప్పించుకుంటున్నారని, వచ్చే ఏడాది నుంచి ఆన్ లైన్ పద్ధతిని ప్రవేశపెట్టాలంటూ వ్యాపారస్తులు డిమాండ్ చేస్తున్నారు.

### మామూళ్లు ఇవ్వనిదే ముందుకు కదలదు..

షాపుల ఏర్పాటుకు అనుమతులు ఇవ్వడంలో మాముళ్లు తప్పనిసరి అయ్యాయని వ్యాపారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా మొత్తం 200కు పైగా షాపుల ఏర్పాటుకు వ్యాపారస్తులు దరఖాస్తు చేసుకున్నట్లు తెలుస్తోంది. అయితే అందులో 163 షాపులకు మాత్రమే అనుమతులు ఇచ్చినట్లు సమాచారం. అప్పటికీ కార్మిక ప్రాంతాలైన కొత్తగూడెం, రామవరం, మణుగూరు, సారపాక, పాల్వంచతోపాటు భద్రాచలం వంటి ప్రాంతాల్లో ప్రత్యేకంగా షాపులు ఏర్పాటు చేసేందుకు వ్యాపారస్తులు షెడ్‌లు సిద్ధం చేసుకున్నారు. ఈ ఏడాది అనుమతులు పొందేందుకు ప్రతి శాఖకు విడివిడిగా డబ్బులు చెల్లించాల్సిన పరిస్థితి ఏర్పడిందని స్థానిక వ్యాపారులు చెబుతున్నారు. రెవెన్యూ, పోలీస్, మున్సిపల్ ఇలా పలు శాఖలల్లో కింది స్థాయి నుంచి పై స్థాయి అధికారి వరకు లంచాలు ముట్టచెప్పాల్సి వచ్చిందని వ్యాపారస్తులు ఆరోపిస్తున్నారు.

### అధికారుల అవినీతి సామాన్యులకు భారం

బాణాసంచా దుకాణాల ఏర్పాటుకు అన్ని శాఖల అధికారులకు లంచాలు ముట్టచెప్పడానికే తమకు వేలల్లో ఖర్చయిందని, అందుకే బాణాసంచాలను సైతం ఎక్కువ ధరకు విక్రయించాల్సి వస్తుందని పలువురు వ్యాపారస్తులు పేర్కొంటుండటం గమనార్హం. దీంతో అధికారుల అవినీతి సామాన్యులకు భారంగా మారిందని పలువురు ఆవేదన చెందుతున్నారు. తక్కువ ధరకు రావాల్సిన బాణాసంచాను వ్యాపారస్తులు ఎక్కువ ధరకు విక్రయిస్తుండటంతో సామాన్యుడు కొనలేని పరిస్థితి ఉంది. ఒకవైపు సోషల్ మీడియాలో బాణాసంచాల రేట్లు చాలా తక్కువగా చూపిస్తుండగా, జిల్లాలో ఏర్పాటు చేసిన షాపుల్లో మాత్రం అధిక ధరలకు విక్రయాలు జరుపుతుండటంతో ప్రజలు కొంతవరకే సర్దుబాటు చేసుకుంటున్నారు. ఈ విషయంలో ప్రభుత్వం స్పందించి అవినీతికి పాల్పడిన అధికారులపై చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. వ్యాపారస్తుల ఆరోపణలపై సంబంధిత శాఖల అధికారులను వివరణ కోరేందుకు 'చర్చ' ప్రయత్నించగా అందుబాటులో లేరు.

## సిఎస్ఆర్ నిధులను నిర్వాసిత గ్రామాల అభివృద్ధికి వినియోగించాలి



చర్చ, మణుగూరు:బిటిపిఎస్ సిఎస్ఆర్ నిధులను నిర్వాసిత గ్రామాల అభివృద్ధికి ఉపయోగించాలని, రోడ్లు, డ్రైనేజీలు, విద్య, వైద్యం, విద్యుత్తు, త్రాగునీరు తదితర మౌలిక సమస్యలను పరిష్కరించాలని సిపిఐ (ఎంఎల్) మాస్ లైన్ మణుగూరు డివిజన్ కార్యదర్శి ఆర్. మధుసూదన్ రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం నిర్వాసిత గ్రామాల్లో పర్యటించిన ఆయన మాట్లాడుతూ అంగట్లో అన్ని ఉన్నా అల్లుడు నోట్లో శని ఉన్నట్లు కోట్లాది రూపాయల బీటీపీఎస్, సిఎస్ఆర్ నిధులు వస్తున్నా నిర్వాసిత గ్రామాలలో మౌలిక సదుపాయాలు లేవన్నారు. ఒకప్పుడు పచ్చని పైరులతో, ప్రశాంత వాతావరణంలో ఉన్న నిర్వాసిత గ్రామాలు నేడు దుమ్ము, ధూళితో దర్శనమిస్తున్నాయన్నారు. వాతావరణ, పర్యావరణ కాలుష్యం వలన ప్రజలు అనారోగ్యాల పాలవుతున్నారన్నారు. నిర్వాసిత గ్రామాల అభివృద్ధి పట్ల ప్రభుత్వం, అధికారులు నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నారని ఆరోపి ంచారు. బీటీపీఎస్ నుండి మణుగూరు వరకు రోజు వందలాది బొగ్గు టిప్పర్లు తిరుగుతూ రోడ్డు గుంతల మయంగా, అస్తవ్యస్తంగా తయారై అనేక ప్రమాదాలు జరిగి ప్రజలు చనిపోతున్నా, దుమ్ము, ధూళితో ప్రజలు అనారోగ్యాల పాలవు తున్నా ప్రభుత్వం, ప్రభుత్వ అధికారులు పట్టించుకోకపోవడం దుర్మార్గమన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం, ప్రభుత్వ అధికారులు వెంటనే స్పందించి, సమస్యలను వెంటనే పరిష్కరించాలన్నారు. ఈ కార్యక్రమంలో కార్యక్రమాల్లో నాయకులు కురసం రామ కృ ష్ణ, ఇందారపు వెంకట్, నర్సయ్య, అలవాల సమ్మన్న, పబ్బతి అనిల్, ముషిక లక్ష్మణ్, రావులపల్లి ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

## వర్షంలో బాణాసంచా వ్యాపారుల అవస్థలు







చర్చ, భద్రాద్రి కొత్తగూడెం:దీపావళికి ఇంకా ఒక్కరోజే ఉన్నప్పటికీ అంతంత మాత్రమే సాగుతున్న వ్యాపారం. ఇంతలో ఒక్కసారిగా ఉన్నట్టుండి గాలి దుమారంతో కురిసిన వర్షం. దీంతో వ్యాపారులు లబోదిబోమన్నారు. కొత్తగూడెం పట్టణంలోని ప్రకాశం స్టేడియంలో వ్యాపారస్తులు దీపావళి బానాసంచా దుకాణాలు ఏర్పాటు చేసి విక్రయాలు జరుపుతున్నారు. ఆదివారం మధ్యాహ్నం ఉన్నట్లుండి ఒక్కసారిగా గాలిధుమారంతో భారీ వర్షం కురిసింది. దీంతో వ్యాపారస్తులు విక్రయిస్తున్న టపాసులను స్టాళ్లలో దాచిపెట్టి, వర్షంలో తడవకుండా ఉంచేందుకు ఇబ్బందులు పడ్డారు. స్టేడియం ప్రాంగణం మొత్తం వర్షం కారణంగా బురదమయంగా మారడంతో బాణాసంచా కొనుగోలు చేసేందుకు వచ్చిన వారు కూడా అవస్థలు పడ్డారు. ఇప్పటికే అమ్మకాలు మందగించగా అకాల వర్షాలు తమ వ్యాపారాన్ని దెబ్బతీస్తున్నాయని వ్యాపారులు ఆందోళన చెందుతున్నారు.



### లక్షల్లో పెట్టుబడులు పెట్టాం: క్రాంతి, వ్యాపారస్తుడు

దీపావళి టపాసుల విక్రయాల కోసం లక్షల్లో పెట్టుబడులు పెట్టాము. దూర ప్రాంతాల నుంచి సరుకును దిగుమతి చేసుకున్నాం. దీపావళి పండుగతోపాటు మూడు రోజులే విక్రయాలు సాగుతాయి. వర్షాలు కురిస్తే టపాసుల కొనుగోలుకు ఎవరూ ముందుకు రారు.




### వర్షం వస్తే వ్యాపారం మందగిస్తుంది: అశోక్, వ్యాపారస్తుడు

వర్షాలు వస్తే టపాసుల అమ్మకాలు మందగిస్తాయి. బాణాసంచా తడిస్తే తీవ్రంగా నష్టపోవాల్సి వస్తుంది. వరుణుడు కరుణించి ఈ మూడు రోజులు వర్షాలు రాకపోతే మా వ్యాపారం కొనసాగుతుందని ఆశిస్తున్నా.

# క్రీడాకారులు అంతర్జాతీయ స్థాయికి ఎదగాలి

- క్రీడలతో ఉజ్వల భవిష్యత్తు
- జిల్లా ఖో ఖో సంఘ అధ్యక్షులు, సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి
- ఉమ్మడి జిల్లా స్థాయి సీనియర్ ఖో ఖో పోటీలకు విశేష స్పందన



**చర్చ :- కరీంనగర్ :** ఖో ఖో క్రీడాకారులు అంతర్జాతీయ స్థాయికి ఎదగాలని కరీంనగర్ జిల్లా ఖో ఖో అసోసియేషన్ అధ్యక్షులు సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ స్టేడియంలో జిల్లా ఖో ఖో అసోసియేషన్ ఆధ్వర్యంలో ఉమ్మడి జిల్లా స్థాయి సీనియర్ మహిళలు పురుషుల ఖో ఖో జట్ల ఎంపిక పోటీలను నిర్వహించారు. ఈ పోటీలకు ముఖ్య అతిథిగా హాజరైన సుడా చైర్మన్ క్రీడాకారులను పరిచయం చేసుకొని ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ క్రీడలతో విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని, ఉన్నత స్థాయికి ఎదిగేందుకు అవకాశం ఏర్పడుతుందని అన్నారు. గతంలో జిల్లా క్రీడాకారులు విశేష ప్రతిభ చాటి జిల్లా క్రీడ పతాకాన్ని అంతర్జాతీయ స్థాయిలో రెపరెపలాడించారని ముందు మరింత మంది అంతర్జాతీయ స్థాయికి ఎదగాలని అన్నారు. నిత్య శిక్షణతోనే క్రీడల్లో రాణించేందుకు అవకాశాలు ఉంటాయని అన్నారు. జిల్లా యువజన క్రీడా శాఖ అధికారి వి శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ జిల్లా క్రీడాకారులు రాష్ట్రస్థాయి క్రీడల్లో విజేతలుగా నిలిచేందుకు కృషి చేయాలన్నారు. ఖో ఖో క్రీడలో కరీంనగర్ కు మంచి పేరు ఉందని గుర్తు చేశారు. ఈ పోటీల్లో కరీంనగర్, జగిత్యాల, సిరిసిల్ల జిల్లాల నుంచి 225 మంది క్రీడాకారులు హాజరయ్యారు. వీరికి ఖో ఖో క్రీడను నిర్వహించి రాష్ట్రస్థాయిలో పాల్గొనే శిక్షణ శిబిరానికి 20 మంది మహిళలను, 20 మంది పురుషులను ఎంపిక చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా పాఠశాలల క్రీడా సమాఖ్య ప్రధాన కార్యదర్శి భాషా బోయిన వేణుగోపాల్, జిల్లా ఖో ఖో అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి వై మహేందర్ రావు, సంఘ ఉపాధ్యక్షులు కరీంనగర్ ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ కుమారస్వామి, కోశాధికారి చిట్టి తిరుపతిరెడ్డి, జగిత్యాల జిల్లా సంఘ ప్రతినిధి డాక్టర్ ఏ రవీందర్, సిరిసిల్ల జిల్లా సంఘ ప్రతినిధి ఎస్కే మోహినిద్దీన్, కరీంనగర్ జిల్లా సంఘ సభ్యులు వి సూర్యప్రకాష్, కట్ట సంతోష్, వి శ్రీలత, రేణుక, యోగేష్, కరుణాకర్, అశోక్, రాజబాబు, అంతర్జాతీయ ఖో ఖో క్రీడాకారులు పండుగ ఆనంద్, వెంకటేష్, రాజు, జలంధర్, కోచ్ ఈ నరేష్, వ్యాయామ ఉపాధ్యాయులు, సీనియర్ క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు. పోటీల ముగింపు సమావేశానికి పెద్దపల్లి జిల్లా యువజన క్రీడ శాఖ అధికారి ఏ సురేష్ ,సీనియర్ వాలీబాల్ క్రీడాకారుడు ఏ లక్ష్మణ్, మానకొండూర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల లెక్చరర్ టి రమేష్ లు హాజరై ఎంపికైన క్రీడాకారులను అభినందించారు.

# సత్తుపల్లి నియోజకవర్గంలో కల్లూరు కు కొంగొత్త సబ్ కలెక్టరేట్

- కల్లూరులో ఇంటిగ్రేటెడ్ మోడల్ సబ్ కలెక్టర్ కార్యాలయం
- రాష్ట్రంలోనే తొలి ఇంటిగ్రేటెడ్ మోడల్ సబ్ కలెక్టరేట్ కార్యాలయ నిర్మాణానికి మంత్రి ఆలోచన
- మంత్రి"తుమ్మల"ఆలోచనకు కొత్త రూపు
- 10ఎకరాలు రూ. 49 కోట్లతో ప్రతిపాదనలు
- మంత్రి తుమ్మలకు ప్రతిపాదన అందించిన సబ్ కలెక్టర్
- క్యాంప్ ఆఫీస్-కమ్-రెసిడెన్స్ నిర్మాణానికి రూ.2.50 కోట్లు
- ప్రజలకు మెరుగైన పరిపాలన లక్ష్యంగా అడుగులు
- పరిపాలన చేరువ చేయాలనే సంకల్పంతో మంత్రి కృషి
- సీఎం రేవంత్ తో భేటీకానున్న మంత్రి తుమ్మల
- సత్తుపల్లి,కల్లూరు,వేంసూరు,పెనుబల్లి,తల్లాడ చెరువులకు పూర్వవైభవం
- ప్రభుత్వ ఎస్ఎస్పి, భూములను కబ్జాదారుల నుండి విముక్తి కలిగించాలి
- సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్ కు మంత్రి తుమ్మల కీలక ఆదేశాలు..



**చర్చ, సత్తుపల్లి:** రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆలోచనతో కల్లూరులో అన్ని హంగులతో కొత్త ఇంటిగ్రేటెడ్ మోడల్ సబ్ కలెక్టరేట్ కార్యాలయం రూపుదిద్దుకోనుంది. కల్లూరు సబ్ కలెక్టరేట్ వేదికగా అన్ని ప్రభుత్వ కార్యాలయాలు ఒకే చోట కొలువుదీరనున్నాయి. అన్ని ప్రభుత్వ శాఖలలో ప్రజలకు సమగ్ర సేవలు, సమర్థవంతమైన పరిపాలన అందించాలనే ఉద్దేశంతో ఈ సబ్ కలెక్టరేట్ ను నిర్మించేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేయడం జరిగింది. రాష్ట్రంలోనే మొట్టమొదటి ఇంటిగ్రేటెడ్ మోడల్ సబ్ కలెక్టరేట్ గా కల్లూరు సబ్ కలెక్టరేట్ నిలవనుంది. ఇటీవల మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కల్లూరు సబ్ కలెక్టర్ ను ఇంటిగ్రేటెడ్ సబ్ డివిజనల్ కలెక్టరేట్ గా ప్రతిపాదన తయారు చేయాలని సబ్ కలెక్టర్ ను ఆదేశించారు. ఈ నేపథ్యంలో ఆదివారం సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్ మంత్రి తుమ్మలకు సబ్ కలెక్టర్ కార్యాలయ ప్రతిపాదనలు అందించారు. ఈ విషయమై మంత్రి తుమ్మల సీఎం రేవంత్ రెడ్డి తో త్వరలో భేటీ అయ్యి, ఈ నూతన ప్రాజెక్టుకు సీఎం ఆమోదం కోరనున్నారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల సబ్ కలెక్టర్ కు పలు కీలక ఆదేశాలు జారీ చేశారు. ప్రభుత్వ భూములు, ఎన్ఎస్పీ భూముల పరిరక్షణకు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఆక్రమణలో ఉన్న చెరువులకు విముక్తి, భూ ఆక్రమణల తొలగింపు, చెరువుల సుందరీకరణకు ఆదేశించారు.

### 10ఎకరాల్లో రూ.49 కోట్ల వ్యయంతో ప్రాజెక్ట్

కల్లూరు మండలంలో పది ఎకరాల భూమిలో రూ.49 కోట్ల అంచనా వ్యయంతో ఈ సబ్ కలెక్టరేట్ సముదాయం నిర్మించనున్నట్లు అధికార వర్గాలు వెల్లడించాయి. ఇందులో సబ్ కలెక్టరేట్ ప్రధాన భవనం, విభాగాల కార్యాలయాలు, సమావేశ మందిరాలు, రికార్డు గదులు, పార్కింగ్ స్థలాలు, హరిత వాతావరణం వంటి అన్ని ఆధునిక సౌకర్యాలతో నిర్మించనున్నారు.

### క్యాంప్ ఆఫీస్-కమ్-రెసిడెన్స్‌కు రూ.2.50 కోట్లు

సబ్ కలెక్టర్ క్యాంప్ ఆఫీస్-కమ్-రెసిడెన్స్ నిర్మాణానికి ప్రత్యేకంగా రూ.2.50 కోట్లతో ప్రతిపాదనలు తయారుచేశారు. ఈ ప్రాజెక్టు వివరాలను సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్ మంత్రి తుమ్మల నాగేశ్వరరావుకు సమర్పించారు. ఈ ప్రతిపాదన ఆమోదం కోసం త్వరలోనే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కి ఈ ప్రతిపదనలు మంత్రిగారు సమర్పించనున్నారు.

ప్రజలకు పరిపాలన చేరువే లక్ష్యం....

"ప్రజలకు ఒక్కచోటే అన్ని ప్రభుత్వ శాఖల సేవలు పొందగలిగేలా పరిపాలన చేరువ కావాలి" అనే ఉద్దేశంతోనే ఈ ప్రణాళికను రూపొందించినట్లు మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వెల్లడించారు. ఆదాయ, వ్యవసాయం, పంచాయతీరాజ్, పౌర సరఫరాలు, మహిళా సంక్షేమం, విద్య తదితర శాఖల డివిజన్ కార్యాలయాలు ఒకే ప్రాంగణంలో పనిచేయనున్నాయి.

చెరువులకు పూర్వవైభవం

### ఐదు మండలాల్లో అభివృద్ధి

సత్తుపల్లి, కల్లూరు, వేంసూరు, పెనుబల్లి, తల్లాడ మండలాల్లో ఉన్న చెరువుల పునరుద్ధరణకు మంత్రి తుమ్మల ప్రత్యేక దృష్టి సారించారు. ఈ చెరువులను మోడల్ చెరువులుగా తీర్చిదిద్దాలని, వాటి అభివృద్ధికి సంబంధిత శాఖల సమన్వయంతో పనిచేయాలని సూచించారు. చెరువుల పరిరక్షణ బాధ్యతను సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్ స్వయంగా పర్యవేక్షించాలని ఆదేశించారు.

### వేశ్యకాంతుల చెరువుకు సర్వే ఆదేశం

సత్తుపల్లి మండలంలోని వేశ్యకాంతుల చెరువుపై సర్వే చేపట్టి, చెరువును పరిరక్షించాలని మంత్రి తుమ్మల సూచించారు. చెరువు భూములకు కబ్జాల నుంచి విముక్తి కలిగించేందుకు చర్యలు తీసుకోవాలని ఆయన అధికారులను ఆదేశించారు. అదేవిధంగా వేంసూరు మండలం కుంచపర్తి గ్రామంలో గ్రామ రాశి భూములపై సర్వే చేపట్టి, వాటిని కబ్జాదారుల నుండి రక్షించాలని ఆదేశించారు.

ప్రభుత్వ భూముల రక్షణకు స్పష్టమైన ఆదేశాలు...

"ప్రభుత్వ, ఎన్ఎస్పీ భూములను కబ్జాల నుంచి కాపాడాలి. ప్రైవేటు వ్యక్తుల ఆధీనంలో ఉన్న భూములకు చట్టపరంగా విముక్తి కల్పించాలి . భూ సమస్యలను త్వరితగతిన పరిష్కరించి ప్రజలకు న్యాయం చేయాలి" అని మంత్రి తుమ్మల అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.

### రేవంత్‌తో భేటీకి సిద్ధమైన మంత్రి తుమ్మల...

కల్లూరు మోడల్ సబ్ కలెక్టరేట్ నిర్మాణం, చెరువుల అభివృద్ధి ప్రణాళికలు, భూ పరిరక్షణ చర్యలపై మంత్రి తుమ్మల త్వరలోనే సీఎం రేవంత్ రెడ్డిని కలిసి, సమగ్ర నివేదిక సమర్పించనున్నారు.

### పరిపాలనా వ్యవస్థలో కొత్త దిశ

కల్లూరులో ప్రతిపాదిత మోడల్ సబ్ కలెక్టరేట్ నిర్మాణం అమల్లోకి వస్తే, ఇది రాష్ట్ర పరిపాలనా వ్యవస్థలో కొత్త దిశను సూచించే నమూనాగా నిలుస్తుందని అధికారులు అభిప్రాయపడుతున్నారు. ప్రజలకు సమగ్ర సేవలందించే ఈ సముదాయం భవిష్యత్తులో ఇతర జిల్లాలకు ప్రేరణగా మారనుంది.

# ఘనంగా మాజీ ఎమ్మెల్యే వెలిచాల జగపతిరావు వర్ధంతి వేడుకలు



**కరీంనగర్ :** కాంగ్రెస్ పార్టీ కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ ఇన్చార్జి వెలిచాల రాజేందర్ రావు యువసేన ఆధ్వర్యంలో కొత్తపల్లిలోని వెలిచాల ప్రజా కార్యాలయంలో ఆదివారం మాజీ ఎమ్మెల్యే, మాజీ ఎమ్మెల్సీ, సీనియర్ కాంగ్రెస్ నాయకుడు, ప్రముఖ తెలంగాణ ఉద్యమ కారుడు వెలిచాల జగపతిరావు తృతీయ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు మాజీ కార్పొరేటర్లు, మాజీ కౌన్సిలర్లు, మాజీ ప్రజా ప్రతినిధులు, జగపతిరావు అభిమానులు, సన్నిహితులు, వెలిచాల రాజేందర్ రావు యువసేన ప్రతినిధులు వెలిచాల జగపతిరావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. జగపతిరావు చేసిన సేవలను వారు స్మరించుకున్నారు. పేదల ఆత్మబంధువు గా పేరు తెచ్చుకున్నారని గుర్తు చేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో జగపతిరావు కీలక పాత్ర పోషించారని గుర్తు చేశారు. తెలంగాణ ఉద్యమంలో అగ్రగన్యుడు జగపతిరావు అనీ, ప్రత్యేక రాష్ట్ర ఏర్పాటులోనూ ప్రముఖ పాత్ర వహించిన ఘనత జగపతిరావుకే దక్కుతుందని పేర్కొన్నారు. కరీంనగర్ ఎమ్మెల్యేగా, ఎమ్మెల్సీగా పనిచేసి ప్రజల మన్ననలు పొందిన ఏకైక నాయకుడు జగపతిరావు అని కొనియాడారు. పేదల పక్షపాతిగా పేదల సమస్యలను తన సమస్యలుగా భావిస్తూ వారికి ఎల్లవేళలా అండదండలు అందించిన మహానేత జగపతిరావు అని పేర్కొన్నారు. కరీంనగర్ నియోజకవర్గాన్ని రాష్ట్రంలోనే అభివృద్ధిలో ఒక మాడల్ గా తీర్చిదిద్దారనీ, కరీంనగర్ ప్రజలు ఇప్పటికీ వాటిని గుర్తుపెట్టుకుంటున్నారని తెలిపారు. అనేకమంది నిరుద్యోగ యువకులకు పెద్ద ఎత్తున ఉద్యోగాలు కల్పించిన నేత జగపతిరావు అని గుర్తు చేశారు. ఎమ్మెల్యేగా ఎమ్మెల్సీగా మార్క్ ఫెడ్ చైర్మన్ గా ఏ పదవి చేపట్టినా పేదల పక్షపాతిగా వ్యవహరించారని పేర్కొన్నారు. నీతి నిజాయితీగా ప్రజలకు సేవలందించి వారి గుండెల్లో ప్రత్యేక స్థానం సంపాదించుకున్న ఏకైక నేత జగపతి రావు మాత్రమేనని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ప్రజా ప్రతినిధులు, జగపతిరావు అభిమానులు, వెలిచాల రాజేందర్ రావు యువసేన ప్రతినిధులు, వెలిచాల ప్రజా కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## నవీన్ యాదవ్ గెలుపునకై పెద్దమ్మతల్లి ఆలయంలో పూజలు



**చర్చ, భద్రాద్రి కొత్తగూడెం:** జూబ్లీహిల్స్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నవీన్ యాదవ్ గెలుపును కాంక్షిస్తూ పాల్వంచలోని శ్రీ పెద్దమ్మతల్లి ఆలయంలో టీపీసీసీ జనరల్ సెక్రటరీ నాగా సీతారాములు ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన ప్రజా సంక్షేమ పథకాలు తమ పార్టీ అభ్యర్థిని గెలిపిస్తాయని సీతారాములు ధీమా వ్యక్తం చేశారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో నవీన్ యాదవ్ భారీ మెజారిటీతో గెలవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో హరిబాబు, పూర్ణ, సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు.

## సిఐటియు పట్టణ కన్వీనర్‌గా భూక్య రమేష్



**చర్చ, భద్రాద్రి కొత్తగూడెం:** సిఐటియు కొత్తగూడెం పట్టణ మహాసభలో నూతన కమిటీనీ ఎన్నుకున్నారు. నూతన కమిటీలో 27 మందితోపాటు ఇద్దరిని కో ఆప్షన్ సభ్యులుగా ఎన్నుకున్నారు. కన్వీనర్‌గా భూక్య రమేష్ , కన్వీనింగ్ కమిటీ సభ్యులుగా లిక్కి బాలరాజు, జనుమాల నగేష్, నందిపాటి రమేష్, సూరం ఐలయ్య, ప్రమోద్, మహమ్మద్ జలాల్, అంబాలదుర్గమ్మ, పాషా, గూగుల్ సక్రాం, సామ్యూల్, బత్తుల నాగేశ్వరరావు, కళావతి, శైలజ, కట్టా శైలజ, రాజేశ్వరి, భవాని, జమీల్ పాషా, నిహారిక, నరేందర్, సలీం, రామ్ కోటి, సయ్యద్, సతీష్‌లను ఎన్నుకున్నారు.

## ఇసుక అక్రమంగా రవాణా చేస్తున్న లారీ పట్టివేత





**చర్చ, సత్తుపల్లి:** వేంసూరు మండల కేంద్ర సమీపంలో ఇంకా ప్రారంభం కానీ గ్రీన్ ఫీల్డ్ హైవేపై అక్రమ ఇసుక రవాణా చేస్తున్న 14 టైర్ల లారీని ఎస్సై కవిత ఆదివారం పట్టుకున్నారు. ఎస్ఐ కవిత పోలీస్ సిబ్బందితో ప్రారంభం కానీ గ్రీన్ఫీల్డ్ హైవేపై తనిఖీలు చేపట్టి ఆంధ్రా నుండి హైదరాబాద్ వైపు ఇసుక లోడ్‌తో ప్రయాణిస్తున్న లారీని పట్టుకుని స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేశారు. కొద్దిరోజుల క్రితం ఆంధ్ర రాష్ట్రంలో చింతలపూడిలో 20 ఇసుక లారీలను పట్టుకున్న పోలీసులు టాస్క్ ఫోర్స్ వారికి అప్పగించడంతో ఇసుక మాఫియా తాత్కాలికంగా ఇసుక అక్రమ రవాణా నిలిపివేసింది. కానీ అక్రమ సంపాదనకు అలవాటు పడటంతో తిరిగి ఇసుకను హైవేపై సత్తుపల్లి, కల్లూరు, వైరా మీదుగా ఖమ్మం, హైదరాబాదుకు తరలిస్తూనే ఉన్నారు. త్వరగా ఎవరి కంటా పడకుండా ఉండటానికి మరొక మార్గమైన ప్రారంభం కానీ గ్రీన్ ఫీల్డ్ హైవేని ఎంచుకుని దానిపై యదేచ్చగా ఇసుకను అక్రమ రవాణా జరుపుతున్నారు. ఆంధ్ర, తెలంగాణ వ్యాపారస్తులు ఉమ్మడిగా ఈ ఇసుక దందా వ్యాపారాన్ని నడిపిస్తున్నారు అక్రమ ఇసుకను తెలంగాణలోకి కమిషన్లకు కక్కుర్తి పడిన కొందరు దళారులు సహకరించి నడిపిస్తున్నారు. అధికారుల జేబులు నింపుతూ రాజకీయ నాయకుల అండదండలతో అక్రమ ఇసుక రవాణా చేస్తూ ఇసుక మాఫియా కోట్లలో ఆదాయాన్ని ఆర్జిస్తున్నారని ప్రజలు బాహాటంగానే చెప్పుకుంటున్నా సంబంధిత అధికారులు మాత్రం ఏ విధమైన చర్యలు తీసుకోక పోవడం కొసమెరుపు

## రాష్ట్ర ప్రజలకు దీపావళి శుభాకాంక్షలు మంత్రి పొన్నం ప్రభాకర్



**కరీంనగర్ :** అంధకారాన్ని పారద్రోలే మహా పర్వదినమైన దీపావళి సందర్భంగా రాష్ట్ర ప్రజలకు దీపావళి శుభాకాంక్షలు.ఈ దీపావళి పండుగ ప్రతి ఇంట్లో ఆనందం, శాంతి, ఐక్యత మరియు అభివృద్ధి దీపాల వెలుగుల వలె విరజిల్లాలని ఆకాంక్షిస్తున్నాను. ప్రజలంతా ఆరోగ్యంగా, సుఖ సంతోషాలతో సమృద్ధిగా ఉండాలని ఆ అమ్మవారిని ప్రార్థిస్తున్నా. ఈ దీపావళి పండుగ వెలుగులు మన రాష్ట్రానికి మరింత వెలుగులు తెచ్చేలా, అభివృద్ధి పథంలో ముందుకు నడిపేలా మారాలని ఆశిస్తున్నాను.ప్రజలంతా కుటుంబ సభ్యులతో కలసి ఈ పర్వదినాన్ని సురక్షితంగా, సంతోషంగా జరుపుకోవాలని కోరుకుంటున్న. ప్రతి ఇంట్లో పిల్లలు టపాసులు కాల్చే సమయంలో ప్రమాదాలు జరగకుండా తల్లిదండ్రులు జాగ్రత్తలు తీసుకోవాలని సూచిస్తున్న.

## తెలంగాణ రాష్ట్ర న్యాయవాదుల ఫెడరేషన్ అధ్యక్షులుగా లక్కినేని సత్యనారాయణ






**చర్చ,హైదరాబాద్:** హైదరాబాద్ మెట్రోపాలిటన్ క్రిమినల్ కోర్ట్స్ బార్ అసోసియేషన్ హాల్లో ఆదివారం జరిగిన తెలంగాణ రాష్ట్ర న్యాయవాదుల ఫెడరేషన్ ఎన్నికలు శాంతియుతంగా పూర్తయ్యాయి. ఈ ఎన్నికల్లో మహబూబ్‌నగర్ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు అనంతరెడ్డి, భద్రా ది కొత్తగూడెం జిల్లా బార్ అసోసియేషన్ అధ్యక్షుడు లక్కినేని సత్యనారా యణ ఏకగ్రీవంగా రాష్ట్ర అధ్యక్షులుగా ఎన్నుకోబడ్డారు.డిసెంబర్ 31 వరకు అనంతరెడ్డి రాష్ట్ర అధ్యక్షునిగా బాధ్యతలు నిర్వర్తించగా, జనవరి 1 నుంచి తదుపరి ఎన్నికలు జరిగే వరకు లక్కినేని సత్యనారాయణ ఫెడరేషన్ అధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరిస్తారు.ఇతర హోదాల్లో విష్ణువర్ధన్ రెడ్డి (హానరరీ ప్రెసిడెంట్), అమరేందర్ రెడ్డి (జనరల్ సెక్రటరీ), రవి కిషోర్ (ఆర్గనైజింగ్ సెక్రటరీ), ఏ.ముకుందరావు (జాయింట్ సెక్రటరీక్రీడా, సాంస్కృతిక కార్యదర్శి) తదితరులు ఎన్నికయ్యారు.ఈ ఎన్నికలను తెలంగాణ హైకోర్టు బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు ఏ.రవీంద్రారెడ్డి ఎన్నికల అధికారిగా విజయవంతంగా నిర్వహించారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా నుండి లక్కినేని సత్యనారాయణ ఎన్నిక పట్ల ఇండియన్ లీగల్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ (ఐఎల్‌పిఏ) హృదయపూర్వక అభినందనలు తెలిపింది.ఈ కార్యక్రమంలో న్యాయవాదులు ఎర్ర పాటి కృష్ణ, సాదిక్ పాషా, అక్కినేని వెంకట దుర్గారావు, యెర్రా కామేష్, మారపాక రమేష్, అంబటి రమేష్, చిన్నికృష్ణ, సామంత్, వడ్లకొండ హరిప్రసాద్, జి. గోపికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# హరీష్ రావు వ్యాఖ్యలపై ఘాటుగా స్పందించిన సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్

- "క్యాబినెట్‌లో జరిగిన ప్రతీ అంశాన్ని సిద్ధిపేట వెంకటేశ్వర స్వామి సాక్షిగా చెబుతా"
- వచ్చే శనివారం నేను గుడికి వస్తా? లేదా మీరే డేట్ టైమ్ చెప్పండి
- మాజీ మంత్రి హరీష్ రావుకు సవాలు/ ఛాలెంజ్ విసిరిన సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి



**చర్చ :- కరీంనగర్ కరీంనగర్, అక్టోబర్ 19:** రాష్ట్ర ఎస్సీ ఎస్టీ మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ గారు మాజీ మంత్రి హరీష్ రావు చేసిన వ్యాఖ్యలపై ఘాటుగా స్పందించారు."సిద్ధిపేట వెంకటేశ్వర స్వామి ఆలయానికి రానున్న శనివారం వస్తా. నా తల్లిదండ్రులపై ప్రమాణం చేసి, క్యాబినెట్‌లో జరిగిన ప్రతి అంశాన్ని స్వామి సాక్షిగా చెబుతా," అని మంత్రి అడ్లూరి ...మాజీ మంత్రి హరీష్ రావ్ కు సవాలు విసిరారు.
"డేట్, టైమ్ నేనే చెబుతున్నా ం సిద్ధమా హరీష్ రావు లేక నువ్వే చెబితే నేనే వస్తా," అంటూ సూటిగా ప్రశ్నించారు.

### "క్యాబినెట్‌పై అవహేళన చేయడం తగదు"

రాష్ట్ర క్యాబినెట్‌లో ప్రజా సంక్షేమం, విద్య, బీసీ రిజర్వేషన్లు, దళిత సంక్షేమం వంటి అంశాలపై లోతుగా చర్చ జరిగిందని మంత్రి తెలిపారు."దళిత, బీసీ, బలహీన వర్గాలకు ప్రాధాన్యం ఇచ్చే క్యాబినెట్ ఇది. అలాంటి క్యాబినెట్‌పై 'దండుపాళ్యం' అని అవహేళన చేయడం అన్యాయం," అన్నారు.
"నీతి, ధర్మం, న్యాయం ఉంటే నా సవాల్ స్వీకరించు. తెలంగాణ ప్రజలకు తప్పుడు సమాచారం ఇచ్చి తప్పుదారి పట్టించడం ఎక్కడివి?" అని అడ్లూరి ప్రశ్నించారు.

### "ముందు కవిత వ్యాఖ్యలపై సమాధానం చెప్పు"

"నీ కుటుంబ సభ్యురాలు కవిత అక్క చేసిన వ్యాఖ్యలపై ముందు సమాధానం చెప్పు. గత 10 ఏళ్ల పాలనలో జరిగిన పాపాలు, మోసాల గురించి చెప్పింది.
నేరెళ్ల ఘటనపై కవిత చేసిన ఆరోపణలకు కూడా జవాబు చెప్పు," అని అడ్లూరి నిలదీశారు.

### "కాళేశ్వరం అవినీతి లెక్క తేల్చండి"

"కాళేశ్వరం ప్రాజెక్ట్ ఎలా కూలింది? కోట్ల రూపాయల అవినీతికి బాధ్యులు ఎవరు? ముందు దానికి సమాధానం చెప్పండి.
మీ హయాంలో రాష్ట్ర ఖజానా దోచుకోవడం, దాచుకోవడమే జరిగింది," అని మంత్రి మండిపడ్డారు.
"2004 ముందు నీ ఆస్తులు ఎంత ఉండేవి? 2023 నాటికి ఎలాగో తెలియని రీతిలో ఆస్తులు కోట్లకు మించి అమాంతంగా పెరిగాయి. రబ్బరు చెప్పులు వేసుకున్న హరీష్ రావు కోట్ల ఆస్తులు సంపాదించారని పత్రికలే రాశాయి," అని వ్యాఖ్యానించారు.

### "దళిత%-%బీసీ వర్గాల ఎదుగుదల మీకు ఇష్టం లేదు"

"దళితులు, బీసీలు క్యాబినెట్‌లో ఉండటం హరీష్ రావుకు తట్టుకోవడం లేదు.గతంలో ఉప ముఖ్యమంత్రి రాజయ్య, మంత్రి కొప్పుల ఈశ్వర్‌లను కూడా మీరు అవమానించారు," అని అడ్లూరి వ్యాఖ్యానించారు.
"కానీ ఈరోజు రేవంత్ రెడ్డి గారి ప్రజా ప్రభుత్వం దళితులకు, బలహీన వర్గాలకు ప్రాధాన్యం ఇస్తోంది. ముఖ్యమంత్రి స్వయంగా నన్ను పక్కన కూర్చోబెట్టుకుని నా శాఖ సమస్యలను పరిష్కరిస్తున్నారు," అని మంత్రి వివరించారు.

### "ఎస్సీ వర్గీకరణ, బీసీల రిజర్వేషన్లపై మా చిత్తశుద్ధి"

"ఎస్సీ వర్గీకరణ, బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ఇవ్వడం పై మా చిత్తశుద్ధిని ప్రశ్నించడం తగదు.ఆ తీర్మానాల సమయంలో కేసీఆర్ అసెంబ్లీకి ఎందుకు రాలేదు?" అని అడ్లూరి ప్రశ్నించారు."తెలంగాణ ఉద్యమంలో డప్పు కొట్టింది, గజ్జె కట్టింది మేమే. దళిత, బీసీ వర్గాలు అంటే కేసీఆర్‌కు గిట్టవు.గత పార్లమెంట్ ఎన్నికల్లో టీఆర్ఎస్ కార్యకర్తలే బీజేపీకి ఓటు వేయమన్నారు ఇది నిజం కాదా?" అని హరీష్ రావు ను ప్రశ్నించారు

### "బీజేపీతో కుమ్మక్కాయింది మీరు ం మేము కాదు"

"మేము కాంగ్రెస్ పార్టీ సభ్యులం ఇది సెక్యులర్ పార్టీ. మత రాజకీయాలతో మాకు సంబంధం లేదు.కానీ బీజేపీతో కుమ్మక్కైనవారు మీరే," అని మంత్రి స్పష్టం చేశారు.

### "కరీంనగర్ నీళ్లను సిద్ధిపేటకు మళ్లించడం తగదు"

"మా కరీంనగర్ జిల్లాకు చెందిన నీటిని సిద్ధిపేటకు మళ్లించడం ఏ న్యాయం? ఇది సరికాదు.హరీష్ రావు గారు, మీ నోరు అదుపులో పెట్టుకోండి. ప్రజా ప్రతినిధిగా మాట్లాడే బాధ్యత గుర్తుంచుకోండి," అని అడ్లూరి హెచ్చరించారు.

### "ప్రజా హామీలను నెరవేర్చేందుకు కట్టుబడి ఉన్నాం"

"ప్రభుత్వానికి ఇంకా మూడేళ్లు సమయం ఉంది. ఆ సమయానికల్లా ఇచ్చిన ప్రతి హామీని కచ్చితంగా నెరవేర్చుతాం. ఇప్పటికే నిరుద్యోగులకు గ్రూప్-1, గ్రూప్-2 నియామకాలు పూర్తి చేసి నియామక పత్రాలు ఇచ్చాం.పేద ప్రజల ఇల్లు సహకారం చేసే దిశగా ఇందిరామ్మ ఇళ్ళను కట్టిస్తున్నాం.
అలాగే 200 యూనిట్ల వరకు ఉచిత కరెంటును, అలాగే మహాలక్ష్మి లో భాగంగా ఉచిత బస్సు ప్రయాణం వంటి హామీలను నెరవేరుస్తున్నాం.మీ హయంలో పది ఏళ్ల పాటు ఈ పరీక్షలు ఎందుకు జరగలేదు?" అని అడ్లూరి ప్రశ్నించారు.

### "రైతుల ధాన్యాన్ని కూడా కొనలేని పాలన"

"మీ హయంలో రైతులు పండించిన ధాన్యాన్ని కొనుగోలు చేయించలేకపోయారు. కనీస మద్దతు ధర ఇవ్వలేదు.మేము మాత్రం ఆర్థిక ఇబ్బందులు మధ్యా ప్రజా సంక్షేమం కోసం నిరంతరం కృషి చేస్తున్నాం," అని మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు.ఈ సమావేశంలో సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి, సెల్ ప్రెసిడెంట్ కొరివి అరుణ్ కుమార్,మైనార్టీ సెల్ ప్రెసిడెంట్ తాజుద్దీన్,దండి రవీందర్,చెర్ల పద్మ, సమద్ నవాబ్, కొట్టె ప్రభాకర్,లైక్,నాగరాజు,శిల్ప తదితరులు పాల్గొన్నారు.

# బంద్ వేళ దాడులు ఎనిమిది మంది అరెస్ట్



**హైదరాబాద్, అక్టోబర్ 19:** స్థానిక సంస్థల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేస్తూ బీసీ సంఘాల ఐక్య వేదిక(బీసీ జేఏసీ) శనివారం తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా బంద్‌కు పిలుపునిచ్చింది. ఈ బంద్ దాదాపుగా ప్రశాంతంగా జరిగినా.. కొన్ని ప్రాంతాల్లో మాత్రం హింసాత్మక సంఘటనలు చోటు చేసుకున్నాయి. అందుకు కారణమైన ఎనిమిది మందిపై పోలీసులు పలు సెక్షన్ల కింద కేసులు నమోదు చేసి అరెస్ట్ చేశారు. ఈ దాడులకు పాల్పడిన వారిపై నల్లకుంట, కాచిగూడ పోలీస్ స్టేషన్లలో కేసులు నమోదయ్యాయి.బీసీ బంద్ నేపథ్యంలో విద్యానగర్ నుంచి బర్కత్‌పూర వరకు బీసీ జేఏసీ నేతలు ర్యాలీగా తరలి వచ్చారు. ఆ క్రమంలో ఈ మార్గంలో తెరిచి ఉంచిన పలు షాపులు, షోరూంలతోపాటు పెట్రోల్ బంక్‌పై దాడులు చేశారు. దీంతో బాధితులు పోలీసులను ఆశ్రయించారు. వీరి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. అందులో భాగంగా ఆ పరిసర ప్రాంతాల్లోని సీసీ కెమెరా ఫుటేజ్‌లను పోలీసులు పరిశీ లించి.. నిందితుల కోసం గాలింపు చర్యలు చేపట్టారు. అందులో భాగంగా శనివారం అర్ధరాత్రి ఈ హింసాత్మక సంఘటనలకు బాధ్యులను పోలీసులు అరెస్ట్ చేసి.. రిమాండ్‌కు తరలించారు.

# విష్ణువర్ధన్ రెడ్డి నామినేషన్ దాఖలు సునీత నామినేషన్ ఆమోదం పొందితే ఉపసంహరణ



**హైదరాబాద్ అక్టోబర్ 19:** హైదరాబాద్ లోని జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలకు బీఆర్ఎస్ తరపున ఆ పార్టీ నేత, మాజీ ఎమ్మెల్యే విష్ణువర్ధన్ రెడ్డి నామినేషన్ దాఖలు దాఖలు చేశారు. ఎన్నికల అధికారులకు రెండు సెట్ల నామినేషన్ పత్రాలను పీవీఆర్ అందజేశారు. ముందు జాగ్రత్త చర్యల్లో భాగంగా విష్ణుతో నామినేషన్ వేయించామని బీఆర్ఎస్ చెబుతోంది. మాగంటి సునీత నామినేషన్‌ను ఎన్నికల అధికారులు ఆమోదం తెలిపిన తరువాత విష్ణువర్ధన్ రెడ్డి నామినేషన్ ఉపసంహరించుకుంటారని సమాచారం. బైపోల్ లో బరిలో నిలిచేందుకు బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి మాగంటి సునీత ఇప్పటికే (అక్టోబర్ 15) నామినేషన్ దాఖలు చేశారు. షేక్‌పేట తహసీల్దార్ కార్యాలయంలో ఎన్నికల రిటర్నింగ్ అధికారికి ఆమె నామినేషన్ పత్రాలు సమర్పించారు.హైదరాబాద్ లోని జూబ్లీహిల్స్ నియోజకవర్గ ఉపఎన్నిక పొలిటికల్ హీట్ పెంచుతుంది. బీఆర్ఎస్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ హఠాన్మరణంతో ఈ స్థానానికి ఉపఎన్నిక ఖరారైంది.ఇప్పటికే ఎన్నికల నోటిఫికేషన్ విడుదల చేసిన అధికారులు, బైపోల్ నిర్వహణకు చర్యలు వేగవంతం చేస్తున్నారు. అటు రాష్ట్రంలోని ప్రధాన పార్టీలైన కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ తమ అభ్యర్థిని ప్రకటించాయి. బీఆర్ఎస్ తరపున గోపీనాథ్ భార్య మాగంటి సునీతను గులాబీ పార్టీ బరిలోకి దింపింది. కాంగ్రెస్ పార్టీ తరపున నవీన్ యాదవ్ పోటీ చేయనున్నారు. ఇక బీజేపీ పార్టీ తరపున లంకల దీపక్ రెడ్డి పోటీ చేయనున్నారు. ఇప్పటికే అభ్యర్థులు ఉపఎన్నికకు నామినేషన్ దాఖలు చేశారు. అటు జూబ్లీహిల్స్ లోని డివిజన్లలో అభ్యర్థులు పోటా పోటీగా ప్రచారం చేస్తున్నారు. గెలుపు ఎవరిని వరిస్తుందనేదానిపై రోజురోజుకి ఉత్కంఠ పెరుగుతుంది.

# తెలంగాణలో యూరియా కొరత ఎందుకొచ్చింది రేవంత్ ప్రభుత్వంపై టీ బీజేపీ చీఫ్ ప్రశ్నల వర్షం




**ఖమ్మం:** జిల్లాలో ముగ్గురు మంత్రులు ఉన్నారని.. అభివృద్ధి మాత్రం లేదని బీజేపీ తెలంగాణ అధ్యక్షుడు రామచంద్రరావు ఆరోపించారు. కేంద్రప్రభుత్వం ఇచ్చే నిధులతో ఖమ్మం జిల్లాలో కోట్లాది రూపాయల అభివృద్ధి జరుగుతోందని ఉద్ఘాటించారు. ఖమ్మం జిల్లాలో రాబోయే ఎన్నికల్లో భారతీయ జనతా పార్టీ జెండా ఎగురవేస్తామని ధీమా వ్యక్తం చేశారు. రాబోయే ఏ ఎన్నికలైనా బీజేపీ అభ్యర్థులదే విజయమని జోస్యం చెప్పారు. ఖమ్మం జిల్లా కమ్యూనిస్టుల గడ్డ కాదని.. ఇకపై బీజేపీ అడ్డా కాబోతోందని ఉద్ఘాటించారు. ఖమ్మం జిల్లాలో చాలామంది కమ్యూనిస్టులు తనకు టచ్‌లో ఉన్నారని తెలిపారు. కమ్యూనిస్టులు బీజేపీలోకి రావాలని స్వాగతం పలికారు. (మంగళవారం) ఖమ్మం జిల్లాలో రామచ ంద్రరావు పర్యటించారు. ఖమ్మం నగరంలో రామచంద్రరావు రోడ్ షో నిర్వహించారు. నగరంలోని సప్తపది ఫంక్షన్ హాల్‌లో బీజేపీ నాయకులు, కార్యకర్తలతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా రామచంద్రరావు ఏబీఎన్‌తో మాట్లాడారు.తెలంగాణ రాష్ట్రానికి కేంద్రప్రభుత్వం అందజేస్తున్న యూరియా లెక్కలకు సంబంధించి రేవంత్ ప్రభుత్వం తప్పుడు లెక్కలు చెబుతోందని రామచంద్రరావు ఆరోపించారు. తెలంగాణకు ఖరీఫ్ సీజన్‌కు ఇప్పటివరకు 6.14 లక్షల మెట్రిక్ టన్నుల యూరియాని కేంద్రప్రభుత్వం అందజేసిందని స్పష్టం చేశారు. ఇంకా ఎంత యూరియా కావాలంటే అంత ఇచ్చేందుకు మోదీ ప్రభుత్వం సిద్ధంగా ఉందని చెప్పుకొచ్చారు. రబీ సీజన్ 2004-2005లో 9 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా అవసరం ఉందని. కానీ తెలంగాణలో 12.5 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా అందుబాటులో ఉందని స్పష్టం చేశారు. ఇప్పుడు యూరియా లేదని కాంగ్రెస్ నేతలు చెబుతున్నారని.. రబీలో అదనంగా ఉన్న యూరియా ఇప్పుడు ఎందుకు లేకుండా పోయిందని.. ఎందుకు కొరత వచ్చిందో రేవంత్ ప్రభుత్వం పరిశీలించుకోవాలని సూచించారు. రాజకీయాల కోసం మంత్రి తుమ్మల నాగేశ్వరరావు రైతులను తప్పుదోవ పట్టిస్తున్నారని ధ్వజమెత్తారు. తాను చెప్పింది తప్పయితే తాను తన పదవికి రాజీనామా చేస్తానని.. మీది తప్పు అయితే మీరు రాజీనామా చేస్తారా అని తుమ్మలకు సవాల్ చేశారు. తుమ్మల తనకు మిత్రులే అది తర్వాత సంగతి అని చెప్పుకొచ్చారు రామచంద్రరావు.బీసీ రిజర్వేషన్ విషయంలో తాము చిత్తశుద్ధితో ఉన్నామని రామచంద్రరావు నొక్కిచెప్పారు. బీసీ రిజర్వేషన్ల పేరుతో కాంగ్రెస్ పార్టీ బీసీలను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేస్తోందని ఆక్షేపించారు. బీసీలకు అన్యాయం జరిగితే చూస్తూ ఊరుకోమని హెచ్చరించారు. ఏ పార్టీలో అయినా ఆ పార్టీ నాయకుడు లేదా ముఖ్యమంత్రి స్థాయి నేతలు ఆయా రాష్ట్రాల్లో పాదయాత్రలు చేస్తారని.. కానీ కాంగ్రెస్‌లో ఆ పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జ్ జయంతి నటరాజన్ పాదయాత్ర చేస్తున్నారని ఎద్దేవా చేశారు. దీన్ని బట్టి కాంగ్రెస్‌లో ఏం జరుగుతుందో అర్థమవుతోందని విమర్శించారు. బీసీ రిజర్వేషన్లపై కాంగ్రెస్ వైఖరిని వ్యతిరేకిస్తున్నామని అన్నారు. 42 శాతం బీసీలకు రిజర్వేషన్ అమలు చేయాల్సిందేనని డిమాండ్ చేశారు. కాంగ్రెస్‌ది బీసీ రిజర్వేషన్ కాదని.. ముస్లింల రిజర్వేషన్ అని ఆరోపించారు. కాంగ్రెస్ బీసీలను మోసం చేస్తోందని విమర్శించారు. తాము ముస్లింల రిజర్వేషన్‌కు వ్యతిరేకం కాదని క్లారిటీ ఇచ్చారు. ముస్లింలకు ఓబీసీ రిజర్వేషన్ అమలు చేయాలని సూచించారు. కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రంలో ఏం చేస్తుందో ప్రజలు అర్థం చేసుకోవాలని కోరా రు. ఖమ్మం, నల్గొండ బ్యాచ్ ముఖ్యమంత్రిని సరిగా పని చేయనీయటం లేదని రామచంద్రరావు విమర్శలు చేశారు.

# సాంస్కృతి,సాంప్రదాయాలు భావితరాలకు అందించాలి



**నార్నూర్ :** ఆదివాసుల సంస్కృతి, సాంప్రదాయాలు చాలా గొప్పవని అన్నారు. ఆదిలాబాద్ జిల్లా నార్నూర్ మండలం జామడ గ్రామంలో ఆదివారం నిర్వహించిన దండారి ఉత్సవాల్లో ఎస్పీ పాల్గొన్నారు. గుస్సాడి, వాయిద్యాలతో ఎస్పీకి గ్రామస్థులు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఏత్మాసూర్ పేన్ కు సాంప్రదాయ పూజలు చేసిన అనంతరం ఆదివాసి పెద్దలు శాలువాతో సన్మానించారు.ఎస్పీ మాట్లాడుతూ ఆదివాసులు అన్ని రంగాలలో అభివృద్ధి సాధించాలని ఆకాంక్షించారు. మూఢనమ్మకాల ను విశ్వసించకుండా వ్యాధుల బారిన పడితే ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రిని ఆశ్రయించి చికిత్స చేయించుకోవాలని సూచించారు. బాబాలు, మంత్రగాళ్లను నమ్మవద్దన్నారు. పిల్లలకు చదువు పట్ల గల ప్రాధాన్యతను తెలియజేయాలని కోరారు.అంతకుముందు ఆ గ్రామానికి చెందిన 50 మంది విద్యార్థులకు నోటు పుస్తకాలు, పెన్నులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఉట్నూర్ సీఐ ఎం. ప్రసాద్, నార్నూర్ సీఐ డి. పద్మ, ఎస్సైలు సాయన్న, అఖిల్, రాయి సెంటర్ జిల్లా సార్ మేడి మేస్రం దుర్గుపటేల్, తహసీల్దార్ జాడి రాజాలింగం, ఎంపీడీవో రాథోడ్ గంగా సింగ్, నాయకులు రామకృష్ణ, కోశేరావ్. వెంకటరావ్ పటేల్ పాల్గొన్నారు.

# 8 మంది బీసీ నేతల అరెస్ట్ ఆర్.కృష్ణయ్య ఆగ్రహం




**హైదరాబాద్:** స్థానిక సంస్థల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేస్తూ బీసీ సంఘాల ఐక్య వేదిక శనివారం తెలంగాణ బంద్‌కు పిలుపునిచ్చిన విషయం తెలిసిందే.. ఈ బంద్ కు అన్ని పార్టీలు, సంఘాలు మద్దతు తెలిపాయి. అయితే.. ఈ బంద్ అన్ని ప్రాంతాల్లో ప్రశాంతంగా జరిగింది.. కానీ కొన్ని ప్రాంతాల్లో హింసాత్మక సంఘటనలు చోటు చేసుకోవడంతో పోలీసులు చర్యలు ప్రారంభించారు. హైదరాబాద్‌లో అక్టోబర్ 18 (శనివారం) నాడు జరిగిన దాడులపై పోలీసుల కేసు నమోదు చేసి.. ఎనిమిది మంది యువకులను అరెస్టు చేశారు. ఈ మేరకు కాచిగూడ పోలీసులు ఎనిమిది మందిని అరెస్టు చేశారు. బజాజ్ ఎలక్ట్రానిక్స్ మేనేజర్ సయ్యద్ అమీనుద్దీన్ ఫిర్యాదు మేరకు పోలీసులు యువకులను అరెస్టు చేశారు. బీసీ నాయకులు బుజ్జ కృష్ణ, నిఖిల్, రామకోటి, రాజ్ కుమార్, మోడీ, సాయిబాబా, రవితేజ, రామ్మూర్తిలపై వివిధ సెక్షన్ల కింద కేసులు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. ఎనిమిది మంది యువకులకు గాంధీ హాస్పిటల్‌లో వైద్య పరీక్షల అనంతరం జడ్జి ముందు హాజరుపరిచి రిమాండ్‌కు తరలిం చారు. కాగా.. దాడులకు పాల్పడిన వారిపై నల్లకుంట, కాచిగూడ పోలీస్ స్టేషన్లలో వేర్వేరుగా కేసులు నమోదయ్యాయి.ఆర్ .కృష్ణయ్య ఆగ్రహం.కాగా.. యువకుల అరెస్ట్‌పై బీసీ సంఘాల ఆగ్రహం వ్యక్తంచేశాయి. దొంగలు, నక్సలైట్లను అరెస్ట్ చేసిన విధంగా అర్ధరాత్రి అరెస్ట్ చేస్తారా..? అని బీసీ సంఘం నేత, బీజేపీ ఎంపీ ఆర్.కృష్ణయ్య ప్రశ్నించారు. బీసీ రిజర్వేషన్లు రాకుండా కాంగ్రెస్ యత్నిస్తోందంటూ ఆయన మండిపడ్డారు. ముందస్తు నోటీసులు ఇవ్వకుండా అర్ధరాత్రి అరెస్ట్ చేయడం సరికాదంటూ ఆర్.కృష్ణయ్య పేర్కొన్నారు.

# చేసిన అభివృద్ధే బీఆర్ఎస్‌ను గెలిపిస్తుంది




**మూసాపేట, అక్టోబర్19 :** బీఆర్ఎస్ హయంలో చేసిన అభివృద్ధితో జూబ్లిహిల్స్‌లో తమ అభ్యర్థి విజయం ఖాయమని నర్సాపూర్ శాసన సభ్యురాలు సునిత లక్ష్మారెడ్డి అన్నారు. జూబ్లిహిల్స్ ఉప ఎన్నికల ప్రచారంలో భాగంగా డివిజన్ పరిధి ప్రేమ్‌నగర్, ఓల్డ్ శాస్త్రీనగర్‌లలో సునితా లక్ష్మారెడ్డి ఆదివారం మూసాపేట డివిజన్ మాజీ కార్పొరేటర్ తూము శ్రావణ్‌కుమార్, ఎర్రగడ్డ డివిజన్ కంటెస్టడ్ కార్పొరేటర్ పల్లవి మహేందర్ యాదవ్‌తో కలసి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమే మాట్లాడుతూ..కాంగ్రెస్ రెండెళ్ల పాలనలో ప్రజలు విసిగిపోయారన్నారు. బీఆర్ఎస్ అభ్యర్థి గెలుపు ద్వారానే ప్రజలకు సంక్షేమ అభివృద్ధి ఫలాలు అందుతాయన్నారు. ప్రజలను మోసం చేస్తే ఫలితాలు ఎలా ఉంటాయో రానున్న జూబ్లిహిల్స్ ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి అర్థం అవుతుందన్నారు. ఏ బస్తీకి వెళ్లిన దివంగత ఎమ్మెల్యే మాగంటి గోపినాథ్ చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాల గురించే ఓటర్లు మాట్లాడుతున్నారని ఉప ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థి మాగంటి సునితాగోపినాథ్ భారీ మోజార్టీతో విజయం సాధించడం ఖాయమని అమే అన్నారు. కార్యక్రమంలో ఎర్రగడ్డ డివిజన్ అధ్యక్షుడు డి. సంజీవ, మూసాపేట డివిజన్ అధ్యక్షుడు అంబటి, ప్రధాన కార్యదర్శులు తిరుపతి, షరీఫ్ బూత్ స్థాయి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక బీఆర్ఎస్ తరపున విష్ణువర్ధన్ రెడ్డి నామినేషన్



బీఆర్ఎస్ ఎమ్మెల్యే మాగంటి గోపినాథ్ అకాల మరణంతో అనివార్యమైన జూబ్లీహిల్స్ నియోజకవర్గం ఉప ఎన్నిక రసవత్తరంగా మారింది. నవంబర్ 11న పోలింగ్ జరగనున్న ఈ ఎన్నికను అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష బీఆర్ఎస్‌తో పాటు బీజేపీ కూడా ప్రతిష్టాత్మకంగా తీసుకుని ప్రచారం చేస్తున్నారు. మూడు ప్రధాన పార్టీలు ఇప్పటికే తమ అభ్యర్థులను ప్రకటించి నామినేషన్ల ప్రక్రియను పూర్తి చేస్తున్నాయి. బీఆర్ఎస్ పార్టీ దివంగత సిట్టింగ్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ సతీమణి మాగంటి సునీతకు మరోసారి అవకాశం కల్పించింది. కాంగ్రెస్ పార్టీ నుంచి నవీన్ యాదవ్‌ను బరిలోకి దింపగా.. బీజేపీ తరపున లంకల దీపక్‌రెడ్డి పోటీ చేస్తున్నారు.అయితే, బీఆర్ఎస్ పార్టీ ఈ ఉప ఎన్నిక విషయంలో అత్యంత అప్రమత్తంగా వ్యవహరిస్తోంది. ప్రధాన అభ్యర్థి మాగంటి సునీత ఇప్పటికే మూడు సెట్ల నామినేషన్లు దాఖలు చేసినప్పటికీ.. ముందస్తు జాగ్రత్త చర్యగా పార్టీ మరో అభ్యర్థితో కూడా నామినేషన్ వేయించింది. దివంగత సీనియర్ నేత పి. జనార్దన్ రెడ్డి (పీజేఆర్) కుమారుడు, మాజీ ఎమ్మెల్యే పి. విష్ణు వర్ధన్ రెడ్డితో కూడా బీఆర్ఎస్ తరపున ప్రత్యామ్నాయ నామినేషన్ దాఖలు చేయించింది. ప్రధాన అభ్యర్థి మాగంటి సునీత సమర్పించిన నామినేషన్ పత్రాలలో ఏవైనా సాంకేతిక గుర్తైతే బీఆర్ఎస్ అభ్యర్థిగా విష్ణు వర్ధన్ రెడ్డి ఆ స్థానంలో పోటీలో నిలబడే అవకాశం ఉంటుంది.ఒకవేళ మాగంటి సునీత నామినేషన్ సక్రమంగా ఉండి ఎన్నికల సంఘం ఆమోదిస్తే, నామినేషన్‌ను ఉపసంహరించుకుంటారు. ఈ విధంగా ఎన్నికల బరిలో తమ పార్టీ అభ్యర్థి తప్పనిసరిగా ఉండాలనే లక్ష్యంతో బీఆర్ఎస్ ఈ ముందు జాగ్రత్త చర్య తీసుకుంది. జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక లో గెలుపును ప్రతి పార్టీ ప్రతిష్టాత్మకంగా తీసుకోవడంతో ఈ తరహా రాజకీయ వ్యూహాలు చర్చనీయాంశమవుతున్నాయి. కాగా, నవంబర్ 11న జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక పోలింగ్ జరగనుండగా.. నవంబర్ 14న ఫలితాలు వెల్లడి కానున్నాయి.

చర్చ
తెలుగు దిన పత్రిక
సోమవారం,
అక్టోబర్ 20, 2025



# ఏపీలో భారీ పేలుడు ఆరుగురికి గాయాలు

**పార్వతీపురం మన్యం:** ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం పార్వతీపురం మన్యం జిల్లా (ఆదివారం) భారీ పేలుడు సంభవించింది. పార్వతీపురం మన్యం జిల్లాలోని ఆర్టీసీ కాంప్లెక్స్‌లో భారీ పేలుడు చోటుచేసుకుంది. ఈ ప్రమాదంలో ఆర్టీసీ బస్సు నుంచి ఏఎన్ఎల్ పార్సిల్‌కి వచ్చిన సామన్లు దించుతుండగా ఒక్కసారిగా పేలుడు సంభవించింది. ఈ ఘటనలో నలుగురికి తీవ్రగాయాలు కాగా... మరో ఇద్దరికి స్వల్ప గాయాలయ్యాయి. క్షతగ్రాతులని వెంటనే స్థానిక ఆస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన చికిత్స కోసం ఇరువురిని విశాఖపట్నంలోని ఓ ఆస్పత్రికి తరలించారు. ఈ ప్రమాదంపై పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది. ఈ ప్రమాదంలో బస్సు అద్దాలు, సామగ్రి మ్నొత్తం ధ్వంసమయ్యాయిఈ ఘటనపై పోలీసులకు ఆర్టీసీ అధికారులు, స్థానికులు సమాచారం అందజేశారు. సమాచారం అందుకున్న వెంటనే పోలీసులు హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకున్నారు. స్థానికులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. అయితే, ఈ ప్రమాదానికి కారణం ఇంకా తెలియరాలేదు. బాణసంచా పేలుడా? లేక ఏమైనా బాంబులు ఉన్నాయా? అనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.



# చంద్రబాబును అరెస్ట్ చేసినప్పుడు బ్రాహ్మిణి ఇదే అడిగింది

**అమరావతి, అక్టోబర్ 19:** 180 బిలియన్ ఎకానమీగా ఉన్న ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని రూ. 240 ట్రిలియన్ ఎకానమీగా మార్చడానికి కృషి చేయాలని ఆస్ట్రేలియాలోని తెలుగు వారికి రాష్ట్ర విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ పిలుపునిచ్చారు. ఆదివారం సిడ్నీలో ది ఆస్ట్రేలియా తెలుగు డయాస్పోరాతో మంత్రి నారా లోకేశ్ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ. తనకు గూగుల్ ఎంత ముఖ్యమో ఎంఎ స్ఎంఈ కూడా అంతే ముఖ్యమన్నారు. రూ. 50 కోట్ల పెట్టుబడి పెట్టి. నిరుద్యోగులకు ఉద్యోగాలు కల్పిస్తే మీకు అండగా నిలుస్తానని ఈ సందర్భంగా వారికి నారా లోకేశ్ స్పష్టం చేశారు. ఈ రోజు ఇక్కడికి వచ్చి మాట్లాడుతున్ననంటే ఆస్ట్రేలియా ప్రభుత్వమే అందుకు కారణమని ఆయన పేర్కొన్నారు. టెక్నికల్ ఎడ్యూకేషన్‌లో మంచి పద్దతులు, స్పోర్ట్స్, మైనింగ్ తదితర విషయాల్లో సహకరించుకుంటామన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని అభివృద్ధి చేయాలంటే.. ఏ ఒక్కరి వల్ల కాదని.. అందరం కలిసి ఒక తాటిపైకి వచ్చి ఆ పని చేయాల్సి ఉందని ఆయన అభిప్రాయపడ్డారు. ఇటీవల పక్క రాష్ట్రాలతో కూడా చిన్నచిన్న యుద్దాలు జరుగుతున్నాయని. ఆ క్రమంలో తనను ఎన్నో మా టలు అంటున్నారని తెలిపారు. అవేమీ తాను పట్టించుకోనని ఆయన చెప్పారు. రాష్ట్రాలు పోటీ పడితే ఇండియా గెలుస్తుందని



తాను విశ్వసిస్తానన్నారు. అందరూ వచ్చి రాష్ట్రాభివృద్ధిలో భాగ స్వాములం కావాలని తాను కోరుతున్నానని తెలిపారు. గతేడాది దీపావళికి తాను యూఎస్ఏలో ఉంటే.. ప్రస్తుతం ఆస్ట్రేలియాలో ఉన్నానని గుర్తు చేసుకున్నారు. ప్రపంచం మొత్తంలో తెలుగు వారు ఉండరని.. కానీ అమెరికా నుంచి ఆస్ట్రేలియా వరకూ మనదే డామినేషన్ అని ఈ సందర్భంగా నారా లోకేశ్ స్పష్టం చేశారు. చంద్రబాబు నాయుడిను విజనరీ అంటామని.. ఇంకొ కరిని ప్రిజనరీ అంటాం.. అర్థం అయ్యిందా? రాజా అంటూ లోకేశ్ పేర్కొన్నారు. అయితే గౌరవంగా గడిపేవాళ్లం.. మనకు ఈ రాజకీయాలు అవసరమా? అని తన భార్య బ్రాహ్మిణి.. తన తండ్రి చంద్రబాబు నాయుడిని అరెస్ట్ చేసినప్పుడు ప్రశ్నించిం దని. ఆ సమయంలో మీ స్పందన చూసి.. అందుకోసం మనం రాజకీయాల్లో ఉండాలని బ్రాహ్మిణికి స్పష్టం చేశానని లోకేశ్ తెలిపారు. గత ఎన్నికల్లో విదేశాల్లోని వారు సైతం కూటమి గెలుపు కోసం ఎంతో సహకరించారన్నారు. అందువల్లే 94 శాతం సీట్లు కూటమి గెలిచిందని చెప్పారు. ఆ ఎన్నికల్లో ఇంత వేవ్ రావడం వెనుక ఇక్కడి ప్రతి వ్యక్తి కష్టం ఉందని తెలిపారు. తనతో సహా 50 మంది కొత్త ఎమ్మెల్యేలు.. ఈ సారి అసెంబ్లీలోకి అడుగు పెట్టారని పేర్కొన్నారు. గత 16 నెలల్లో రూ.10 లక్షల కోట్ల పెట్టబడులు ఆంధ్రప్రదేశ్‌కి వచ్చాయని వివరించారు. ఒకే రాష్ట్రం ఒకే రాజధాని అయితే అభివృద్ధి వికేంద్రికరణే తమ లక్ష్యమని ఆనాడే చెప్పామన్నారు. ఉత్తరాంధ్ర ఫార్మాహబ్‌గా, స్టీల్ సిటీగా ఇప్పుడు డేటా హబ్ కూడా రూపాంతరం చెందుతుందని విశ్వాసం వ్యక్తం చేశారు. ఏపీకి గూగుల్ వచ్చిందంటే అందుకు కేంద్రం సహకారం సైతం ఉందన్నారు. ఈ సంస్థ ఏర్పాటుకు కొన్ని చట్టాలు అడ్డు వస్తున్నాయని ప్రధాని దృష్టికి సీఎం చంద్రబాబు తీసుకు వెళ్లారన్నారు. ఈ విషయాన్ని వెంటనే ఆర్థిక మంత్రికి చెప్పి అందుకు సంబంధించిన చట్టాలను సైతం ప్రధాని మోదీ సవరణ చేయించారని వివరించారు. ఒక క్లారిటీతోనే తామంతా కలిసికట్టుగా ముందుకు వెళుతున్నామన్నారు.

# జీఎస్టీ 2.0 తో భలే లాభం

**- ఏపీ వాణిజ్య పన్నుల డిప్యూటీ కమిషనర్ వివరణ**

**నంద్యాలబ్యూరో :** జీఎస్టీ 2.0 సంస్కరణల వల్ల చిన్నవ్యాపారులు, స్వయం ఉపాధి దారులు, వినియోగదారులకు లాభం కలుగుతోందని వాణిజ్య పన్నుల శాఖ డిప్యూటీ కమిషనర్, నోడల్ అధికారి మురళీ మనోహర్ పేర్కొన్నారు. ఆదివారం కలెక్టరేట్‌లోని పిజిఆర్ఎస్ హాలులో జరిగిన జివెస్టీ 2.0 (ఉత్సవ్) అవగాహన కార్యక్రమాల ముగింపు సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. జిల్లాలో జీఎస్టీ 2.0 సూపర్ జివెస్టీ సూపర్ సేవింగ్స్ సంస్కరణలపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించేందుకు నెలరోజులపాటు చేపట్టిన కార్యక్రమాలు విజయవంతంగా ముగిశాయని పేర్కొన్నారు. గతంలో ఉన్న నాలుగు జివెస్టీ స్లాబ్‌లు 5శాతం, 12శాతం , 18శాతం , 28 శాతం ను సంక్షిప్త పరచి రెండు స్లాబ్‌లుగా మార్చడం జరిగిందన్నారు. కొన్ని వస్తువులపై పన్ను పూర్తిగా తొలగించడం వంటి కీలక మార్పులను ప్రజలకు సులభంగా అర్థమయ్యే విధంగా వివరించామని తెలిపారు. భవిష్యత్తులో ప్రజలకు మరింత సులభమైన సేవలు అందించేందుకు హెల్ప్‌లైన్, సలహా డెస్కులు ఏర్పాటు చేయనున్నామని తెలిపారు. జిల్లాలోని అన్ని శాఖల సమన్వయంతో ఈ అవగాహన కార్యక్రమాలు సమర్థవంతంగా పూర్తయ్యాయని చెప్పారు. కొత్త జివెస్టీ విధానం వల్ల నిత్యావసర వస్తువులు, ఎలక్ట్రానిక్ పరికరాలపై పన్ను తగ్గింపుతో ప్రజలకు నేరుగా లాభాలు కలుగుతున్నాయని వివరించారు. అంతకుముందు డీఈఓ ఆధ్వర్యంలో విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు, జీఎస్టీ అంశంపై ప్రదర్శనలు జరిగాయి. తమ ప్రతిభతో జివెస్టీ మార్పులను సృజనాత్మకంగా ప్రతిబింబించి ఆహుతులను ఆకట్టుకున్నారు.




# టీటీడీ ట్రస్టులో బంజారాలకు అవకాశం కల్పించాలి

**తిరుమల, అక్టోబరు19:** టీటీడీ ట్రసులో కూడా బంజారాలకు అవకాశం కల్పించాలని బీజేపీ మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేం దర్ కోరారు. హాథిరాంజీ బాబా మఠానికి చెందిన భూములు అన్యాక్రాంతం అయ్యాయని ఆరోపించారు. హాథిరాంజీ బాబా మఠాన్ని కూల్చివేయకుండా కొనసాగించాలని. మిగిలిన భూము లని కాపాడాలని కోరారు. ఈ మఠానికి సంబంధించిన బాధ్య తలు బంజారాలకి అప్పగించాలని విన్నవించారు ఎంపీ ఈటల రాజేందర్. తిరుమల వేంకటేశ్వర స్వామి)ని బంజారా సంఘం నేతలు, ఎంపీలు ఈటల రాజేందర్, బలరాం నాయక్, తెలంగా ణ డిప్యూటీ స్పీకర్ జాతోట్ రామచందర్ నాయక్, మాజీ ఎంపీ సీతారామ్ నాయక్ (ఆదివారం) దర్శించుకున్నారు. ఈ సందర్భ ంగా ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం మీడి యాతో మాజీ ఎంపీ సీతారామ్ నాయక్ మాట్లాడారు. హాథిరాంజీ మఠాన్ని అభివృద్ధి చేయాలి: సీతారామ్ నాయకహాథిరాంజీ బాబా మఠాన్ని టీటీడీ అభివృద్ధి చేయాలని సీతారామ్ నాయక్ కోరారు.



తిరుమలను ఈ స్థాయికి తీసుకువచ్చిన హాథిరాంజీ మఠం అభివృద్ధిని టీటీడీ ఎందుకు పట్టించుకోవడం లేదని ప్రశ్నించారు. వేంకటేశ్వర స్వామి వారిని ఆరాధించే హక్కు 12 కోట్ల జనాభా ఉన్న బంజారాలకు ఉందని గతంలో ప్రధానమంత్రి నరేంద్రమోదీ ప్రకటించారని గుర్తుచేశారు. హాథిరాంజీ మఠానికి గతంలో ట్రస్టు బోర్డు నియమించాలన్న ప్రతిపాదన ఎందుకు అమలు కాలేదని నిలదీశారు. తిరుపతిలో ఉన్న హాథిరాంజీ మఠాన్ని కూల్చి వేయాలని చేస్తున్నారని ఆరోపించారు సీతారామ్ నాయక్. హాథిరాంజీ మఠాన్ని రక్షించుకునేందుకు తామంతా తిరుమలకు వచ్చామని వివరించారు. శ్రీవారికి అత్యంత పవిత్ర భక్తుడు హాథిరాంజీ బాబా అని ఉద్ఘాటించారు. హాథిరాంజీ బాబా కేవలం వేంకటేశ్వర స్వామి భక్తుడిగా కాకుండా సంరక్షకుడిగానూ పని చేశారని కొనియాడారు. ఇప్పుడు వీఐపీలు రావచ్చుగాని.. ఆనాడు స్వామి వారిని హాథిరాంజీ బాబా కంటికి రెప్పలాగా చూసుకున్నారని చెప్పుకొచ్చారు. భక్తులు సమర్పించే కానుకలు కూడా హాథిరాంజీకి చెందేలా స్వామి వారు స్వయంగా ఆదేశించారని పేర్కొన్నారు. హాథిరాంజీ బాబా చరిత్ర కనుమరుగు కాకుండా ట్రస్టును కొనసాగించేలా చర్యలు తీసుకుంటామని సీతారామ్ నాయక్ తెలిపారు.

# ప్రతి ఇంటికీ రక్షిత తాగునీరు

**అమరావతి :** రాష్ట్రవ్యాప్తంగా జల్‌జీవన్ మిషన్ పనులు వేగం పుంజుకున్నాయి. ప్రతి ఇంటికీ స్వచ్ఛమైన తాగునీరు, ప్రతి గ్రామానికి రక్షిత నీటి భద్రత లక్ష్యంగా కూటమి ప్రభుత్వం ముం దుకెళ్తోంది. ఈ పనుల వేగవంతానికి ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ పక్కా ప్రణాళికలతో ముందుకెళ్తున్నారు. ప్రతి గ్రామీణ కుటుంబానికి కుళాయి ద్వారా సురక్షితమైన తాగునీరు అందించడం ద్వారా ప్రజలకు ఆరోగ్య భద్రత కల్పించే విధంగా ప్రణాళికలు అమలు చేస్తున్నారు. సిబ్బంది సామర్థ్యాల పెంపు, నీటి నాణ్యత, శుద్ధి, సరఫరాలకు ప్రాధాన్యం ఇస్తున్నారు. గ్రామీణ రక్షిత తాగునీటి సరఫరా విభాగం సిబ్బందిలో అంతర్గత సామర్థ్యాలు పెంచేలా క్షేత్రస్థాయిలో చిన్న ఉద్యోగి నుంచి రాష్ట్రస్థాయిలోని ఉన్నత ఇంజనీర్ వరకు శిక్షణ ఇస్తున్నారు. గత ప్రభుత్వ నిర్లక్ష్యం జల్‌జీవన్ మిషన్ లక్ష్యాలను దెబ్బతీస్తే...పవన్‌కల్యాణ్ కృషి, ప్రణాళిక జల్‌జీవన్ మిషన్‌కు కొత్త ఉత్సాహాన్ని ఇస్తోంది. గత ప్రభుత్వ ధోరణి కారణంగా నిధులు మురిగిపోయే పరిస్థితి తలెత్తగా...సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ అభ్యర్థనలతో కేంద్రం జల్‌జీవన్ మిషన్ పథకం నిర్దేశిత గడువును నాలుగేళ్లపాటు పొడిగించింది. ఈ ఏడాది ఐదు జిల్లాల పరిధిలో రూ.7,910 కోట్లతో పనులు చేస్తున్నారు. ఈ ప్రాజెక్టులు పూర్తయితే కోటి మంది దాహార్తి తీరుతుంది. దీంతో రానున్న 30 ఏళ్ల కాలానికి, 1.21 కోట్ల మందికి రక్షిత తాగునీరు ఇవ్వాలన్న సంకల్పం నెరవేర నుంది.




# మనది రైతు మిత్ర విధానం

**విజయవాడ:** రైతులకు ఎటు వంటి ఇబ్బందులు లేకుండా ఈ ఏడాది పండుగ వాతావరణంలో ధాన్యం కొనుగోలు సాగాలని రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ సూచించారు. విజయవాడలోని హెూటల్ లో శనివారం మంత్రి అధ్యక్షతన అధికారులకు రాష్ట్ర స్థాయి వర్క్‌షాప్ జరిగింది. ఈ వర్క్‌షాప్‌ను ఆంధ్రప్రదేశ్ సివిల్ సప్లై కార్పొరేషన్, సివిల్ సప్లై డిపార్ట్మెంట్ సంయుక్తంగా నిర్వహించారు. మంత్రి మాట్లాడుతూ, గత ఏడాది ధాన్యం కొనుగోలు సమయంలో క్షేత్రస్థాయిలో గుర్తించిన సమస్యలను ఈ ఏడాది ముందస్తు ప్రణాళికలతో పరిష్కరించుకోవాలని సూచించారు. ముఖ్యంగా గన్ని బ్యాగులు, లేబర్, ట్రాన్స్‌పోర్ట్వంటి సదుపాయాలను ముందుగానే సిద్ధం చేసుకోవాలని ఆదేశించారు. గన్ని బ్యాగ్స్ సరఫరాలో దళారులను అరికట్టడానికి జాయింట్ కలెక్టర్లు చొరవ తీసుకోవాలని, దీనికి జిల్లా పోలీసు శాఖ నుంచి ప్రత్యేక ఎస్ ఓ పి విడుదల చేస్తామని తెలిపారు. పీడీ ఎస్ బియ్యం రీసైక్లింగ్‌కు వ్యతిరేకంగా రైస్ మిల్లర్లు ఇచ్చిన హామీని అమలు చేయాలని అధికారులను మంత్రి తెలిపారు. ఈ అంశాన్ని అగ్రిమెంట్లలో స్పష్టంగా పొందుపరచాలని ఆదేశించారు. ఎఫ్ సీ ఐ(%ఖీజ×%)కి 60 రోజుల్లో బియ్యం సరఫరా చేసే రైస్ మిల్లులకు ప్రాధాన్యం ఇవ్వాలని తెలిపారు. ధాన్యం కొనుగోలు ప్రక్రియను రియల్ టైమ్ గవర్నెన్స్ ద్వారా పర్యవేక్షిస్తామని, ప్రతి అంశం డాష్ బోర్డులో అందుబాటులో ఉంటుందని చెప్పారు. పార దర్శకంగా వ్యవహరించాలని ఆయన అధికారులు పిలుపునిచ్చారు. గత ఏడాది అకాల వర్షాల కార ణంగా 30,000 టార్పాలిన్ లను పంపిణీ చేసినట్లు గుర్తు చేస్తూ, ఈసారి కూడా అవసరాన్ని బట్టి ముందస్తుగా టార్పాలిర్ లను సిద్ధం చేసుకోవాలని సూచించారు. గత ప్రభుత్వంలో రైతులు ధాన్యం విక్రయంలో ఎదుర్కొన్న ఇబ్బందులను గుర్తు చేస్తూ, ప్రస్తుత కూటమి ప్రభుత్వం ఫార్మర్ ఫ్రెండ్లీ విధానాల ద్వారా రైతులకు స్వేచ్ఛను కల్పించిందని అన్నారు. రైతులు తమకు నచ్చిన మిల్లుకు, నచ్చిన విక్రయించుకునే అవకాశం కల్పించామని చెప్పారు. రైతులు సులభంగా వాట్సాప్(లో హాయ్ పంపడం ద్వారా ధాన్యం విక్రయ ప్రక్రియలో చేరే సౌకర్యాన్ని కల్పించామని, విక్రయించిన 24 నుండి 48 గంటలలోపే రైతు ఖాతాల్లో నగదు జమ చేసిన విషయాలను గుర్తు చేశారు.



# ఉద్యోగులకు దీపావళి ధమాకా ఒక డీఏ కానుక

**అమరావతి, అక్టోబరు 18:** రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు ప్రభుత్వం దీపావళి కానుక ప్రకటించింది. ఉద్యోగులకు ఒక విడత డీఏ (కరువు భత్యం) విడుదల చేస్తున్నామని ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటించారు. నవంబరు నుంచి ఉద్యోగుల ఖాతాల్లో డీఏ సొమ్ము జమ అవుతుందని తెలిపారు. దీనికిగాను నెలవారీగా రూ.160 కోట్లు వెచ్చించనున్నట్టు వెల్లడించారు. ఉద్యోగ సంఘాల ప్రతినిధులతో శనివారం మంత్రివర్గ ఉప సంఘ సభ్యులు సుదీర్ఘంగా చర్చించారు. ఆ తర్వాత రాత్రి స్వయంగా ముఖ్యమంత్రి చంద్రబాబు వారితో భేటీ అయ్యారు. ఒక విడత డీఏతో సహా అనేక నిర్ణయాలను స్వయంగా ప్రకటించారు. ప్రభుత్వానికి ఆర్థిక వెసులుబాటు రాగానే పీఆర్సీని అమలు చేస్తామని హామీ ఇచ్చారు. అదేవిధంగా పోలీసులకు ఒక విడత ఈఎల్స్(ఆర్జిత సెలవులు) ఇస్తామని, దీన్ని రెండుసార్లుగా నవంబరులో రూ.105 కోట్లు, జనవరిలో రూ.105 కోట్లు చెల్లిస్తామని సీఎం చెప్పారు. ఉద్యోగులు ఆందోళన వ్యక్తం చేస్తున్న హెల్త్‌కార్డు సేవలను 60 రోజుల్లో వారి అవసరాలకు తగినట్టుగా మెరుగుపరుస్తామని తెలిపారు. అలాగే, 180 రోజుల చిన్నారుల సంక్షరణ సెలవుల(చైల్డ్‌కేర్ లీవు)ను వారు రిటైర్ అయ్యేలోగా ఎప్పుడైనా వాడుకోవచ్చని వెల్లడించారు. ఉద్యోగ సంఘాల కార్యాలయాలకు ఒకప్పుడు ఆస్తిపన్నుకి మినహాయింపు ఇచ్చామని, తర్వాత మునిసిపాలిటీల్లో ఆస్తి పన్ను కట్టాలంటూ వారికి జరిమానాల మీద జరిమానాలు వేశారని చెప్పారు. ఇప్పుడు వాటన్నింటినీ రద్దు చేస్తున్నామని, ఇకపై ఆస్తిపన్ను కట్టాల్సిన అవసరం లేకుండా నిర్ణయం తీసుకుంటామని



చెప్పారు. ఆర్టీసీ ఉద్యోగులకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న పదోన్నతుల సమస్యను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ప్యూన్, వాచ్‌మెన్, అటెండర్, జూనియర్ అసిస్టెంట్, ప్లంబర్ విధులు నిర్వహించే ఉద్యోగాల పేర్లు గౌరవప్రదంగా మార్చుతామని ముఖ్యమంత్రి హామీ ఇచ్చారు. 2004కి ముందు ఇచ్చిన నోటిఫికేషన్ ద్వారా భర్తీ అయి, ఉద్యోగాల్లోకి వచ్చిన వారికి ఓపీఎస్ వర్తించేలా సుప్రీంకోర్టు వెలువరించిన నిర్ణయం అమలుచేసేందుకు మంత్రి వర్గ ఉపసంఘం చర్యలు తీసుకుంటుందని ముఖ్యమంత్రి చెప్పారు. ఉద్యోగుల ఇతర సమస్యలపై కూడా ఈ కమిటీ ఎప్పటికప్పుడు చర్చించి సరైన నిర్ణయాలు తీసుకుంటుందని వెల్లడించారు. కాగా, పోలీసులకు 4 విడతల సరెండర్ లీవుల సొమ్ము చెల్లించాలి. ఒక్కొక్క విడతకు దాదాపు రూ.210 కోట్ల చొప్పున మొత్తం రూ.835 కోట్లు ఉంటుందని ముఖ్యమంత్రి వివరించారు. ఇతర రాష్ట్రాల్లో తగ్గిస్తున్నారు!దక్షిణాది రాష్ట్రాలన్నీ తమ ఉద్యోగుల జీతాలు, పెన్షన్లు, ఇతర నిర్వహణ ఖర్చులు తగ్గించుకుంటూ, వాటిని మూలధనంగా ఖర్చు చేస్తూ ఆదాయం స ంపాదిస్తున్నాయని సీఎం చంద్రబాబు తెలిపారు. కానీ, రాష్ట్రంలో పరిస్థితులు భిన్నంగా ఉనాయన్నారు. ఈ విషయం ప్రతి ఉద్యోగికీ, ప్రజలకు అర్థం కావాలన్నారు. "దాపరికం లేదు. ప్రజల పక్షాన ట్రస్టీగా పనిచేస్తున్నాం. ఎక్కడా ఎవరినీ కించపరచడం లేదు. 2024-25లో మనరాష్ట్రం సొంత ఆదా యంలో జీతాలు, పెన్షన్లు, ఇతర నిర్వహణ ఖర్చులు 93 శాతా నికి చేరా యి. 2025-26లో 93.5 శాతం ఉన్నాయి. 2024-2 5లో రూ.51,462 కోట్లు, 2025-26లో రూ.51,202 కోట్లు మానవ వనరుల(హెచ్ఆర్)కు ఖర్చు పెడుతున్నాం. కానీ, 2020-21లో తమిళనాడు 63 శాతం ఉన్న హెచ్ఆర్ ఖర్చును ఇప్పుడు 42 శాతానికి, కేరళ 106 శాతం నుంచి 68 శాతానికి, కర్ణాటక 49 శాతం నుంచి 38 శాతానికి, తెలంగాణ 58 శాతం నుంచి 38 శాతానికి తగ్గించుకున్నాయి. ఏపీలో మాత్రం పరిస్థితులు రివర్స్‌లో ఉన్నాయి. జీఎసడబ్ల్యూఎస్ వ్యవస్థ దేశంలో ఎక్కడా లేదు. ఆప్కాస్, ఆర్టీసీ అన్ని కలిపి రూ. 10,0 00 కోట్ల అదనపు ఖర్చు వచ్చి చేరింది. ఆ స్థాయిలో ఆదాయం మాత్రం పెరగలేదు. 94 కేంద్ర ప్రాయోజిత పథకాలకు వైసీపీ హయాంలో డబ్బులివ్వలేదు. మేం అధికారంలోకి వచ్చాక రూ.9,371 కోట్లు ఖర్చు చేసి వాటిని పునరుద్ధరించాం. జల్‌జీవన్ మిషన్‌పై కేంద్రం రూ.2 లక్షల కోట్లు ఖర్చు పెడితే రాష్ట్రంలో కేవలం రూ.2,000 కోట్లు కూడా జరగలేదు." అని సీఎం అన్నారు.

# అక్రమ బాణసంచా విక్రయాలపై డ్రోన్ నిఘా

**ఒంగోలు క్రైం,అక్టోబరు 18:** దీపావళి పండుగ అంటే బాణసంచా కాల్చడం పరిపాటి. బాణసంచా తయారీకి తమిళనాడు రాష్ట్రంలో శివకాశి పెట్టిందిపేరు. దీంతో రెండు తెలుగు రాష్ట్రాలు కూడా శివకాశి నుంచి బాణసంచా తీసుకొచ్చి విక్రయాలు చేస్తుంటారు. అందుకు సంబంధించి హెూల్‌సేల్ వ్యాపారులు అటు ప్రజల జేబులకు చిల్లు పెటడంతోపాటుగా, ప్రభుత్వ ఆదాయానికి భారీగా గండి కొడుతున్నారు. జిల్లాలో 14 మంది హెూల్‌సేల్ వ్యాపారులు ఉండగా ఒంగోలులో ఉన్న ఓ వ్యాపారి ఇతర రాష్ట్రాలకు కూడా బాణసంచా సరఫరా చేసి సొమ్ము చేసుకుంటారు. అయితే దీపావళి పండుగ ఒక్కరోజు అయినా జిల్లాలో సుమారుగా రూ. 20 కోట్లకు పైగా బాణసంచా విక్రయాలు జరిగే అవకాశం ఉంది. ఇలాంటి వ్యాపారం అక్రమాలకు అవధులు లేకుండా పోవడానికి కారణం అధికారులు పట్టించుకోకపోవడమే. బాణసంచా వ్యాపారం మొత్తం జీరోలోనే జరుగుతుంది. బాణసంచా వ్యాపారంలో 18 శాతం జీ ఎస్టీ చెల్లించాలి. జీఎస్టీ చెల్లించి శివాకాశి నుంచి వచ్చే బాణసంచా తక్కువగా ఉంటుంది. అదే క్రమంలో శివకాశి నుంచి తెచ్చిన బాణసంచా మొత్తం బిల్లులు లేకుండా వ్యాపారం చేస్తారు. అంటే అక్కడ ఎంతకు కొనుగోలు చేసింది, ఎంత మొత్తం బిల్లులపై తెచ్చారు అనేది ప్రశ్నార్థకం. ఇలాంటి వ్యాపారంపై అధికారుల నిఘా కొరవడడంతో ఇష్టారాజ్యంగా విక్రయాలు చేస్తూ, హెూల్‌సేల్ వ్యాపారులే అధికధరలకు విక్రయిస్తున్నారు. సంబంధిత అధికారులు పట్టించుకోకుండా కేవలం బాణసంచా మత్తులో ఉండటంతో వ్యాపారులు చెలరేగుతున్నారు. బాణసంచా ధరలు గత ఏడాది కంటే ఈ ఏడాది మండిపోతున్నాయి. సామాన్యులు టపాసుల ధరలు చూసిముక్కున వేలు వేసుకుంటున్నారు. ఐదు నుంచి ఆరువేల రూపాయలకు కొనుగోలు చేసినా చేతి సంచిలోకి రావడంలేదని పలువురు వాఖ్యానిస్తున్నారు. చిచ్చుబుడ్డి పట్టుకుంటే కాల్చకుండానే మంటలు వస్తున్నాయి. లక్ష్మీబాంబులు మోతమోగుతున్నాయి.. ఇలా ధరలు ఎగిసిపడుతున్నాయి. దీంతో టపాసులు కొనుగోలు చేయడం అంతంతమాత్రంగా ఉంది.



# జనార్దనరావు జోగిబలమైన మద్యం బంధం

**విజయవాడ :** నకిలీ మద్యం కేసులో ప్రధాన నిందితుడు అద్దేపల్లి జనార్దనరావు, వైసీపీ మాజీ మంత్రి జోగి రమేశ్ మధ్య బలమైన బంధమే ఉంది..! ఈ కేసుతో తనకు ఎలాంటి సంబంధం లేదని, సీఎం చంద్రబాబు కావాలని తనను ఇరికిస్తున్నారని జోగి రమేశ్ చెబుతున్నా.. మరోవైపు జనార్దనరావుతో ఆయనకు సన్నిహిత సంబంధాలున్నట్టుగా ఆధారాలు రోజుకొకటి బయటకు వస్తూనే ఉన్నాయి. ఓ కార్యక్రమంలో జోగి రమేశ్, జనార్దనరావు పక్కపక్కనే దర్జాగా కూర్చుని ఉన్న ఫొటోలు తాజాగా సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతున్నాయి. 'జనార్దనరావు, నేను ఒకే వీధిలో ఉండటం వల్ల పరిచయాలు ఉన్నాయి. వాటిని ఉపయోగించుకుని నకిలీ మద్యం కేసులో నన్ను చేరుస్తున్నారు' అని కొద్ది రోజుల కిందట జోగి రమేశ్ పలు సందర్భాల్లో చెప్పారు. జనార్దనరావు వీడియో విడుదల చేసిన తర్వాత ఆయనలో కలవరం మొదలైంది. తనకేం సంబంధం లేదన్నట్టు జగన్ మీడియా ముందు హడావుడి చేశారు. అయితే జోగి రమేశ్ ఆధ్వర్యంలోనే నకిలీ మద్యం తయారు చేసినట్టు వీడియో ద్వారా అద్దేపల్లి జనార్దనరావు వెల్లడించాడు. ఆ తర్వాత జోగి రమేశ్‌తో వాట్సాప్ ద్వారా జనార్దనరావు చేసిన చాటింగ్ వివరాలు



బయటపడ్డాయి. ఇప్పుడు జోగి రమేశ్ పక్కనే జనార్దనరావు కూర్చుని ఉన్న ఫొటోలు బయటకొచ్చాయి. ఈ కేసు నుంచి తప్పించుకోవడానికి జోగి నానా తంటాలు పడుతుంటే.. జనార్దన రావుతో ఉన్న నాటి బంధాలు ఒక్కొక్కటిగా బయటప డుతున్నాయి. నకిలీ మద్యం కేసులో ఇప్పటికే సుమారుగా 12 మందిని అరెస్ట్ చేశారు. వారంతా వివిధ జైళ్లలో రిమాండ్ ఖైదీలుగా ఉన్నారు. ముఖ్యంగా అద్దేపల్లి జనార్దనరావు, జగన్‌మో హనరావును విచారించడానికి 10 రోజుల పాటు కస్టడీకి ఇవ్వాలని ఎక్సైజ్ పోలీసులు కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై ఈ నెల 22న తీర్పు రాబోతుంది. తనను జోగి రమేశ్ మోసం చేశారని ఇప్పటికే జనార్దనరావు వీడియోలో స్పష్టం చేశారు. పోలీసు విచారణలో జోగి రమేశ్‌కు సంబంధించి జనార్ద నరావు చాలా తక్కువ విషయాలను వెల్లడించినట్టు విశ్వసనీయంగా తెలిసింది. మిగిలిన విషయాలను కస్టడీలో రాబట్టడానికి ఎక్సైజ్ పోలీసులు రంగం సిద్ధం చేశారు. ఈ దశలోనే నకిలీ మద్యం తయారీపై ప్రభుత్వం ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని ఏర్పాటు చేసింది. ఇప్పటికే ఈ కేసులో జోగి రమేశ్ చుట్టూ ఉచ్చు బిగుస్తోంది. జనార్దనరావు త్వరలో వెల్లడించే వివరాలతో మరింత ఉచ్చు బిగిసే అవకాశాలు కనిపిస్తున్నాయి. వీడియో సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయిన తర్వాత జోగి రమేశ్ రెండుమూడు రోజులు మాత్రమే జనబాహుళ్యంలో కనిపించారు. ఆ తర్వాత ఆయన ఎక్కడా మీడియా ముందుకు కాని, కార్యకర్తల ముందుకు కాని రాలేదు. జోగి అజ్ఞాతంలో ఉన్నట్టు ప్రచారం జరుగుతోంది. జనార్దనరావుతో జోగికి ఉన్న బంధాలకు బయటపడుతున్న ఆధారాలు ఆయనలో రేకెత్తిస్తున్నాయి.

# దీపాలు, కొవ్వొత్తులకు ఖర్చు దండుగ అఖిలేష్ వివాదాస్పద వ్యాఖ్యలు




**లక్నో:** యావద్దేశం దీపావళి పండుగను సంబరంగా జరుపుకొనేందుకు సిద్ధమవుతున్న వేళ సమాజ్‌వాదీ పార్టీ నేత, ఉత్తర ప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి అఖిలేష్ యాదవ్ వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. దీపోత్సవ్ సెలబ్రేషన్స్ కోసం యోగి ఆదిత్య నాథ్ ప్రభుత్వం చేస్తున్న ఖర్చును నిలదీశారు. దీపావళి పండుగను క్రిస్మస్ పండుగతో పోల్చి వాళ్ల నుంచి నేర్చుకోవాలని సలహా కూడా ఇచ్చారు.లక్నోలో జరిగిన మీడియా సమావేశంలో అఖిలేష్ మాట్లాడుతూ, క్రిస్మమ్ పండుగను ప్రపంచవ్యాప్తంగా నగరాల్లో ఎలా జరుపుకుంటారో చూసి ఇండియా నేర్చుకావాలన్నారు. 'రాముడి పేరు మీద మీకు ఒక సలహా ఇవ్వాలనుకుంటున్నాను. క్రిస్మస్ పండుగకు ప్రపంచంలోని నగరాలన్నీ ప్రకాశవంతంగా ఉంటాయి. ఆ లైట్లు నెలల తరబడి ఉంటాయి. మనం కొవ్వొత్తులు, దీపాలపై వృథా ఖర్చు చేయడం ఎందుకు? ఈ ప్రభుత్వం నుంచి మనం ఏమి ఆశించగలం? ఈ ప్రభుత్వాన్ని తొలగించాలి. మరిన్ని అందమైన లైట్లు ఉండేలా చూసుకుంటాం' అని అన్నారు.అయోధ్య వెలిగిపోతుండటం చూడలేకే.దీపాలకు పెట్టే ఖర్చు వృథా అని, క్రిస్మస్‌ను చూసి నేర్చుకావాలని అఖిలేష్ చేసిన వ్యాఖ్యలపై బీజేపీ విరుచుకుపడింది. సమాజ్‌వాదీ పార్టీ పాలనలో అయోధ్య చీకట్లలో మగ్గేదని, అయోధ్యలో రామభక్తులపై ఎస్పీ ప్రభుత్వం కాల్పులు కూడా జరిపిందని ఆ పార్టీ ప్రతినిధి షెహబాజ్ పూనావాలా ఎద్దేవా చేశారు. అయోధ్య వెలిగిపోతుంటే అఖిలేష్ యాదవ్‌కు కడుపు మండిపోతుంటుందని, ఇదే వ్యక్తులు సైఫైలో గానాబజానాలు నిర్వహిస్తుంటారని, అదే అయోధ్యలో దీపావళి జరుపుకుంటే ఆయనకు సమస్య వచ్చి పడుతుందని అన్నారు. అయోధ్యకు రాముడు తిరిగి వచ్చినప్పుడు విజయానికి చిహ్నంగా దీపాలు వెలిగిస్తుంటారని, చీకటిని పారద్రోలే రోజుగా లక్షలాది మంది రామభక్తుల విశ్వాసానికి దీపావళి ప్రతీక అని బీజేపీ నేత గౌరవ్ భాటియా అన్నారు. మండిపడిన వీహెచ్‌పీవిదేశీ సంస్కృతిని అఖిలేష్ ప్రోత్సహిస్తున్నారంటూ విశ్వహిందూ పరిషత్ మండిపడింది. హిందువుల కంటే క్రైస్తవులనే ఆయన ఎక్కువగా ఇష్టపడుతున్నా రని, జీహాదీలు, మతమార్పిడి ముఠాలకు ఆయన దూత అని వీహెచ్‌పీ ప్రతినిధి వినోద్ బన్సాల్ ఆక్షేపించారు. దీపావళి రోజున క్రిస్మస్ లెక్చర్లు ఇవ్వడం ఏమిటి? క్రిస్మస్ మరో రెండు నెలల్లో వస్తుంది. అసలు ఇప్పుడు ఏ పండుగ జరుగుతోందో కూడా ఆయనకు తెలిసినట్టు లేదు. సనాతన వ్యతిరేక భావజా లాన్ని ఆయన ఎప్పుడు వదిలించుకుంటారు? అని ప్రశ్నించారు.

# కుర్తా చించుకుని రోడ్డు పై పడి ఏడ్చిన ఆర్జేడీ నేత



**పాట్నా:** బిహార్ అసెంబ్లీ ఎన్నికలవేళ విపక్ష మహాకూటమి టిక్కెట్ల పంపకాల పంచాయతీ ఇంకా కొలిక్కి రాకుండానే అభ్యర్థుల జాబితాలు వెలువడుతుండటం గందరగోళం సృష్టిస్తోంది. దీంతో టిక్కెట్లు దక్కని నేతలు ఘొల్లుమంటున్నారు. తాజాగా పాట్నాలోని లాలూ ప్రసాద్ యాదవ్ నివాసం వద్ద హైడ్రామా చోటుచేసుకుంది. మధుబన్ అసెంబ్లీ నుంచి టిక్కెట్ ఆశించిన ఆర్జేడీ నేత మదన్ షా తనకు టిక్కెట్ దక్కకపోవడంతో లాలూ నివాసం బయట కుర్తా చింపుకుని, నేలపై పడుకుని గుక్కపెట్టి ఏడుపు అందుకున్నాడు. ఇందుకు సంబంధించిన వీడియో ఇప్పుడు వైరల్ అవుతోంది.టిక్కెట్లు అమ్ముకున్నారుతాను ముడుపులు ఇవ్వకపోవడం వల్లే టిక్కెట్ నిరాకరించినట్టు షా ఆవేదన వ్యక్తం చేశారు. డబ్బులకు టిక్కెట్ల ఇచ్చే బ్రోకర్‌గా రాజ్యసభ ఎంపీ సంజయ్ యాదవ్ వ్యవహరించారంటూ ఆరోపించారు. తనకు బదులు బీజేపీ ఏజెంట్ డాక్టర్ సంతోష్ కుష్వాహకు టిక్కెట్ ఇచ్చారని, పార్టీనే నమ్ముకుని పనిచేసిన వారికి డబ్బుల్లేవనే కారణంగా టిక్కెట్లు నిరాకరిస్తున్నారని తెలిపారు.లాలూతో ఎంతోకాలంగా పనిచేశానని, ఆయన తన గురువు అని షా చెప్పారు. మధుబని నుంచి తనకు గెలుపు తథ్యమని కమ్యూనిటీ సర్వేలో తేలడంతో తనకు టిక్కెట్ ఇస్తానని లాలూ ప్రసాద్ హామీ ఇచ్చారని తెలిపారు. 1990 నుంచి పార్టీలో పనిచేస్తున్నానని, తన రాజకీయ కెరీర్ కోసం భూమిని కూడా అమ్ముకున్నానని ఆయన వాపోయారు. తేజస్వి అహంభావి అని, ఆయన ప్రజలను కలవరని విమర్శించారు. 'టిక్కెట్లన్నీ ఇచ్చేశారు. ఇదంతా సంజయ్ యాదవ్ చేశారు. నేను చనిపోయేందుకు ఇక్కడకు వచ్చారు. లాలూ యాదవ్ నా గురువు. టిక్కెట్ ఇస్తామని చెప్పారు. కానీ బీజేపీ ఏజెంట్ సంతోష్ కుష్వాహకు ఇచ్చేశారు' అని భోరున విలపించారు. లాలూ ఇంటిముందు గందరగోళం తలెత్తడంతో సెక్యూరిటీ సిబ్బంది షాను అక్కడి నుంచి తరలించారు. అయితే లూలా యాదవ్ కారును ఆయన వెంబడించడం మరో వీడియోలో కనిపించింది.

# దీపావళి వేళ ఢిల్లీలో ప్రమాదకర స్థాయిలో వాయు కాలుష్యం



**ఢిల్లీ అక్టోబర్ 19:** దీపావళి వేళ.. ఢిల్లీ లో వాయు కాలుష్యం ప్రమాదకర స్థాయిలో పెరిగిపోతుంది. హస్తినలో ఎయిర్ క్వాలిటీ పడిపోతుంది. దేశ రాజధానిలో రోజురోజుకూ పెరుగుతున్న కాలుష్యంతో వాయు నాణ్యత భారీగా పడిపోయింది. దీంతో కేంద్ర కాలుష్య నియంత్రణ బోర్డు ఆందోళన వ్యక్తం చేసింది. వికాస్‌పురి ప్రాంతంలో ఎయిర్ క్వాలిటీ 238, అక్షర్‌ధామ్ ప్రాంతంలో 426గా నమోదు అయింది. దీంతో రాజధాని ప్రజలు ఇళ్లు వదిలి బయటకు రావట్లేదు. ఈ సీజన్‌లో నగరంలో ఇదే అత్యధిక కాలుష్య స్థాయి అని సీపీసీబీ వెల్లడించింది.
వాయు కాలుష్యాన్ని అరికట్టేందుకు ఇండియా గేట్ వద్ద వాటర్ స్ప్రింక్లర్లను మోహరించినట్లు కాలుష్య నియంత్రణ బోర్డు అధికారులు తెలిపారు. ఈ ప్రాంతంలో ఆదివారం ఉదయం వాయు నాణ్యత 269గా నమోదైనట్లు వివరించారు. హస్తినలోని 38 వాయు పర్యవేక్షణ కేంద్రాలలో 9 ఇప్పటికే అత్యంత పేలవమైన కేటగిరిలోకివచ్చాయని పేర్కొన్నారు. ఆనంద్ విహార్‌లో 389, వజీర్‌పూర్ 351, జహంగీర్‌పురి 310, ద్వారక 310 ఏక్యూఐలతో అత్యంత ప్రభావిత రీజియన్ లుగా ఉన్నాయని చెప్పారు.సిటీలో వాహన ఉద్గారాలు పెరగడంతో పటు చలికాలం కూడా తొడవగా కాలుష్యం పెరుగుదల తీవ్రమైనట్లు అధికారులు పేర్కొన్నారు. నగరంలోని పలు ప్రాంతాల్లో కాలుష్య స్థాయిలు తీవ్రమైన జోన్‌లోకి ప్రవేశిస్తున్నందున నియంత్రణ చర్యలను వేగవంతం చేస్తున్నామని వివరించారు. దీపావళి నేపథ్యంలో పెద్ద మొత్తంలో టపాసులు కాల్చడం, వ్యర్థాల దహనం వల్ల ఢిల్లీలో వాయు నాణ్యత మరింత క్షీణించే ఛాన్స్ ఉందని ఎయిర్ క్వాలిటీ ముందస్తు హెచ్చరిక వ్యవస్థ అంచనా వేసింది.

# లేఖ విడుదల చేసిన మావోయిస్టు కేంద్ర కమిటీ



**ఢిల్లీ అక్టోబర్ 19:** మావోయిస్టుల లొంగుబాట్లపై మావోయిస్టు కేంద్రకమిటీ స్పందించింది. మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటీ అధికార ప్రతినిధి అభయ్ పేరుతో లేఖ విడుదల చేసింది. శత్రువుకు లొంగిపోయిన వారు విప్లవ ప్రతిఘాత కులు, విచ్ఛిత్తి ద్రోహులు అని లేఖలో పేర్కొంది. సోనూ అలియాస్ మల్లోజుల వేణుగోపాల్ రావు, సతీష్ ను విప్లవ ప్రజలు తగిన విధంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.సోనూ, సతీష్ ముఠాను పార్టీ నుంచి బహిష్కరిస్తున్నట్లు పేర్కొన్నారు. 2024 నుంచి విప్లవానికి ప్రతిఘాతుకంగా ఆపరేషన్ కగార్ మొదలైందని తెలిపారు. లొంగిపోయిన వారు సుఖానికి, స్వార్థానికి అలవాటు పడ్డారని ఘాటు వ్యాఖ్యలు చేశారు. కాగా, మావోయిస్టుల ఏరివేతే లక్ష్యంగా కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఆపరేషన్ కగార్ చేపట్టగా.. పలువులు మావోయిస్టులు జనజీవన స్రవంతిలో వరుసగా కలిసిపోతున్నారు. మరోవైపు మావోయిస్టులను హతమార్చేందుకు ఆపరేషన్ కగార్ నిర్విరామంగా కొనసాగుతోంది.

# ప్రశాంత్ కిశోర్ బిగ్ స్కెచ్- బిహార్ ఎన్నికల బరిలోకి ట్రాన్స్‌జెండర్- ఈ వ్యూహం ఫలించేనా



**బిహార్:** బిహార్‌లోని ఆ అసెంబ్లీ స్థానం వైపే ఇప్పుడు అందరి చూపు ఉంది. రాజకీయ వ్యూహ రచనలో దేశంలోనే ఖ్యాతిని గడించిన ప్రశాంత్ కిశోర్ అక్కడి నుంచి రాష్ట్ర మంత్రిపై పోటీకి నిలిపిన ఓ అభ్యర్థి గురించి అంతటా చర్చ జరుగుతోంది. స్త్రీకి, పురుషుడికి కాకుండా ఓ ట్రాన్స్‌జెండర్‌కు భోరే అసెంబ్లీ స్థానాన్ని పీకే కేటాయించారు. గత ఎన్నికల్లో కేవలం 462 ఓట్ల తేడాతో జేడీయూ నేత సునీల్ కుమార్ ఈ నియోజకవర్గంలో గెలిచారు. ఇక్కడి నుంచి ట్రాన్స్‌జెండర్ ప్రీతి కిన్నర్‌ను 'జన్ సురాజ్' పార్టీ ఎందుకు పోటీ చేయిస్తోంది ? దీని వెనుక పీకే వ్యూహం ఏమిటి ? ఈ కథనంలో తెలుసుకుందాం.భోరే అసెంబ్లీ స్థానంలో లెక్కలే వేరప్పుబిహార్‌లోని గోపాల్‌గంజ్ జిల్లాలో భోరే అసెంబ్లీ స్థానం ఉంది. ఇక్కడి నుంచి ప్రస్తుతం జేడీయూ నేత సునీల్ కుమార్ ఎమ్మెల్యేగా ఉన్నారు. బిహార్ విద్యాశాఖ మంత్రి ఈయనే. గత మూడు అసెంబ్లీ ఎన్నికల్లో భోరే స్థానంలో వచ్చిన ఫలితాలను పరిశీలిస్తే, 2010లో ఇక్కడి నుంచి బీజేపీ నేత ఇంద్రదేవ్ మాఝీ గెలిచారు. 2015లో కాంగ్రెస్‌కు చెందిన అనిల్ కుమార్ నెగ్గారు. 2020లో జేడీయూ నేత సునీల్ కుమార్‌ను విజయం వరించింది. ఆయనకు అతి కష్టం మీద ఈ గెలుపు లభించింది. సీపీఐ (ఎంఎల్) లిబరేషన్ పార్టీ అభ్యర్థి నుంచి టఫ్ ఫైట్ ఎదురుకావడంతో కేవలం 462 ఓట్ల తేడాతో సునీల్ కుమార్ గెలిచారు. స్థూలంగా పరిశీలిస్తే, భోరే అసెంబ్లీ స్థానం పరిధిలో బీజేపీ, జేడీయూలు బలంగా ఉన్నాయి.ట్రాన్స్‌జెండర్ ప్రీతికి పీకే ఆఫర్‌భోరే అసెంబ్లీ స్థానానికి అభ్యర్థి ఎంపికపై 'జన్ సురాజ్' పార్టీ అధినేత, ప్రముఖ రాజకీయ వ్యూహకర్త ప్రశాంత్ కిశోర్ సంచలన నిర్ణయం తీసుకున్నారు. భోరే అసెంబ్లీ స్థానం నుంచి స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేయాలని భావించిన సామాజిక కార్యకర్త, ట్రాన్స్‌జెండర్ ప్రీతి కిన్నర్‌ను ఆయన పిలిచి మరీ పెద్ద ఆఫర్ ఇచ్చారు. 'జన్ సురాజ్' పార్టీ తరఫున పోటీ చేయాలని కోరారు. అందుకు వెంటనే ప్రీతి కిన్నర్ ఓకే చెప్పారు.షబ్నం బానూలా గెలిచేనాషబ్నం బానూ మన దేశంలోని ఏకైక ట్రాన్స్‌జెండర్ ఎమ్మెల్యే. 1998లో మధ్యప్రదేశ్ రాష్ట్రంలోని సొహాగ్‌పూర్ అసెంబ్లీ స్థానం నుంచి షబ్నం బానూ చారిత్రక విజయం సాధించారు. ఒకవేళ ప్రీతి కిన్నర్ కూడా ఎన్నికల్లో గెలిస్తే, దేశంలో రెండో ట్రాన్స్‌జెండర్ ఎమ్మెల్యేగా రికార్డును సొంతం చేసుకుంటారు.ప్రీతి కిన్నర్ ఎవరు ప్రజలకు ఏం చేశారుప్రీతి కిన్నర్ గత రెండు దశాబ్దాలుగా భోరే అసెంబ్లీ స్థానం పరిధిలో సామాజిక సేవ చేస్తున్నారు. సొంతఖర్చుతో ఏటా ఎంతోమంది పేద యువతులకు పెళ్లిళ్లు చేయిస్తున్నారు. బాధలు, విపత్తుల సమయాల్లో ప్రజలకు సాయం చేస్తున్నారు. నియోజకవర్గంలో ట్రాన్స్‌జెండర్ ఓటర్ల సంఖ్య తక్కువే ఉన్నప్పటికీ, ప్రీతికి వారి మద్దతు బలంగా ఉంది. ప్రత్యేకించి గత ఐదేళ్లుగా ప్రజల మధ్యే ప్రీతి ఉంటున్నారు. అందుకే ఈసారి ఎన్నికల్లో స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేయాలని నిర్ణయించుకున్నారు. అనూహ్యంగా ఆమెకు జన్ సురాజ్ పార్టీ టికెట్‌ను ప్రశాంత్ కిశోర్ కేటాయించారు.ప్రీతి పోటీతో ఎవరికి లాభం ఎవరికి నష్టంభోరే అసెంబ్లీ స్థానంలో 'జన్ సురాజ్' పార్టీ నుంచి ట్రాన్స్‌జెండర్ ప్రీతి కిన్నర్ పోటీ చేస్తుండటం ఏ పార్టీకి నష్టం చేకూరుస్తుంది ఏ పార్టీకి లాభం చేకూరుస్తుంది అనే దానిపై ఇప్పుడు హాట్ డిబేట్ నడుస్తోంది. జేడీయూ నుంచి సిట్టింగ్ ఎమ్మెల్యే, రాష్ట్ర మంత్రి సునీల్ కుమార్ బరిలో ఉన్నారు. ఈయనకే బీజేపీ మద్దతు కూడా ఉంది. ఎన్‌డీఏ కూటమిలోని బీజేపీ, జేడీయూ పార్టీలు ఐక్యంగా ఉన్నందు వల్ల సునీల్‌కు గెలుపు అవకాశాలు ఎక్కువే ఉంటాయి. అయితే 2020 అసెంబ్లీ ఎన్నికల్లో సునీల్ కుమార్ కేవలం 462 ఓట్ల తేడాతో గెలిచారన్న విషయాన్ని మనం మర్చిపోకూడదు. ఆయనకు అంతగా టఫ్ ఫైట్ ఇచ్చిన సీపీఐ (ఎంఎల్) లిబరేషన్ పార్టీని కూడా మనం మర్చిపోకూడదు. ఈసారి ఆ పార్టీ టికెట్‌పై జవహర్‌లాల్ నెహ్రూ యూనివర్సిటీ స్టూడెంట్స్ యూనియన్ మాజీ ప్రెసిడెంట్ ధనంజయ్ పోటీ చేస్తున్నారు. ఆయనకు కాంగ్రెస్, జేడీయూల మద్దతు ఉంటుంది. అంటే ఎన్‌డీఏ, ఇండియా కూటముల మధ్య మరోసారి హెూరాహెూరీ పోరు జరగబోతోంది. ఈ పోరు నడుమ ట్రాన్స్‌జెండర్ ప్రీతి కిన్నర్‌కు పడే ప్రతీ ఓటు కీలకంగా మారనుందని రాజకీయ పండితులు అంచనా వేస్తున్నారు. ఆమె సాధించే ఓట్లే భోరే స్థానంలో ఎన్నికల ఫలితాన్ని దిశానిర్దేశం చేస్తాయని, విజేతను నిర్ణయిస్తాయని అంటున్నారు. ఇవన్నీ తెలిసే ప్రీతి కిన్నర్‌ను పీకే బరిలోకి దింపారని చెబుతున్నారు.

# కరూర్ మృతుల కుటుంబాలకు 20 లక్షలు




**చెన్నై, అక్టోబరు 18 :** కరూర్ తొక్కిసలాటలో మృతిచెందిన వారి కుటుంబాలకు తమిళగ వెట్రి కళగం (టీవీకే) పార్టీ రూ.20 లక్షల చొప్పున అందజేసింది. కరూర్ వేలుచామిపురంలో గత నెల 27న టీవీకే అధ్యక్షుడు, నటుడు విజయ్ ప్రచార సభలో తొక్కిసలాట జరిగి 41 మంది మృతిచెందగా, 100 మందికి పైగా గాయపడిన విషయం తెలిసిందే. గాయపడిన వారు ఆసుపత్రుల్లో చికిత్సలు పొంది డిశ్చార్జి అయ్యారు. బాధిత కుటుంబాలను ఆదుకుంటామని, రూ.20లక్షల చొప్పున సాయం అందిస్తామని టీవీకే అధ్యక్షుడు విజయ్ ఇంతకుముందే ప్రకటించారు.

# మహాగర్ బంధన్‌తో పొత్తు లేదు




బిహార్: అసెంబ్లీ ఎన్నికల్లో మహాగర్‌బంధన్ సీట్ల సర్దుబాటు ఇంకా కొలిక్కి రాలేదు. ఈ క్రమంలో తమ పార్టీ ఒంటరిగానే పోటీ చేస్తున్నట్లు ఝార్ఖండ్ ముక్తి మోర్చా (జేఎంఎం) ప్రకటించింది. ఎన్‌డీఏ, మహాగర్‌బంధన్ కూటమిల్లో చాలా వైరుధ్యాలు ఉన్నాయని జేఎంఎం జనరల్ సెక్రటరీ సుప్రియో భట్టాచార్య తెలిపారు. రాష్ట్రంలో కాంగ్రెస్, ఆర్‌జేడీ కూటమితో పొత్తుపై సమీక్షిస్తామని శనివారం విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ పేర్కొన్నారు."ఎన్‌డీఏ, మహాగర్‌బంధన్‌లో వైరుధ్యాలు ఉన్నాయి. చాలా స్థానాల్లో అంతర్గత పోరు ఉంది. రాష్ట్రంలో కూడా కూటమిని సమీక్షిస్తాం. ఎందుకంటే ప్రతిసారీ ద్రోహం జరుగుతుంది. వారు జేఎంఎం కార్యకర్తలను మోసం చేశాం. మేం ఎన్నికల్లో గెలిచి, జేఎంఎం అనుమతి లేకుండి బిహార్?లో తదుపరి ప్రభుత్వం ఏర్పడకుండా చూస్తాం. 2019, 2024 ఝార?ండ్ ఎన్నికల సమయంలో కాంగ్రెస్, ఆర్?జేడీలకు మద్దతు ఇచ్చాం. అయినప్పటికీ ఆ పార్టీల నుంచి సరైన స్పందన రాలేదు. మిత్రపక్షం ఏమీ లేదు, శత్రువు శత్రువే. బిహార్‌లో స్వతంత్రంగా పోటీ చేయాలని పార్టీ నిర్ణయించింది. బిహార్‌లో ఆరు స్థానాల్లో తమ పార్టీ తరఫున అభ్యర్థులను నిలబెడుతున్నాం. పోటీ చేసే స్థానాల సంఖ్య 10కి పెరగవచ్చు" అని సుప్రియో భట్టాచార్య వెల్లడించారు. ఇండియా కూటమిలో భాగస్వామిగా ఉంది జేఎంఎం. బిహార్‌లో 12 స్థానాలు ఇవ్వాలని డిమాండ్ చేసింది. అయినప్పటికీ సీట్ల సర్దుబాటు అంశం తేలకపోవడం వల్ల ఈ ఎన్నికల్లో ఒంటరిగా పోటీ చేసేందుకు సిద్ధమైంది.బిహార్?లో పాగా వేయాలని కసితో ఉంది 'మహాగర్??బంధన్'. బిహార్ అసెంబ్లీ ఎన్నికలకు సంబంధించి మిత్రపక్షాలతో సీట్ల సర్దుబాటు ఇంకా పూర్తికాలేదు. గురువారం రాత్రి పొద్దుపోయాక 48 మంది అభ్యర్థుల జాబితాను కాంగ్రెస్ విడుదల చేసింది. అయితే కూటమి ఉమ్మడి అభ్యర్థుల జాబితా మాత్రం ఇంకా పూర్తి కాలేదు. ఈ క్రమంలో జెఎంఎం ఒంటరిగా పోటీ చేస్తున్నట్లు ప్రకటించింది. మరోవైపు ఎన్?డీఏ కూటమిలో ప్రధాన భాగస్వామ్యపక్షాలైన బీజేపీ, జేడీ(యూ) చెరో 101 స్థానాల్లో పోటీ చేయనున్నాయి. ఎల్‌జేపీకి 29, హిందుస్థానీ అవామ్ మోర్చా (హెచ్?ఏఎం), రాష్ట్రీయ లోక్ మోర్చా (ఆర్‌ఎల్‌ఎం)లకు చెరో 6 సీట్లను ఇచ్చారు. జేడీయూ ప్రకటించిన 101 స్థానాల్లో ఓబీసీలు, ఆర్థికంగా వెనుకబడినవారికి 59 సీట్లు కేటాయించింది. మంత్రుల్లో దాదాపు అందరికీ టికెట్లు లభించాయి. ఓడిపోయిన ముగ్గురు ఎంపీలకూ టికెట్లు ఇచ్చారు. మహిళలకు 13 చోట్లే అవకాశం లభించింది.బిహార్?లో పాగా వేయాలని కసితో ఉంది 'మహాగర్??బంధన్'. బిహార్ అసెంబ్లీ ఎన్నికలకు సంబంధించి మిత్రపక్షాలతో సీట్ల సర్దుబాటు ఇంకా పూర్తికాలేదు. గురువారం రాత్రి పొద్దుపోయాక 48 మంది అభ్యర్థుల జాబితాను కాంగ్రెస్ విడుదల చేసింది. అయితే కూటమి ఉమ్మడి అభ్యర్థుల జాబితా మాత్రం ఇంకా పూర్తి కాలేదు. ఈ క్రమంలో జెఎంఎం ఒంటరిగా పోటీ చేస్తున్నట్లు ప్రకటించింది. మరోవైపు ఎన్?డీఏ కూటమిలో ప్రధాన భాగస్వామ్యపక్షాలైన బీజేపీ, జేడీ(యూ) చెరో 101 స్థానాల్లో పోటీ చేయనున్నాయి. ఎల్‌జేపీకి 29, హిందుస్థానీ అవామ్ మోర్చా (హెచ్?ఏఎం), రాష్ట్రీయ లోక్ మోర్చా (ఆర్‌ఎల్‌ఎం)లకు చెరో 6 సీట్లను ఇచ్చారు. జేడీయూ ప్రకటించిన 101 స్థానాల్లో ఓబీసీలు, ఆర్థికంగా వెనుకబడినవారికి 59 సీట్లు కేటాయించింది. మంత్రుల్లో దాదాపు అందరికీ టికెట్లు లభించాయి. ఓడిపోయిన ముగ్గురు ఎంపీలకూ టికెట్లు ఇచ్చారు. మహిళలకు 13 చోట్లే అవకాశం లభించింది.

# రష్యాలోని గ్యాస్ ప్లాంట్‌పై డ్రోన్‌లతో విరుచుకుపడ్డ ఉక్రెయిన్



**రష్యా :**రష్యా ఉక్రెయిన్ దేశాల మధ్య సుదీర్ఘకాలంగా వార్ కొనసాగుతూనే ఉంది. ఓరెన్‌బర్గ్ పాంతంలోని అతిపెద్ద గ్యాస్ ప్రాసెసింగ్ ప్లాంట్ ను లక్ష్యంగా చేసుకుని ఉక్రెయిన్ డ్రోన్‌లు విరుచుకుపడ్డాయి. కీవ్‌కు తూర్పు వైపు 1,700 కిలోమీటర్ల దూరం చొచ్చుకొచ్చి మరీ ఉక్రెయిన్ ఈ దాడి చేసింది. ఉక్రెయిన్ దీర్ఘశ్రేణి దాడుల శక్తికి ఈ దాడి ఉదాహరణగా నిలిచింది.ఉక్రెయిన్ డ్రోన్ దాడి కారణంగా గ్యాస్ ప్లాంట్లోని ఓ యూనిట్‌లో మంటలు చెలరేగాయి. ఆ తర్వాత మంటలను అదుపులోకి తెచ్చారు. ఈ ఘటనలో ఎవరూ గాయపడలేదని తెలిపారు. దాడి జరిగిన ప్రదేశం జనావాసాలకు అతిదగ్గరగా ఉందని చెప్పారు. రష్యాలోని సుదూర ప్రాంతాల్లో కూడా ఉక్రెయిన్ దళాలు డ్రోన్ దాడులు చేస్తున్నాయి. ఈ ఘటనలో ఎవరూ గాయపడలేదని తెలిపారు. దాడి జరిగిన ప్రదేశం జనావాసాలకు అతిదగ్గరగా ఉందని చెప్పారు. గత నెల దాదాపు 2,000 కిలోమీటర్ల లోపలకు చొచ్చుకెళ్లి దాడికి తెగబడ్డ ఘటనలున్నాయి.రష్యా ఎయిర్ డిఫెన్స్ వ్యవస్థలకు ఇది సవాలుగా మారింది. సైబీరియా, ఊరల్ పర్వతాల్లో చమురు క్షేత్రాలను ఉక్రెయిన్ డ్రోన్‌లు లక్ష్యంగా చేసుకొంటున్నాయి. తాజాగా సమర రీజయన్‌లో కూడా డ్రోన్ దాడి జరిగినట్లు తెలుస్తోంది. అయితే స్థానికులు మాత్రం చమురు రిఫైనరీని లక్ష్యంగా చేసుకొన్నట్లు చెబుతున్నారు.

# కిడ్నీలు ఆరోగ్యంగా ఉండాలంటే ఈ జాగ్రత్తలు తీసుకోండి!



మానవ శరీరంలో ముఖ్యమైన అవయవాలు మూత్రపిండాలు. మూత్రపిండాలు సక్రమంగా పనిచేస్తేనే మన శరీరంలోని మిగతా అంగాల పనితీరు కూడా బాగుంటుంది. ప్రస్తుతం భారత దేశంలో మూత్రపిండాల వ్యాధులతో బాధపడుతున్న వారి సంఖ్య రోజురోజుకు పెరుగుతుంది తొలిదశలో మూత్రపిండాల గురించి పట్టించుకోకపోవటం ఇందుకు ఒకకారణంగా చెప్పొచ్చు

**కిడ్నీలను కాపాడుకోవటానికి తీసుకోవాల్సిన జాగ్రత్తలు :** ప్రస్తుతం రకరకాల మూత్రపిండాల సమస్యలు ప్రజలను ఇబ్బంది పెడుతున్నాయి. అధిక రక్తపోటు, మధుమేహం, డెంగ్యూ, మలేరియా, హెచ్ఐవి పాజిటివ్, బ్యాక్టీరియల్ ఇన్ఫెక్షన్లు, మూత్రపిండాలలో రాళ్లు కొన్ని రకాల మందుల వల్ల కూడా కిడ్నీ సమస్యలు వస్తాయి .అయితే మనం మన కిడ్నీలను కాపాడుకోవాలంటే ఏం చేయాలి? అనేది ప్రతి ఒక్కరు కచ్చితంగా తెలుసుకోవాలి . కిడ్నీలను కాపాడుకోవడానికి తీసుకోవలసిన జాగ్రత్తలను ప్రస్తుతం మనం తెలుసుకుందాం.

**కిడ్నీల విషయంలో ఈ జాగ్రత్తలు అవసరం :** కిడ్నీలు ఆరోగ్యంగా ఉండాలంటే ఆహారంలో ఉప్పు తక్కువ తీసుకోవాలి. మాంసాహారాన్ని ఎక్కువ తీసుకోకూడదు. కిడ్నీల ఆరోగ్యం కోసం ప్రతి రోజు కనీసం ఒక 30 నిమిషాల పాటు అయినా వ్యాయామం చేయాలి. మనం తినే ఆహారంలో కచ్చితంగా ఫైబర్ కంటెంట్ ఉండేలా చూసుకోవాలి. ధూమపానం, మద్యపానం వంటి అలవాట్లు ఉంటే మానుకోవాలి. నొప్పుల కు సంబంధించి చీటికిమాటికి టాబ్లెట్లు, అనవసరమైన స్టెరాయిడ్లు వాడకుండా ఉండాలి.


**దీర్ఘకాలిక వ్యాధులు ఉన్నవారు నిర్లక్ష్యం చెయ్యొద్దు :** ఇక మధుమేహంతో బాధపడేవారు, హైబీపీతో బాధపడుతున్న వారు, తరచూ పరీక్షలు చేసుకుంటూ వైద్యుల సలహాల మేరకు మందులు వాడాలి. రక్తహీనతతో బాధపడుతున్న వారు నీరసం, ఒళ్ళు నొప్పులు, ఆయాసం వంటి సమస్యలతో ఇబ్బంది పడుతున్నవారు వైద్యుల సలహా మేరకు మూత్రపిండాల పనితీరును చెక్ చేయించుకుని అవసరమైతే మందులు వాడాలి.

# సినీ తారల్లా ఎల్లప్పుడూ యవ్వనంగా కనిపించాలా..? అయితే ఈ ఆహారాలను తీసుకోండి..!

మనం పుట్టినప్పటి నుంచి చనిపోయే వరకు మన చర్మం అనేక మార్పులకు లోనవుతుంది. వయస్సు మీద పడే కొద్దీ చర్మంలో ముడతలు పెరిగిపోతాయి. అయితే మనం తినే ఆహారం, ఒత్తిడి, కాలుష్యం, పలు ఇతర కారణాల వల్ల కూడా చర్మం త్వరగా ముడతలు పడుతుంది. మనం పుట్టినప్పటి నుంచి చనిపోయే వరకు మన చర్మం అనేక మార్పులకు లోనవుతుంది. వయస్సు మీద పడే కొద్దీ చర్మంలో ముడతలు పెరిగిపోతాయి. అయితే మనం తినే ఆహారం, ఒత్తిడి, కాలుష్యం, పలు ఇతర కారణాల వల్ల కూడా చర్మం త్వరగా ముడతలు పడుతుంది. కానీ సినిమా తారలు మాత్రం ఎప్పుడు చూసినా ఒకేలాంటి అందంతో కనిపిస్తారు. వారి వయస్సు అసలు పెరుగుతున్నట్లు కనిపించరు. ఇక హీరోలు అయితే 50 ఏళ్లు వచ్చినా కూడా యుహౌకులలాగే కనిపిస్తుంటారు. సినిమా తారలు పాటించే డైట్‌ను మనం పాటించకపోయినా మనం తీసుకునే ఆహారం విషయంలో మాత్రం కొన్ని మార్పులు చేసుకుంటే అచ్చం వారిలా ఎల్లప్పుడూ యంగ్‌గా కనిపించవచ్చు. మన చర్మం ఆరోగ్యంగా, యవ్వనంగా కనిపించాలంటే తీసుకోవాల్సిన ఆహారాలు ఏమిటో ఇప్పుడు తెలుసుకుందాం.

**పాలకూర..**

పాలకూరను తరచూ ఆహారంలో భాగం చేసుకోవడం వల్ల చర్మం ఎల్లప్పుడూ కాంతివంతంగా, యవ్వనంగా కనిపిస్తుంది. పాలకూరలో విటమిన్ ఎ, బీటా కెరోటిన్ సమృద్ధిగా ఉంటాయి. ఇవి వృద్ధాప్య ఛాయలను తగ్గేలా



చేస్తాయి. పాలకూర జ్యూస్‌ను రోజూ ఒక కప్పు మోతాదులో తాగుతుంటే ఫలితం ఉంటుంది. పాలకూరలో ఉండే విటమిన్ సి,యాంటీ ఆక్సిడెంట్లు చర్మాన్ని కాపాడుతాయి. చర్మం ఎల్లప్పుడూ మెరిసేలా చేస్తాయి. అలాగే చర్మ ఆరోగ్యాన్ని కాపాడడంలో సబ్జా గింజలు కూడా మేలు చేస్తాయి. ఈ గింజల్లో ఒమెగా 3 ఫ్యాటీ యాసిడ్లు ఉంటాయి. ఒక టీస్పూన్ సబ్జా గింజలను రోజూ నీటిలో నానబెట్టి తింటుండాలి. ఈ గింజల్లో ఉండే ఫ్యాటీ ఆమ్లాలు చర్మాన్ని సంరక్షిస్తాయి. చర్మంపై ఉండే ముడతలను తగ్గిస్తాయి. దీంతో చర్మం కాంతివంతంగా మారి మెరుస్తుంది. యవ్వనంగా కనిపిస్తారు.

**టమాటాలు..**

టమాటాలు కూడా మన చర్మాన్ని అందంగా కనిపించేలా చేస్తాయి. టమాటా సూప్‌ను తరచూ తాగాలి. లేదా టమాటా జ్యూస్‌ను రోజూ ఉదయం ఒక కప్పు మోతాదులో తాగాలి. టమాటాలను అడ్డంగా చక్రాల్లా కోసి ముఖంపై రుద్దవచ్చు. టమాటా గుజ్జుతో ఫేస్ ప్యాక్ తయారు చేసి ముఖానికి అప్లై చేయవచ్చు. ఇలా చేస్తుంటే చర్మంపై ఉండే ముడతలు పోయి చర్మం కాంతివంతంగా కనిపిస్తుంది. టమాటాల్లో లైకోపీన్ అనే యాంటీ ఆక్సిడెంట్ ఉంటుంది. ఇది చర్మానికి సహజసిద్ధమైన మెరుపును ఇస్తుంది. టమాటాలలో యాంటీ ఏజింగ్ లక్షణాలు ఉంటాయి. కనుక టమాటాలను ఎలా వాడినా సరే యవ్వనంగా కనిపిస్తారు. చర్మంపై ముడతలు అసలు కనిపించవు.

**బాదంపప్పు..**

చర్మ సౌందర్యానికి ఎంతో మేలు చేసే విటమిన్ ఇ బాదంపప్పులో సమృద్ధిగా ఉంటుంది. బాదం పప్పులను రోజూ గుప్పెడు తీసుకుని నీటిలో నానబెట్టి తింటుండాలి. లేదా బాదంనూనెను చర్మానికి రాయవచ్చు. బాదంపప్పులను పేస్ట్‌లా చేసి ఫేస్ ప్యాక్ ట్రై చేయవచ్చు. ఇలా బాదం పప్పులను వాడితే వాటిల్లో ఉండే విటమిన్ ఇ, యాంటీ ఆక్సిడెంట్లు చర్మాన్ని సంరక్షిస్తాయి. చర్మం సహజసిద్ధంగా నిగారిం పును సొంతం చేసుకుంటుంది. యవ్వనంగా కనిపిస్తారు. స్ట్రాబెర్రీలు, చెర్రీలు, బ్లూబెర్రీలు, రాస్ప్ బెర్రీల వంటి బెర్రీ పండ్లను ఆహారంలో భాగం చేసుకోవాలి. వీటిల్లో యాంటీ ఆక్సిడెంట్లు అధికంగా ఉంటాయి. ఇవి కణాలు ఆక్సిజన్‌ను ఉపయోగించుకునేలా చేస్తాయి. దీంతో కణాలకు ఫ్రీ ర్యాడికల్స్ వల్ల జరిగే నష్టం నివారించబడుతుంది. దీని వల్ల కొల్లాజెన్ ఉత్పత్తి పెరుగుతుంది. ఇది చర్మాన్ని సంరక్షి స్తుంది. దీని వల్ల ఎల్లప్పుడూ కాంతివంతంగా, యవ్వనంగా కనిపిస్తారు. ఇలా పలు ఆహారాలను తీసుకుంటే సినీ తారల్లా ఎప్పుడూ యంగ్ గా కనిపించవచ్చు.

# ఈ ఆహారాలను రోజూ తినాల్సిందే.. ఎందుకో తెలుసా..?



పండ్లు, కూరగాయలు, గింజలు, పప్పు దినుసులు, కంద మూలాలు, సుగంధద్రవ్యాలను మానవుడికి ప్రకృతి అందించిన వరంగా చెప్పవచ్చు. ఆయా సీజన్లలో పండే పండ్లను తినడం చాలా మందికి అలవాటు. పండ్లు, కూరగాయలు, గింజలు, పప్పు దినుసులు, కంద మూలాలు, సుగంధ ద్రవ్యాలను మానవుడికి ప్రకృతి అందించిన వరంగా చెప్పవచ్చు. ఆయా సీజన్లలో పండే పండ్లను తినడం చాలా మందికి అలవాటు. పూర్వకాలంగా మనం ఇలాగే ఆహారాలను తింటున్నాం. అన్నంతో కూడా ప్రకృతి సిద్ధమైన పండ్లు, కూరగాయలు, ఇతర తృణ ధాన్యాలను మనం ఆహారంగా తింటుంటాం. వీటిని ఆహారంగా తీసుకుంటే శరీరానికి కావల్సిన పోషకాలు లభిస్తాయి. ఇదే అసలు ఉత్తమమైన జీవనవిధానమని కూడా ప్రకృతి వైద్యులు చెబుతుంటారు. ఆహారం జీవం ఉన్న ప్రతి జీవికి అత్యవసరమైంది. పిండి పదార్థాలు, ప్రోటీన్లు, కొవ్వులు, మినరల్స్, ఫైబర్ వంటివి రోగ నిరోధక శక్తిని పెంపొందిస్తాయి. ఈ పోషకాలను కలిగిన ఆహారాలను రక్షణ కవచాలుగా నిలిచే ఆహారాలని చెప్పవచ్చు.

**విటమిన్ సి..**

శరీరంలో రోగ నిరోధక శక్తి ఉంటేనే మనం ఆరోగ్యంగా ఉంటాం. ప్రతి సీజన్ మారే సమయంలోనూ మనకు అనేక వ్యాధులు వస్తుంటాయి. అలాగే కలుషిత ఆహారం తిన్నా, నీళ్లను తాగినా కూడా వ్యాధులు వస్తుంటాయి. తరచూ మనకు దగ్గు, జలుబు, ఫ్లూ వంటి సమస్యలు వస్తుంటాయి. కొందరికి అలర్జీలు కూడా ఉంటాయి. వీటన్నింటి నుంచి బయట పడాలంటే మన ఇమ్యూనిటీ పవర్ ఎక్కువగా ఉండాలి. అందుకు కొన్ని ఆహారాలు తోడ్పడుతాయి. విటమిన్ సి ఎక్కువగా ఉండే ఆహారాలను తీసుకోవడం వల్ల శరీరం వైరస్, బ్యాక్టీరియాలకు వ్యతిరేకంగా పోరాడుతుంది. దీంతో ఇన్‌ఫెక్షన్లు రాకుండా చూస్తుంది. టమాటా, ఆలుగడ్డలు, నారింజ, నిమ్మ, కివి, పైనాపిల్, ద్రాక్ష పండ్లలో విటమిన్ సి అధికంగా ఉంటుంది.

**జింక్ ఆహారాలు..**

శరీరం కోల్పోయిన యాంటీ బాడీ కణాలను తిరిగి పునర్నిర్మితం చేయడంలో జింక్ దోహద పడుతుంది. జింక్ మనకు గుడ్లు, మాంసం, పెరుగు, పాలు, బీన్స్, సీఫుడ్‌లలో లభిస్తుంది. ప్రతి రోజూ ఒక కప్పు పెరుగును తీసుకోవాలి.

ఇది జీర్ణవ్యవస్థలో ఉండే మంచి బ్యాక్టీరియాను పెంచుతుంది. రోగాలు రాకుండాచూస్తుంది. ప్రతి రోజూ అర కప్పు క్యారెట్లను తినాలి. వీటి లో ఉండే బీటా కెరోటిన్, విటమిన్ బి6 యాం టీ బాడీ కణాల ఉత్పత్తిని పెంచుతాయి. దీని వల్ల రోగ నిరోధక వ్యవస్థ యాక్టివ్‌గా పనిచేస్తు ంది. వెల్లుల్లిలో ఉండే మినరల్స్ బ్యాక్టీరియా, ఫంగస్ ఇన్‌ఫెక్షన్లపై పోరాడేలా చేస్తాయి. ప్రతి రోజూ ఆహారంలో ఒక స్పూన్ వెల్లుల్లి మిశ్ర మాన్ని తీసుకుంటుంటే ఆరోగ్యంగా ఉంటారు.

**ఐరన్ ఉన్నవి..**

రోజూ నాలుగు లేదా ఐదు ఖర్జూరాలను తీసుకోవడం వల్ల శరీరానికి సరిపడా ఐరన్ అందుతుంది. ఇది రోగ నిరోధక వ్యవస్థను కూడా ఉత్తేజం చేస్తుంది. పొటాషియం అధికంగా ఉండే అరటి పండ్లను కూడా తరచూ తినాలి. దీని వల్ల రక్తపోటు తగ్గుతుంది. గుండె ఆరోగ్యంగా ఉంటుంది. ఇలా పలు సరైన ఆహారాలను తింటే రోగ నిరోధక శక్తిని పెంచుకోవచ్చు. మారుతున్న కాలానికి అనుగుణంగా మన ఆహారంలోనూ మార్పులు చేసుకుంటే ఆరోగ్యంగా ఉండవచ్చు. రోగాలు రాకుండా శరీరం సురక్షితంగా ఉంటుంది.

# పరగడపున వామును తీసుకుంటే బెల్లీ, బరువు తగ్గడమే కాదు, మరెన్నో లాభాలు, ఎలా తీసుకోవాలంటే

వామును ఆహారంలో చాలా మంది వాడతారు. ఇందులో ఎన్నో ఆరోగ్య ప్రయోజనాలున్నాయి. దీనిని తినడం వల్ల జీర్ణక్రియ పెరుగుతుంది. అజీర్ణం వంటి సమస్యలు తగ్గుతాయి. జలుబు, దగ్గు,పంటి,చెవినొప్పులు కూడా దూరమవుతాయి. ఈ గింజల్ని తింటే ఆర్థరైటిస్ వల్ల కలిగే నొప్పిని తగ్గించడంలో సాయపడుతుంది. ఉబ్బసం,కిడ్నీ ఫెయిల్యూర్,బరువుతగ్గడం, పీరియడ్స్ ప్రాబ్లమ్స్ కూడా తగ్గుతాయి. వాము ని ఎలా తీసుకోవాలో తెలుసుకోండి.వాములో కేలరీలు, కార్బోహైడ్రేట్స్,ఫైబర్,కొవ్వు,కాల్షి యం,ఐరన్, పొటాషియం,పాస్ఫరస్,సోడియం లుఉంటాయి వామును ఎక్కువగా పిండివంటలు,వాము చారు,వాముపొడి ఇలా రకరకాలుగా వాడతాం.

**పంటి నొప్పికి**

వామును తీసుకోవడం వల్ల తరచుగా వచ్చే పంటి నొప్పి కూడా తగ్గుతుంది. పంటినొప్పిని తగ్గించే గుణాలు వాములో పుష్కలంగా ఉంటాయి. దీనికోసం మీరు నోటిలో వామును ఉంచి వాటి రసాన్ని పీలుస్తూ వాటిని నమిలి మింగి ఆ తర్వాత గోరువెచ్చని నీరు తాగండి. ఇలా చేస్తే వేధించే పంటి నొప్పిని దూరం చేసుకోవచ్చు. దీంతోపాటు,చెడు వాసన రావడం కూడా తగ్గుతుంది.అంతేకాకుండా, పీరియడ్స్ పెయిన్, కడుపునొప్పి ఇతరసమస్యలుకూడా తగ్గుతాయి.

**కిడ్నీల్లో రాళ్లు**

ఆహారంతో పాటు వాము తీసుకుంటే కిడ్నీల్లోని



రాళ్లు కరిగిపోతాయి.తేనె, వెనిగర్, వాము నానబెట్టిన నీటిని 10 రోజుల పాటు ఉదయాన్నే తీసుకుంటే మూత్రపిండాల్లో రాళ్లు కరిగిపోయే అవకాశం ఉంది.ఈ నీటిని రెగ్యులర్‌గా తాగితే బ్లడ్ ప్రెజర్ కూడా తగ్గుతుంది.

**బరువు తగ్గడానికి**

బరువు తగ్గించడంలో వాము చాలా కీ రోల్ పోషిస్తుంది. బెల్లీ ఫ్యాట్‌ని తగ్గించేందుకు ఓ గ్లాసు నీటిలో అరచెంచా వాము వేసి రాత్రంతా నానబెట్టి మరుసటి రోజు ఆ నీటిని వడకట్టి, అందులో కొద్దిగా తేనె కలిపి ఉదయాన్నే పరగడపున తాగితే పొత్తికడుపులో పేరుకుపోయిన బెల్లీ ఫ్యాట్ తగ్గుతుంది. దీంతో బరువు కూడా తగ్గుతారు.

**జలుబు, దగ్గు తగ్గేందుకు**

చాలా మందికి సీజన్ చేంజ్ అయినప్పుడల్లా జలుబు, దగ్గు వంటి సమస్యలొస్తాయి. వీటిని తగ్గించుకునేందుకు వాము హెల్ప్ చేస్తుంది. వాములో శోథ నిరోధక గుణాలు ఉంటాయి. ఇవి దగ్గు,జలుబు నుండి మిమ్మల్ని కాపాడతాయి. వాములోని ఏరోసోల్స్ పిల్లల్లో జలుబు, ఉపశమనం నుండి రిలాక్స్ చేస్తాయి. దీని కోసం వాము,వాము ఆకుల్ని నీటిలో మరిగించి కషాయంలా చేసి తాగాలి. దీంతో జలుబు, దగ్గు వంటి సమస్యలు తగ్గుతాయి.

**జీర్ణ సమస్యలు**

వాములో ఉన్న గుణాల కారణంగా వీటిని తీసుకుంటే జీర్ణ సమస్యలు తగ్గుతాయి. వీటిని తీసుకుంటే కడుపు ఉబ్బరం, ఆపానవాయువు, జీర్ణసమస్యల నుండి ఉపశమనం కలుగుతుంది. వేడినీటిలో కొద్దిగా ఉప్పు, పసుపు కలిపి తాగడం వల్ల జీర్ణ సమస్యలు తగ్గుతాయి.

**ఎలా తినొచ్చు**

వామును చికెన్, చేప వంటి వంటల్లో వాడొచ్చు. అదనంగా, వామును హెర్బల్ టీలు, జ్యూస్‌లు, బిస్కెట్స్, సలాడ్స్, సూప్స్ఇలా ఎలా అయినా తీసుకోవచ్చు. వీటిని మన డైట్‌లో రకరకాలుగా యాడ్ చేసుకోవచ్చు. దీంతో చాలా వరకూ వీటిలోని లాభాలను మనం పొందొచ్చు.

**సైడ్ ఎఫెక్ట్స్**

గర్భిణీలు,పాలిచ్చే తల్లులు వాము నీటిని తీసుకోవద్దు.ప్రెగ్నెన్సీ సమయంలో వాము ఆధారిత ప్రోడక్ట్స్ తీసుకోవడం వల్ల అబార్షన్ అయ్యే ప్రమాదం పెరుగుతుందని డాక్టర్స్ అంటున్నారు.పాలిచ్చే తల్లులు వాము తీసుకుంటే తల్లి పాలస్రావం తగ్గుతుందని డాక్టర్స్ చెబుతున్నారు.

# క్యాన్సర్ ఉన్నవారికి వరం.. ఈ పొడి.. ఇంకా ఎన్నో లాభాలు..!

ఈ మధ్య కాలంలో చాలా మంది హెర్బల్ ఉత్పత్తులను ఎక్కువగా వాడుతున్నారు. చాలా చోట్ల మనకు స్పిరులినా అనే పదం వినిపిస్తోంది. అయితే ఇంతకీ స్పిరులినా అంటే ఏమిటి..?దీన్ని తీసుకుంటే ఎలాంటి ఆరోగ్య ప్రయోజనాలు కలుగుతాయి..?ఈ మధ్య కాలంలో చాలా మంది హెర్బల్ ఉత్పత్తులను ఎక్కువగా వాడుతున్నారు. చాలా చోట్ల మనకు స్పిరులినా అనే పదం వినిపిస్తోంది. అయితే ఇంతకీ స్పిరులినా అంటే ఏమిటి..?దీన్ని తీసుకుంటే ఎలాంటి ఆరోగ్య ప్రయోజనాలు కలుగుతాయి..?అన్న వివరాలను ఇప్పుడు తెలుసుకుందాం. స్పిరులినాను ఆకుపచ్చని ఆహారంగా చెబుతారు. సముద్ర గర్భంలో పెరిగే ఒక రకమైన నాచునే స్పిరులినా అంటారు. దీన్ని సేకరించి ఎండ బెట్టి పొడి చేసి విక్రయిస్తారు. లేదా ట్యాబ్లెట్ల రూపంలోనూ మనకు స్పిరులినా అందుబాటులో ఉంది. డాక్టర్ సలహా మేరకు స్పిరులినాను తీసుకోవచ్చు. స్పిరులినా మనకు అనేక లాభాలను అందిస్తుంది. ఆఫ్రికాలో స్పిరులినాను ఆహారంగా కూడా తీసుకుంటారు.

**ఐరన్ వృద్ధికి..**

స్పిరులినాలో ఐరన్ సమృద్ధిగా ఉంటుంది. అందువల్ల రక్తహీనతతో బాధపడుతున్నవారికి స్పిరులినా ఎంతో మేలు చేస్తుంది. రోజుకు 1 నుంచి 2 గ్రాముల మేర స్పిరులినా పొడిని తీసుకుంటే ఐరన్ సమృద్ధిగా లభిస్తుంది. దీంతో రక్తం తయారవుతుంది. మనం తినే ఆహారం నుంచి ఐరన్‌ను శోషించుకోవడం కష్టంగా ఉంటే స్పిరులినాను వాడవచ్చు.పాలకూర కన్నా



మనకు అధిక ఐరన్ స్పిరులినాలో లభిస్తు ంది. అలాగే స్పిరులినాలో బీటా కెరోటిన్ కూడా సమృద్ధిగానే ఉంటుంది. ఇది మన శరీరంలో విటమిన్ ఎ గా మారుతుంది. 1 గ్రాము స్పిరులినాను తీసుకుంటే 2 మిల్లీగ్రాముల విటమిన్ ఎను పొందవచ్చు. ఇది కంటి చూపును మెరుగు పరుస్తుంది. కళ్లను ఆరోగ్యంగా ఉంచుతుంది. కంటి సమస్యలు తగ్గుతాయి.

**క్యాన్సర్ ఉన్నవారికి..**

స్పిరులినాను తీసుకోవడం వల్ల శరీర రోగ నిరోధక శక్తి పెరుగుతుంది. శరీరం వ్యాధులు, ఇన్ఫెక్షన్లకు వ్యతిరేకంగా పోరాడుతుంది. స్పిరులినాను తీసుకుంటే హిమోగ్లోబిన్ స్థాయిలు పెరుగుతాయి. అలసట, నీరసం నుంచి ఉపశమనం లభిస్తుంది. క్యాన్సర్ కారణంగా కీమో థెరపీ చేయించుకునేవారు దీన్ని వాడితే తెల్ల రక్త కణాల సంఖ్య పెరుగుతుంది. క్యాన్సర్ ఉన్నవారికి స్పిరులినా ఎంతో మేలు చేస్తుంది. ఇది కొలెస్ట్రాల్ లెవల్స్‌ను సైతం తగ్గించగలదు. నాడీ మండల సమస్యలు ఉన్నవారు స్పిరులినాను తీసుకుంటే మెరుగైన ఫలితాలువస్తాయి. స్పిరులినా లివర్ ఆరోగ్యాన్ని సైతం మెరుగుపరుస్తుంది. లివర్ శుభ్రంగా మారి ఆరోగ్యంగా ఉండేలా చేస్తుంది.

**గర్భిణీలకు..**

కొందరు పోషకాహార నిపుణులు గర్భిణీలకు కూడా స్పిరులినాను వాడమని చెబుతుంటారు. దీని వల్ల శిశువుకు కావల్సిన విటమిన్ ఎ లభిస్తుంది.పిండం ఎదుగుదల సరిగ్గా ఉంటుంది పుట్టుకతో లోపాలు రాకుండా అడ్డుకోవచ్చు బాలింతలు స్పిరులినాను తీసుకుంటే పాలు బాగా పడతాయి. స్పిరులినాలో అనేక యాంటీ ఆక్సిడెంట్లు, ఫైటో న్యూట్రియెంట్లు ఉంటాయి. ఇవి చర్మాన్ని సంరక్షిస్తాయి. అందు కనే స్పిరులినాను సౌందర్య సాధన ఉత్పత్తుల్లో నూ ఉపయోగిస్తున్నారు. స్పిరులినాను ఫేస్ ప్యాక్‌గా కూడా వాడవచ్చు. అలాగే జుట్టుకు ఇది హెయిర్ కండిషనర్‌గా పనిచేస్తుంది. శిరోజాలు ఒత్తుగా,దృఢంగా పెరిగేలా చేస్తుంది.ఇన్ని లాభాలు ఉన్నాయి కనుక స్పిరులినాను వాడాలని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు. డాక్టర్ సలహా మేరకు మోతాదులో దీన్ని వాడితే అద్భుతమైన ఫలితాలను సాధించవచ్చని అంటున్నారు.

# దంతాలను తెల్లగా మార్చే టూత్‌పౌడర్, ఇంట్లోనే తయారుచేసుకోవచ్చు, ఏమేం కావాలంటే

నవ్వు అందంగా ఉండాలంటే దంతాలు మిలమిల మెరవాలి. దీనికోసం చాలా మంది చాలా ప్రయత్నాలు చేస్తారు.రకరకాల పేస్టులు వాడతారు.అలా కాకుండా ఇంట్లోనే మూలికలతో టూత్‌పౌడర్ తయారుచేసుకోవచ్చు.దీని వల్ల దంతాలు ఆరోగ్యంగా ఉంటాయి. అంతేకాకుండా చిగుళ్లు కూడా హెల్దీగా మారతాయి.ఈ టూత్‌పౌడర్‌ని తయారుచేసేందుకు వాడే పదార్థాలన్నీ సహజంగా మనకి లభించేవే. కాబట్టి, కెమికల్స్ వల్ల దంత సమస్యలొస్తాయనే భయమే అవసరం లేదు. ఇక మరి అసలు టూత్‌పౌడర్ తయారీకి కావాల్సిన పదార్థాలు, తయారీ విధానం ఏంటో తెలుసుకోండి.

కావాల్సిన పదార్థాలు, తయారీ విధానం

ఎండిన తులసి ఆకులు ఓ కప్పు ఆవ లేదా కొబ్బరి నూనె కొద్దిగా

**ఏం చేయాలి**

తులసి ఆకులని మెత్తని పొడిలా చేసి జల్లించి ఓ సీసాలో స్టోర్ చేసుకోవాలి. దీనిని అవసరమైనప్పుడల్లా తీసుకుని ఆవాల నూనె, కొబ్బరి నూనెతో కలిపి పేస్టులా చేయాలి.దీంతో టూత్‌బ్రష్‌తో మీ పళ్లు తోమండి.ఎంతలా మనం నేచురల్ పదార్థాలతో చేసినప్పటికీ దీనిని రెగ్యులర్‌గా వాడాల్సిన అవసరం లేదు. వారానికి ఒకటి లేదా రెండు సార్లు వాడాలి. ఇలా తోమడం వల్ల దంతాల మధ్య ఇరుక్కున్న వ్యర్థాలన్నీ దూరమైపోతాయి. పాచి కూడా ఉండదు. దంతలు చక్కగా మిలమిలగా మెరుస్తాయి.



**తులసిలోని గుణాలు**

తులసిని మనం ఎన్నో రకాల ఆరోగ్య సమస్యలు దూరం చేసేందుకు వాడతాం.దీనికి కారణం తులసి యాంటో మైక్రోబయల్ గుణాలు ఉన్నాయి.ఇవి నోటిలోని బ్యాక్టీరియా, క్రిముల తో పోరాడతాయి.తులసి ఆకుల్లో యాంటీ బ్యాక్టీరియల్, యాంటీ వైరల్, యాంటీ ఫంగల్ గుణాలు పంటి నొప్పి,ట్రీట్‌మెంట్‌కి సాయపడతాయి.తులసిలోని యాంటీ ఆక్సిడెంట్స్ నోటిపూత,ఇతర సమస్యల్ని కూడా తగ్గిస్తాయి.

**కొబ్బరినూనె**

కొబ్బరినూనెని వాడడం వల్ల హానికరమైన బ్యాక్టీరియా దూరమై నోటి దుర్వాసన తగ్గుతుంది. దీంతో పాటు దంతక్షయం, చిగుళ్ల వ్యాధికి కారణమయ్యే హానికరమైన బ్యాక్టీరియా దూరమవుతుంది.కొబ్బరినూనెని వాడడం వల్ల చిగుళ్ల సమస్యలు దూరమవుతాయి.చిగురు వాపు వంటి సమస్యలు దూరమై నోటి దుర్వాసన తగ్గుతుంది. అంతేకాకుండా నాలుకపై పూత కూడా తగ్గుతుంది.

**ఆవనూనె**


ఆవనూనెలో యాంటీ బ్యాక్టీరియా గుణాలు ఉన్నాయి.ఇవి నోటిలోని హానికరమైన బ్యాక్టీరియాని చంపడానికి హెల్ప చేస్తుంది. ఆయుర్వేదం ప్రకారం, ఆవనూనెని వాడడం వల్ల పాచి, చిగుళ్ల వాపు, చిగుళ్ల నుంచి రక్తస్రావం వంటి సమస్యల్ని తగ్గిస్తుంది. ఆవనూనెని వాడడం వల్ల నోటిలోని లెవల్స్ బ్యాలెన్స్ అవుతాయి. ఇది దంతాలను బలంగా చేసి, కేవిటీలు రాకుండా హెల్ప్ చేస్తాయి.

**వాడే ముందు**

ఈ టూత్‌పౌడర్‌ని చిన్నపిల్లలకి వాడే ముందు డెంటల్ డాక్టర్‌ని కన్సల్ట్ అవ్వాలి.తక్కువ మొత్తంలోనే పౌడర్ వాడాలి.రోజూ అవసరం లేదు. వారానికి 1 లేదా 2 సార్లు వాడొచ్చు. అదే విధంగా, నార్మల్‌గా రోజుకి 2 సార్లు పళ్లు తోమడం మంచిది.సున్నితంగా నాలుకని స్క్రబ్ చేయాలి.భోజనం తర్వాత నోటిని క్లీన్ చేస్తే మంచిది.ప్రతి 6 నెలలకి ఓ సారి డెంటల్ చెకప్ తప్పనిసరి.

# ఎండాకాలంలో వేడిని తగ్గించి షుగర్, బీపిలను కంట్రోల్ చేసే పెసలు, ఎలా తినాలంటే

ఎండాకాలం వచ్చిందంటే చాలు పెసరపప్పు, పెసరపప్పు చారు, పెసరెట్టు ఇలా చాలా రకాలుగా పెసలని వాడతారు. దీనికి కారణం వీటిలోని గుణాల కారణంగా వీటిని తినడం వల్ల శరీరానికి చలువ చేస్తుంది. వీటిని మనం తినడం వల్ల ఎండాకాలంలో వచ్చే వేడిని తగ్గించుకోవచ్చు. దీనికోసం పెసలని ఎలా అయినా తినొచ్చు. అయితే, ముఖ్యంగా వీటిని ఉడికించి తింటే మరికొన్ని అద్భుత లాభాలు న్నాయి. పెసలని ప్లాంట్ బేస్డ్ ప్రోటీని చెప్పొచ్చు. ఇందులో ఎన్నో అమైనో యాసిడ్స్ ఉంటాయి. వీటిలోని ప్రోటీన్స్, విటమిన్స్ ఎ, సిలు, బాడీలో ఇమ్యూనిటీని పెంచుతాయి. అంతేకాకుండా ఇందులో ఐరన్, వీటితో పాటు జింక్ కూడా ఉంటుంది. ఇన్ని లాభాలున్న ఈ పెసలని ఉడికించి ఉదయాన్నే తింటే చాలా లాభాలు ఉంటాయి.



**హైబీపి తగ్గేందుకు**

హైపీబి ఉన్నవారికి పెసలు చాలా మంచివి. రెగ్యులర్‌గా పెసలని ఏదో రకంగా తీసుకుంటే బ్లడ్ ప్రెజర్ కంట్రోల్‌లో ఉంటుంది. ఇందులోని విటమిన్స్ హార్మోన్స్‌ని ప్రేరేపిస్తాయి. దీంతో ఎదిగే పిల్లలకి ఇది మంచి ఆహారమని చెప్పొచ్చు. ఆరోగ్యానికే కాదండి అందానికి కూడా చాలా బాగా పనిచేస్తాయి. పెసల్ని రెగ్యులర్‌గా తింటే యవ్వనంగా కనిపిస్తారు. ఇందులోని కాపర్ చర్మంపై ముడతల్ని తగ్గిస్తుంది. యాంటీఆక్సిడెంట్ గుణాలు ఫ్రీ రాడికల్స్‌ని నుంచి స్కిన్ డ్యామేజ్ కాకుండా హెల్ప్ చేస్తాయి. అదే విధంగా, కొల్లాజెన్ ప్రొడక్షన్‌ని త్గిస్తాయి.

**రక్తప్రసరణజి**

పెసలలో ఎక్కువగా ఐరన్ ఉంటుంది. వీటిని తినడం వల్ల రక్తం పెరిగి రక్త సరఫరా సరిగా ఉంటుంది. అంతేకాకుండా ఇందులోని ఐరన్ శరీరంలోని అవయవాలకి ఆక్సీజన్‌ని సమృద్ధిగా అందిస్తుంది. కాబట్టి, రెగ్యులర్‌గా పెసలని డైట్‌లో యాడ్ చేసుకోవడం మంచిది.

**షుగర్ కంట్రోల్ అయ్యేందుకు**

పెసలలో తక్కువగా గ్లైసెమిక్ ఇండెక్స్ ఉంటుంది. దీనిని తీసుకోవడం వల్ల బాడీ ఇన్సులిన్‌ని తగ్గిస్తుంది. అదే విధంగా బ్లడ్ గ్లూకోజ్, ఫ్యాట్ లెవల్స్‌ని కూడా తగ్గిస్తుంది. ఈ కారణం వల్లే బరువు కూడా ఈజీగా తగ్గుతారు. షుగర్ వంటి సమస్యలతో బాధపడేవారు రెగ్యులర్‌గా పెసలని వారి డైట్‌లో యాడ్ చేసుకోండి.

**జీర్ణ వ్యవస్థకి**

పెసలలో ఎక్కువగా ఫైబర్ ఉంటుంది. వీటిని తినడం వల్ల జీర్ణ సమస్యలు దూరమవుతాయి. జీర్ణ వ్యవస్థ హెల్దీగా మారుతుంది. మలబద్ధకంగా, అజీర్ణం, బ్లోటింగ్ వంటిసమస్యలన్నీ తగ్గుతాయి. దీనికోసం రెగ్యులర్‌గా పెసలని తీసుకోవాలి. అంతేకాకుండా, పెసలని తినడం వల్ల బ్రెయిన్ హెల్దీగా మారుతుంది. న్యూరల్ హెల్త్ మెరుగ్గా మారుతుంది.

**మజిల్స్ పెరిగేందుకు**

జిమ్ చేసేవారు మజిల్స్ పెరగాలని చాలా కసరత్తులు చేస్తారు. రకరకాల ఫుడ్స్ తీసుకుంటారు. ఎన్నెన్నో ఎక్సర్‌సైజెస్ చేస్తారు. ప్రోటీన్ షేక్స్ వంటివి తీసుకుంటారు. వాటి బదులు పెసలని హ్యాపీగా తీసుకోవచ్చు. దీని వల్ల కూడా మజిల్స్ పెరుగుతాయి. జిమ్ చేసేవారు మాత్రమే కాదు, మజిల్స్, మజిల్ పవర్ పెంచుకోవానలుకునేవారు ఈ పెసలని రెగ్యులర్‌గా వారి డైట్‌లో చేర్చుకుంటే మంచి రిజల్ట్స్ ఉంటాయి. దీంతో పాటు ఇందులో కాల్షియం ఉంటుంది. దీంతో ఎముకలు కూడా బలంగా మారతాయి.

**ఎలా తినాలంటే**

ఉదయాన్నే హెల్దీ బ్రేక్‌ఫాస్ట్ తినడం చాలా మంచిది. వీటిని తినడం వల్ల మనకి ఎన్నో పోషకాలు అందుతాయి. పెసలని మనం మొలకల్లా చేసి తినొచ్చు. లేదా మనం ఉడికించి తినొచ్చు. దీని వల్ల మంచి ప్రోటీన్, ఫైబర్ బాడీకి అందుతుంది. రోజంతా యాక్టివ్‌గా తింటారు. పైగా, ప్రోటీన్, ఫైబర్ బాడీకి అందాల్సిన పోషకాలు. దీని వల్ల చాలానే లాభాలు ఉంటా యి. అయితే, మనం పచ్చి మొలకల బదులు వీటిని ఉడికించి తింటే ఫుడ్ పాయిజ నింగ్ వంటి సమస్యలు అయ్యే అవకాశం తక్కు వగా ఉంటుంది. వీటిని చక్కగా మనం రోజూ డైట్‌లో యాడ్ చేసుకోవచ్చు. పెసరపప్పు చారు, పెసరపప్పు పులగం, పెసరపప్పు హల్వా, పెస రపప్పు పొంగల్ అబ్బో ఇలా చాలా రకాలుగా చేయొచ్చు.

# రోజూ మీరు చేసే ఈ తప్పులే మీకు త్వరగా వృద్ధాప్యం వచ్చేలా చేస్తాయని మీకు తెలుసా..?

రోజూ మీరు చేసే ఈ తప్పులే మీకు త్వరగా వృద్ధాప్యం వచ్చేలా చేస్తాయని మీకు తెలుసా..? వయస్సు మీద పడుతున్న కొద్దీ సహజంగానే ఎవరికైనా సరే వృద్ధాప్య ఛాయలు కనిపిస్తుంటాయి. ముఖంపై ఎక్కువగా ముడతలు వస్తుంటాయి. దీంతో చాలా మంది హైరానా పడుతుంటారు. త్వరగా వయస్సు వచ్చేసిందని ఫీలవుతుంటారు. వయస్సు మీద పడుతున్న కొద్దీ సహజంగానే ఎవరికైనా సరే వృద్ధాప్య ఛాయలు కనిపిస్తుంటాయి. ముఖంపై ఎక్కువగా ముడతలు వస్తుంటాయి. దీంతో చాలా మంది హైరానా పడుతుంటారు. త్వరగా వయస్సు వచ్చేసిందని ఫీలవుతుంటారు. 50 ఏళ్లు నిండితే చర్మం ముడతలు పడితే ఫర్వాలేదు. కానీ కొందరికి చిన్న వయస్సులోనే వృద్ధాప్య ఛాయలు కనిపిస్తుంటాయి. దీంతో వారిలో ఆందోళన మొదలవుతుంది. అయితే నిజానికి మనం రోజూ పాటించే జీవనశైలి, తీసుకునే ఆహారాలే మనకు ఇలాంటి సమస్యలను తెచ్చి పెడతాయి. ముఖ్యంగా మనం రోజూ చేసే కొన్ని రకాల పనుల వల్లే మనకు త్వరగా వృద్ధాప్య ఛాయలు వస్తాయి. అయితే ఎందుకు ఇలా జరుగుందో తెలుసుకుంటే ముందుగానే సమస్యను నివారించవచ్చు. దీంతో వృద్ధాప్య ఛాయలు రాకుండా చూసుకోవచ్చు.



**ఒత్తిడి..**

ప్రస్తుతం చాలా మంది నిత్యం అనేక సందర్భాల్లో ఒత్తిడిని ఎదుర్కొంటున్నారు. మనకు వస్తున్న అనేక ఆరోగ్య సమస్యలకు మూల కారణం ఒత్తిడే అని వైద్య నిపుణులు చెబుతున్నారు. ఒత్తిడి అధికంగా ఉంటే శరీరంలో కార్టిసోల్ అనే హార్మోన్ లెవల్స్ పెరిగిపోతాయి. ఇది మన ఆరోగ్యంపై నెగెటివ్‌గా ప్రభావం చూపే హార్మోన్. దీంతో వృద్ధాప్య ఛాయలు త్వరగా వస్తాయి. కనుక ఒత్తిడి లేని జీవితం గడపాలి. అందుకు గాను యోగా, మెడిటేషన్ చేయాలి. రోజూ పచ్చని ప్రకృతిలో కాసేపు గడపాలి. మీకు ఇష్టమైన సంగీతం కాసేపు వినాలి. పుస్తక పఠనం చేయవచ్చు. ఇంట్లో చిన్న పిల్లలు ఉంటే సరదాగా వారితో కాసేపు ఆడుకోండి. మీ ఒత్తిడి మొత్తం మటుమాయం అవుతుంది. దీంతో వృద్ధాప్య ఛాయలు రాకుండా చేయవచ్చు.

**నెగెటివ్ ఆలోచనలు..**

కొందరికి ఎల్లప్పుడూ నెగెటివ్ ఆలోచనలే అధికంగా వస్తుంటాయి. రోజూ అన్ని విషయాల్లోనూ నెగెటివ్ ఆలోచనలే చేస్తుంటారు. ఏ పని చేసినా అందులో పాజిటివ్ కోణాన్ని వెదకరు. నెగెటివ్ ఆలోచననే చేస్తారు. ఇది ఆరోగ్యానికి మంచిది కాదు. తీవ్ర ప్రభావం చూపిస్తుంది. మీరు ఏ పని చేస్తున్నా రిజల్ట్ పాజిటివ్‌గానే వస్తుందని ఫిక్స్ అవ్వాలి. పాజిటివ్ దృక్పథంతోనే ఉండాలి. దీంతో ఆరోగ్యం మెరుగు పడుతుంది. మీరు ఎంత ఎక్కువ నెగెటివ్ ఆలోచనలు చేస్తే మీకు అంత త్వరగా వృద్ధాప్య చాయలు వస్తాయన్న విషయాన్ని గుర్తుంచుకోవాలి. ఎల్లప్పుడూ పాజిటివ్ ఆలోచనలే చేయాలి. అలాగే రోజూ కనీసం 7 నుంచి 8 గంటలు నిద్రపోయేలా ప్లాన్ చేసుకోవాలి. నిద్ర సరిగ్గా లేకపోయినా కూడా త్వరగా వృద్ధాప్య ఛాయలు వస్తాయి. రాత్రి పూట పాలలో తేనె కలిపి తాగినా లేదా పడుకునే ముందు కాసేపు పుస్తకాలను చదివినా ఫలితం ఉంటుంది. చక్కగా నిద్ర పడుతుంది. సరిగ్గా నిద్రపోతే మీ వయస్సును వెనక్కి మళ్లించవచ్చు.

**ఆహారం, ఇతర అంశాలు..**

రోజంతా ఎండలో తిరిగినా కూడా చర్మానికి మంచిది కాదు. రోజుకు కనీసం 20 నిమిషాలు విటమిన్ డి కోసం సూర్యరశ్మిలో ఉండవచ్చు. కానీ అంతకు మించి ఎండలో తిరగరాదు. దీని వల్ల చర్మం త్వరగా ముడతలు పడుతుంది. వృద్ధాప్య ఛాయలు వచ్చేస్తాయి. అలాగే ధూమ పానం మానేయాలి. ఇది కూడా త్వరగా వృద్ధా ప్యం వచ్చేలా చేస్తుంది. జంక్ ఫుడ్, నూనె పదార్థాలు కొవ్వు ఆహారం అతిగా తింటున్నా కూడా త్వరగా వృద్ధాప్య చాయలు వస్తాయి. ఇవి చర్మాన్ని త్వరగా నాశనం చేస్తాయి. దీంతో త్వరగా వృద్ధాప్య ఛాయలు కనిపిస్తాయి. కాబట్టి ఈ ఆహారాలను మానేయాలి. అలాగే మద్యం సేవించ కూడదు. రోజుకు తగినన్ని నీళ్లను కూడా తాగా లి. ఈ విధమైన సూచనలు పాటిస్తే మీ చర్మం పై వచ్చే ముడతలను పోగొట్టవచ్చు. మీ వయస్సును వెనక్కి మళ్లించి యవ్వనంగా కనిపించవచ్చు. వృద్ధాప్య ఛాయలు రాకుండా అడ్డుకోవచ్చు.

# బాడీలోని యూరిక్ యాసిడ్ లెవల్స్ తగ్గేందుకు ఏం తినాలి, ఏం తినకూడదు, లిస్ట్ ఇదే

ఏ సమస్య అయినా మనం తీసుకునే ఫుడ్‌తోనే పెరుగుతుంది. తగ్గుతుంది. అందుకే, సమస్యని తగ్గించేందుకు సరైన ఫుడ్స్ తీసుకోవాలి. అలానే యూరిక్ యాసిడ్ కూడా. మనం సాధారణంగా తీసుకునే ఆహారంలోని ప్యూరిన్ అనే రసాయనం విచ్ఛిన్నమై యూరిక్ యాసిడ్‌గా ఏర్పడుతుంది. ఇలా ఏర్పడిన యూరిక్ యాసిడ్ ఎప్పటికప్పుడు మూత్రం ద్వారా బయటికి వెళ్లిపోతుందని, కానీ, కొన్నిసార్లు యూరిక్ యాసిడ్ ఎక్కువగా విడుదలై మూత్రం ద్వారా వెళ్లనప్పుడే సమస్య వస్తుంది. బయటికి వెళ్లని యూరిక్ యాసిడ్ రక్తంలోకి వెళ్తుంది. ఇలా రక్తంలోకి చేరిన యూరిక్ యాసిడ్ స్ఫటికాలుగా మారి కీళ్లు, కీళ్ల చుట్టూ ఉండే కణజాలాల్లో పేరుకుపోయి హైపర్ యూరిసిమియాకి దారి తీస్తుంది. అధిక బరువు ఉన్నవారికి ఈ సమస్య ఎక్కువగా వస్తుంది. బాడీలో యూరిక్ యాసిడ్ పెరగడం అంత మంచిది కాదు. అందుకే, దీనిని తగ్గించుకోవాలి. దీనికోసం ఏం తినాలి, ఏం తినకూడదో తెలుసుకోండి.




**యూరిక్ యాసిడ్ పెరిగితే**

బాడీలో యూరిక్ యాసిడ్ పెరిగితే అది కిడ్నీల పై ప్రత్యక్ష ప్రభావాన్ని చూపిస్తుంది. దీంతో మూత్ర విసర్జనలో సమస్యలు ఏర్పడి హైబీపి, కీళ్ల నొప్పులు, వాపు వంటి సమస్యలు వస్తాయి. ఈ సమస్య పెరిగి నడవడానికి కూడా కొన్నిసార్లు ఇబ్బందులు వస్తాయి. రక్తంలో యూరిక్ ఆమ్లం పెరిగితే హైపర్ యూరిసిమియాగా మారుతుంది. దీంతో మన కాలి బొటనవేలు దగ్గర యూరిక్ యాసిడ్స్ పేరుకుపోయి కాలి వేలు వస్తుంది. దీనినే గౌట్ అంటారు. ఇది ముదరితే గౌట్ ఆర్థరైటిస్‌గా మారుతుంది. దీంతో ఆ ప్రాంతంలో నొప్పి ఎక్కువగా ఉంటుంది. అందుకే, ప్యూరిన్ ఎక్కువగా ఉండే ఫుడ్స్‌ని తగ్గించాలి. ఇవే కాకుండా, గౌట్‌ని తగ్గించే ఆహార పదార్థాలు కొన్ని ఆహారాల్లో ఉంటాయి. అలానే సమస్యని పెంచే ఫుడ్స్ కూడా ఉంటాయి. వీటి గురించి సమస్య ఉన్నవారు తెలుసుకోవడం చాలా ముఖ్యం.

**యూరిక్ యాసిడ్ ఎక్కువగా ఉన్నప్పుడు తీసుకోకూడని ఫుడ్స్**

రెడ్ మీట్,సీ ఫుడ్, ప్రాసెస్డ్ ఫుడ్స్, బఠానీలుజి, బచ్చలికూరజి, పల్లీలుజి, ఎండుద్రాక్ష, కూల్ డ్రింక్స్, ఆల్కహాల్, షుగర్ ఫుడ్స్, బేవరేజెసజి.

**యూరిక్ యాసిడ్ ఉన్నప్పుడు ఏం తినాలి**

విటమిన్ సి ఫుడ్స్, సీజనల్ ఫ్రూట్స్,పాలకూరజి పాలు, డెయిరీ ప్రోడక్ట్స్ అన్ని రకాల బెర్రీస్ రేగిపండ్లు, నేరేడు పండ్లు, చెర్రీస్‌జి

**ఒమేగా ఫ్యాటీ యాసిడ్ ఎక్కువగా ఉన్న ఫుడ్**

**మీల్ మేకర్, సోయా ప్రోడక్ట్స్**

గ్రీన్ టీ, బార్లీ నీరు, ఎక్కువగా నీరు, కాఫీజి బ్లాక్ కాఫీ

**తగ్గేందుకు ఏం చేయాలి**

హెల్దీ వెయిట్ ఉండేలా చూసుకోండి. మంచి డైట్ ఫాలో అవ్వండి.ప్యూరిన్ ఫుడ్స్ తీసుకోవద్దుహెల్దీ ఫుడ్స్ కూడా మితంగానే తీసుకోవాలి.

**బరువు తగ్గడం**

బరువు ఎక్కువగా ఉంటే గౌట్ ప్రమాదం పెరుగుతుంది. కాబట్టి, బరువు తగ్గండి. కేలరీలని తగ్గించండి. బరువు తగ్గితే యూరిక్ యాసిడ్ స్థాయిలు తగ్గుతాయి. దీంతో కీళ్లపై కూడా ఒత్తిడి తగ్గుతుంది. నీరు ఎక్కువగా తాగాలి. ఎంత హైడ్రేట్‌గా ఉంటే అంత మంచిది. ప్రోటీన్ ఫుడ్స్ తీసుకోవాలి. లోఫ్యాట్ మిల్క్, పప్పుల వంటివి ఎక్కువగా తీసుకోవాలి.

# బ్లాక్ సీడ్స్ అందించే ఆరోగ్య ప్రయోజనాల గురించి మీకు తెలుసా..? తెలిస్తే ఇప్పుడే తీసుకుంటారు..!

మీకందరికీ కాలోంజీ విత్తనాల గురించి తెలిసే ఉంటుంది. వీటినే ఆంగ్లంలో బ్లాక్ సీడ్స్ అని కూడా పిలుస్తారు. వీటిని చాలా మంది సహజంగానే ఉపయోగించరు. అందువల్ల ఈ విత్తనాల గురించి చాలా మందికి తెలియదు. మీకందరికీ కాలోంజీ విత్తనాల గురించి తెలిసే ఉంటుంది. వీటినే ఆంగ్లంలో బ్లాక్ సీడ్స్ అని కూడా పిలుస్తారు. వీటిని చాలా మంది సహజంగానే ఉపయోగించరు. అందువల్ల ఈ విత్తనాల గురించి చాలా మందికి తెలియదు. ఈ విత్తనాలను ఆయుర్వేదంలో ఎంతో పురాతన కాలం నుంచే ఔషధాలుగా ఉపయోగిస్తున్నారు. ఈ విత్తనాల నుంచి నూనెను తీస్తారు. కాలోంజీ విత్తనాలను రోజూ నీటిలో వేసి మరిగించి ఆ నీళ్లను తాగవచ్చు. లేదా ఈ విత్తనాలను పొడిగా చేసి మనం తినే ఆహారాలపై చల్లి తీసుకోవచ్చు. ఈ క్రమంలో బ్లాక్ సీడ్స్ వల్ల మనకు అనేక ఆరోగ్య ప్రయోజనాలు కలుగుతా యని పోషకాహార నిపుణులు చెబుతున్నారు. బ్లాక్ సీడ్స్‌ను ఆహారంలో భాగం చేసుకోవాలని వారు సూచిస్తున్నారు.



**శిరోజాలు, చర్మ సంరక్షణకు..**

బ్లాక్ సీడ్స్ లో అనేక పోషకాలు ఉంటాయి. ముఖ్యంగా ఈ విత్తనాల్లో విటమిన్లు ఎ, బి12, నియాసిన్, విటమిన్ సి అధికంగా ఉంటాయి. ఇవి జుట్టును ఆరోగ్యంగా ఉంచుతాయి. చర్మాన్ని సంరక్షిస్తాయి. జుట్టు రాలే సమస్య ఉన్నవారు బ్లాక్ సీడ్స్‌ను వాడుతుంటే ఎంతగానో ప్రయోజనం ఉంటుంది. ఈ విత్తనాలను పొడిగా చేసి నేరుగా జుట్టుకు లేదా చర్మానికి అప్లై చేయవచ్చు. దీని వల్ల శిరోజాలు, చర్మం సంరక్షించబడతాయి. జుట్టు రాలడం తగ్గుతుంది. జుట్టు ఒత్తుగా పెరుగుతుంది. చర్మం కాంతివంతంగా మారి మెరుస్తుంది. యవ్వనంగా కనిపిస్తారు. ముఖంపై ఉండే మొటిమలు, మచ్చలు పోతాయి.

**ఒత్తిడి, ఆందోళనకు..**

బ్లాక్ సీడ్స్‌లో అనేక రకాల సమ్మేళనాలు ఉంటాయి. ఇవి మన మూడ్‌ను మారుస్తాయి. మైండ్ రిలాక్స్ అయ్యేలా చేస్తాయి. దీంతో ఒత్తిడి, ఆందోళన తగ్గుతాయి. మానసిక ప్రశాంతత లభిస్తుంది. తీవ్రమైన ఒత్తిడితో సతమతం అవుతున్న వారు బ్లాక్ సీడ్స్‌ను వాడితే ఫలితం ఉంటుంది. రాత్రి పూట నిద్ర కూడా చక్కగా పడుతుంది. పడుకున్న వెంటనే గాఢ నిద్రలోకి జారుకుంటారు. నిద్రలేమి తగ్గుతుంది. బరువు తగ్గాలనుకునే వారికి బ్లాక్ సీడ్స్ ఎంతో మేలు చేస్తాయి. ఈ విత్తనాలను తీసుకోవడం వల్ల మెటబాలిజం పెరుగుతుంది. దీంతో క్యాలరీలు వేగంగా ఖర్చవుతాయి. ఫలితంగా కొవ్వు కరుగుతుంది. అధిక బరువు తగ్గుతారు.

**శ్వాసకోశ సమస్యలకు..**

బ్లాక్ సీడ్స్‌ను తీసుకోవడం వల్ల శ్వాసకోశ సమస్యల నుంచి ఉపశమనం లభిస్తుంది. ముఖ్యంగా అలర్జీలు, ఆస్తమా వంటివి ఉన్నవారికి మేలు జరుగుతుంది. బ్లాక్ సీడ్స్‌లో యాంటీ ఇన్ ఫ్లామేటరీ గుణాలు ఉంటాయి. ఇవి శ్వాసకోశ వ్యవస్థను ప్రశాంత పరుస్తాయి. దీంతో శ్వాస సరిగ్గా లభిస్తుంది. దగ్గు, జలుబు నుంచి సైతం ఉపశమనం పొందవచ్చు. బ్లాక్ సీడ్స్ లో యాంటీ ఆక్సిడెంట్లు అధికంగా ఉంటాయి. ఇవి ఆక్సీకరణ ఒత్తిడిని తగ్గిస్తాయి. దీంతో గుండె ఆరోగ్యంగా ఉంటుంది. హార్ట్ ఎటాక్ రాకుండా నివారించవచ్చు. క్యాన్సర్ కణాలు పెరగకుండా అడ్డుకోవచ్చు. బ్లాక్ సీడ్స్‌లో ఉండే యాంటీ ఇన్ ఫ్లామేటరీ గుణాలు మెటబాలిక్ సిండ్రోమ్, ఆటో ఇమ్యూన్ వ్యాధులు వంటి సమస్యలను తగ్గించడంలో సమర్థవంతంగా పనిచేస్తాయి.

# పింక్ కలర్ జామ పండ్లు మీకు కనిపించాయా.. అయితే విడిచిపెట్టకుండా తినండి.. ఎందుకంటే..?

జామ పండ్లు ప్రస్తుతం మనకు దాదాపుగా ఏడాది పొడవునా అన్ని సీజన్లలోనూ లభిస్తున్నాయి. జామ పండ్లను చాలా మంది ఇష్టంగా తింటుంటారు. వీటిల్లో రెండు రకాల పండ్లు ఉంటాయనే విషయం తెలిసిందే. జామ పండ్లు ప్రస్తుతం మనకు దాదాపుగా ఏడాది పొడవునా అన్ని సీజన్లలోనూ లభిస్తున్నాయి. జామ పండ్లను చాలా మంది ఇష్టంగా తింటుంటారు. వీటిల్లో రెండు రకాల పండ్లు ఉంటాయనే విషయం తెలిసిందే. తెలుపు రంగు పండ్లను మనం ఎక్కువగా చూస్తుంటాం. అలాగే పింక్ రంగులో ఉండే జామ పండ్లు కూడా మనకు దర్శనమిస్తుంటాయి. అయితే పింక్ కలర్ జామ పండ్లను సూపర్ ఫుడ్‌గా పిలుస్తారు. ఎందుకంటే ఇవి మనకు అనేక ఆరోగ్య ప్రయోజనాలను అందిస్తాయి. పింక్ కలర్ జామ పండ్లలో బీటా కెరోటిన్, యాంథో సయనిన్స్ అధికంగా ఉంటాయి. అందుకనే అవి పింక్ రంగులో ఉంటాయి. ఈ క్రమంలోనే పింక్ రంగు జామ పండ్లను కూడా తరచూ ఆహారంలో భాగం చేసుకోవాలని ఆరోగ్య నిపుణులు సూచిస్తున్నారు.

**గుండె ఆరోగ్యానికి..**

పింక్ కలర్ జామ పండ్లలో విటమిన్ సి అధికంగా ఉంటుంది. అలాగే ఈ పండ్లలో పొటాషియం, పెక్టిన్ కూడా ఎక్కువగానే ఉంటాయి. 100 గ్రాముల పింక్ కలర్ జామ పండ్లను తింటే 20 శాతం ఫైబర్ లభిస్తుంది. అలాగే విటమిన్లు ఎ, బి1 (థయామిన్), బి2 (రైబోఫ్లేవిన్), బి3 (నియాసిన్), విటమిన్ ఇ కూడా ఈ పండ్లను తినడం వల్ల మనకు లభిస్తాయి. కనుక పింక్ కలర్ జామ పండ్లను పోషకాలకు నెలవుగా చెప్పవచ్చు. ఈ పండ్లను తింటే పోషకాహార లోపం నుంచి బయట పడవచ్చు. పింక్ కలర్ జామ పండ్లలో ఫైబర్, పెక్టిన్ అధికంగా ఉండడం వల్ల ఈ పండ్లను తింటే శరీరంలోని చెడు కొలెస్ట్రాల్ (ఎల్‌డీఎల్) తగ్గుతుంది. మంచి కొలెస్ట్రాల్ (హెచ్‌డీఎల్) పెరుగుతుంది. దీంతో గుండె ఆరోగ్యంగా ఉంటుంది. హార్ట్ ఎటాక్ రాకుండా చూసుకోవచ్చు.

**రోగ నిరోధక వ్యవస్థకు..**

పింక్ కలర్ జామ పండ్లలో విటమిన్ సి అధికంగా ఉంటుంది కనుక ఈ పండ్లను తింటే రోగ నిరోధక శక్తి పెరుగుతుంది. 100 గ్రాముల జామ పండ్లను తింటే 228 మిల్లీగ్రాముల మేర విటమిన్ సి లభిస్తుంది. ఇది రోగ నిరోధక వ్యవస్థను పటిష్టంగా చేస్తుంది. దీంతో శరీరం వ్యాధులు, ఇన్‌ఫెక్షన్లకు వ్యతిరేకంగా పోరాడుతుంది. మనల్ని రోగాల బారి నుంచి రక్షిస్తుంది. పింక్ కలర్ జామ పండ్లలో బీటా కెరోటీన్, యాంథో సయనిన్స్, లైకోపీన్ అధికంగా ఉంటాయి. ఇవి యాంటీ ఆక్సిడెంట్లలా పనిచేస్తాయి. దీంతో శరీరంలోని ఫ్రీ ర్యాడికల్స్ నిర్మూలించబడతాయి. వీటి వల్ల చర్మ కణాలు డ్యామేజ్ అవకుండా అడ్డుకోవచ్చు. దీంతో చర్మం ఎల్లప్పుడూ కాంతివంతంగా కనిపిస్తుంది. యవ్వనంగా మారుతారు.




**అధిక బరువు తగ్గేందుకు..**

పింక్ కలర్ జామ పండ్లలో క్యాలరీలు చాలా తక్కువగా ఉంటాయి. అలాగే ఈ పండ్లలో ఫైబర్, నీరు ఎక్కువగా ఉంటాయి. కనుక ఈ పండ్లను తింటే ఎక్కువ సేపు ఉన్నా ఆకలి వేయదు. దీంతో కడుపు నిండిన భావనతో ఉంటారు. ఆహారాన్ని తక్కువగా తీసుకుంటారు. ఇది బరువు తగ్గేందుకు సహాయ పడుతుంది. బరువు తగ్గాలని చూస్తున్నవారు పింక్ కలర్ జామ పండ్లను కచ్చితంగా ఆహారంలో భాగం చేసుకోవాలి. అలాగే ఈ పండ్లను తింటే శరీరంలో రక్త సరఫరా మెరుగు పడుతుంది. ఈ పండ్లలో పొటాషియం అధికంగా ఉంటుంది కనుక రక్త సరఫరాను మెరుగు పరుస్తుంది. దీంతో బీపీ కంట్రోల్ లో ఉంటుంది. హైబీపీ ఉన్నవారు రోజూ ఈ పండ్లను తింటే ఎంతో మేలు జరుగుతుంది. ఇలా పింక్ కలర్ జామ పండ్లతో మనం అనేక అద్భుతమైన ఆరోగ్య ప్రయోజనాలను పొందవచ్చు. కనుక ఇవి మీకు కనిపిస్తే విడిచిపెట్టకుండా తినండి.

# శత్రువులను ఓడించేందుకు చాణక్యుడు ఏం చెప్పాడో తెలుసా..?

జీవితంలో విజయానికి స్నేహితులే కాదు, శత్రువులు కూడా అవసరమేనని చాణక్యుడు చెబుతాడు. మన ఎదుగుదలకు, బలంగా మారేందుకు శత్రువుల వ్యూహాలు కూడా ఒక మార్గం చూపుతాయి. శత్రువులను ఎలా గుర్తించాలి..? వారిని ఎలా ఎదుర్కోవాలి..? ఈ విషయాల్లో చాణక్యుడి నిబంధనలను అనుసరించడం వల్ల విజయం సాధించవచ్చు. చాణక్యుడి నిబంధనల ప్రకారం జీవితంలో ముందుకు సాగేందుకు స్నేహితులు ఎంత ముఖ్యమో శత్రువులు కూడా అంతే అవసరం. ఎందుకంటే మన శత్రువులే మన విజయానికి కారణమవుతారు. జీవితంలో శత్రువులను ఎదుర్కోవడం అంత సులభం కాదు. కొన్నిసార్లు మన శత్రువులను మనం గుర్తించలేము. కానీ కంటికి కనిపించని శత్రువు కూడా మనకు కష్టాలు, దురదృష్టం తెచ్చిపెట్టగలడు మనకు తెలియకుండానే కొందరు మనకు వ్యతిరేకంగా వ్యవహరిస్తుంటారు. వాళ్లు మనకు ప్రత్యక్షంగా ఎదురు కాకుండా.. స్నేహపూర్వకంగా నటిస్తూ, మనకు సహాయం చేస్తున్నట్లు నటిస్తారు. ఇలాంటి వారు మంచి పేరు కోల్పోయిన శత్రువులకన్నా ఇంకా ప్రమాదకరమైనవారు. ఇలాంటి వారిని గుర్తించి వారిని ఎలా ఎదుర్కోవాలో తెలుసుకోవాలి. శత్రువులకు ప్రతిఘటనగా మనస్సు మీద ఆధిపత్యం కలిగి ఉండటమే మొదటి పద్ధతి.



చాణక్యుడి మాటల్లో శత్రువులను శక్తితో అదుపులో పెట్టకూడదు. వారికి మనసులో స్థానం సంపాదించాలి. ఎంత బలంగా ఉన్నా శత్రువుల బలహీనతలను అర్థం చేసుకుని వారి మనస్సులోకి ప్రవేశించాలి. శత్రువుల మనస్సును అర్థం చేసుకున్నవారు విజయానికి అడ్డుగా ఉన్న సమస్యలను గుర్తించి వాటికి పరిష్కారాలు కనుగొంటారు. ఇది విజయానికి దారి తీస్తుంది. శత్రువుతో వాదనకు దిగకుండా ఉండటం మంచిదని చాణక్యుడు చెబుతాడు. వాదనలోకి దిగే ముందు, ఆ వాదన వల్ల కలిగే మంచి-చెడులను ఆలోచించాలి. వీటన్నిటికంటే ముఖ్యమైన విషయం.. మన శత్రువులతో కూడా సహనంతో, స్పష్టంగా మాట్లాడటం. మాటలే యుద్ధంలో ముఖ్యమైన ఆయుధాలు. వారిని అవమానించడం లేదా నిందించడం వల్ల మాత్రమే ప్రతిఘటన పెరుగుతుంది. కాబట్టి వారితో స్నేహపూర్వకంగా మాట్లాడి, పరస్పరంగా అర్థం చేసుకునేలా చూడాలి. శత్రువులను ఎదుర్కోవడానికి వారు ఎలాంటి వ్యూహాలు వేస్తున్నారో తెలుసుకోవడం అత్యంత ముఖ్యమైన పద్ధతిగా చాణక్యుడు చెబుతాడు. శత్రువులు తమ లక్ష్యాన్ని సాధించేందుకు ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారో మనకు అవగాహన ఉంటే వారు ఏం చేయబోతున్నారో ముందుగానే అంచనా వేయగలుగుతాము. శత్రువులను ఎదుర్కోవడంలో విజయవంతం కావాలంటే మన మాటలు కంటే మన చర్యలకు ప్రాధాన్యం ఇవ్వాలి. మన అనుభవాలను , రహస్యాలను సన్నిహితులకి మాత్రమే చెప్పాలి.

నిజాల నిగ్గు తేల్చే
చర్చ
తెలుగు దిన పత్రిక
సోమవారం,
అక్టోబర్ 20, 2025



# అరుదైన ఘనత సాధించిన రోహిత్ శర్మ సచిన్, విరాట్ జాబితాలో మాజీ కెప్టెన్



పెర్త్‌లో ఆస్ట్రేలియాతో జరుగుతున్న తొలి వన్డేలో టీమిండియా సీనియర్ ఆటగాడు రోహిత్ శర్మ అరుదైన ఘనత సాధించాడు. ఈ సిరీస్‌లో రోహిత్ కేవలం బ్యాట్స్‌మెన్‌గా మాత్రమే ఆడనున్నాడు. ఇటీవల టీమిండియా వన్డే జట్టు కెప్టెన్‌గానూ గిల్‌కు బాధ్యతలు అప్పగించిన విషయం తెలిసిందే. రోహిత్ చాలారోజుల తర్వాత మైదానంలో టీమిండియా జెర్సీలో కనిపించాడు. ఈ మ్యాచ్‌లో ఓపెనర్ వచ్చాడు. ఈ మ్యాచ్‌తో ప్రత్యేక జాబితాలో చేరాడు.ఈ మ్యాచ్‌లో ఆస్ట్రేలియా కెప్టెన్ మిచెల్ మార్ష్ టాస్ గెలిచి బౌలింగ్ ఎంచుకున్నాడు. ఆల్ రౌండర్ నితీశ్ కుమార్ రెడ్డి ఈ మ్యాచ్‌లో వన్డేల్లో అరంగేట్రం చేశాడు. ఆస్ట్రేలియా సైతం ఇద్దరికి కొత్తగా జట్టులో చోటు కల్పించింది. పెర్త్‌లో జరుగుతున్న తొలి మ్యాచ్‌లో భారత జట్టు ముగ్గురు ఫాస్ట్ బౌలర్లు, ముగ్గురు ఆల్ రౌండర్లకు చోటు కల్పించింది. భారత జట్టు వన్డేల్లో వరుసగా 16వ సారి టాస్ ఓడిపోయింది. ఈ ఫార్మాట్‌లో చివరిసారిగా భాంజరుగుతున్న తొలి మ్యాచ్‌లో భారత జట్టు త్ 2023 వన్డే ప్రపంచ కప్ సెమీఫైనల్‌లో న్యూజిలాండ్‌పై టాస్ గెలిచింది. ఈ మ్యాచ్‌లో రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ అంతర్జాతీయ క్రికెట్‌లోకి తిరిగి వచ్చారు.ఛాంపియన్స్ ట్రోఫీ ఫైనల్ తర్వాత మళ్లీ భారత జట్టు తరఫున వన్డేల్లో బరిలోకి దిగారు. రోహిత్, కోహ్లీ దాదాపు 224 రోజుల తర్వాత బ్లూడ్రెస్‌లో కనిపించారు. చాలా రోజుల తర్వాత మైదానంలోకి వచ్చిన రోహిత్ ఈ మ్యాచ్‌లో పెద్దగా ఆకట్టుకోలేకపోయాడు. కేవలం 16 నిమిషాల పాటు క్రీజులో ఉన్నారు. జోష్ హాజిల్‌వుడ్ బౌలింగ్‌లో రోహిత్ స్లిప్‌లో క్యాచ్ ఇచ్చి అవుట్ అయ్యాడు. 14 బంతుల్లో ఎనిమిది పరుగులు చేసి ఒక ఫోర్ చేసి పెవిలియన్‌కు చేరాడు. ఈ మ్యాచ్‌లో ప్లేయింగ్ ఎలెవన్‌లో చోటు సంపాదించడం ద్వారా అరుదైన ఘనత సాధించాడు. రోహిత్‌కు ఇది 500వ అంతర్జాతీయ మ్యాచ్. ఈ జాబితాలో ఐదో ఆటగాడిగా నిలిచాడు. ఇంతకు ముందు ఈ జాబితాలో సచిన్, విరాట్, మహేంద్ర సింగ్ ధోని, రాహుల్ ద్రవిడ్ మాత్రమే 500 కంటే ఎక్కువ మ్యాచులు ఆడిన ఆటగాళ్ల జాబితాలో ముందున్నారు.


# తొలి వన్డేలో భారత్ ఓటమి




ఆస్ట్రేలియా పర్యటనను భారత్ ఓటమితో ఆరంభించింది. మూడు వన్డేల్లో భాగంగా పెర్త్‌లో జరిగిన తొలి వన్డేలో టీమిండియాపై ఆసీస్ 7 వికెట్ల తేడాతో విజయం సాధించింది. ఈ టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన టీమిండియా.. నిర్ణీత ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 136 పరుగులు చేసింది. మ్యాచ్‌కు వాన పలుమార్లు ఆటంకం కలిగించడంతో ఆటను అంపైర్లు 26 ఓవర్లకు కుదించారు. డక్‌వర్త్ లూయిస్ ప్రకారం ఆస్ట్రేలియాకు 131 పరుగుల లక్ష్యాన్ని నిర్దేశించగా.. 21.1 ఓవర్లలోనే 3 వికెట్లు కోల్పోయి లక్ష్యాన్ని ఛేదించింది. కెప్టెన్ మిచెల్ మార్ష్ (46 నాటౌట్‌బీ 52 బంతుల్లో 2 ఫోర్లు, 3 సిక్స్‌లు), జోష్ ఫిలిప్ (37బీ 29 బంతుల్లో 3 ఫోర్లు, 2 సిక్స్‌లు) చెలరేగి ఆడారు. అర్ష్‌దీప్, అక్షర్, సుందర్ తలో ఒక వికెట్ తీసుకున్నారు. రెండో వన్డే గురువారం(అక్టోబర్ 23) జరగనుంది.టాస్ ఓడి..తొలుత బ్యాటింగ్‌కు దిగిన టీమిండియాకు ఆదిలోనే షాక్ తగిలింది. 25 పరుగులకే కీలక వికెట్లోను భారత్ కోల్పోయింది. విరాట్ కోహ్లీ డకౌట్ కాగా.. రోహిత్ శర్మ 8 పరుగులు, శుభ్‌మన్ గిల్ 10 పరుగులు మాత్రమే చేసి పెవిలియన్ చేరారు. కేఎల్ రాహుల్ (38) టాప్ స్కోరర్ కాగా అక్షర్ పటేల్ (31), నితీశ్ రెడ్డి(19) ఫర్వాలేదనిపించారు. శ్రేయస్ అయ్యర్ (11), వాషింగ్టన్ సుందర్ (10), పరుగులు చేశారు. ఆస్ట్రేలియా బౌలర్లలో హేజిల్‌వుడ్, మిచెల్ ఓవెన్, కునెమన్ రెండేసి వికెట్లు పడగొట్టగా.. మిచెల్ స్టార్క్, నాథన్ ఎలిస్‌కు చెరో వికెట్ దక్కింది. మొత్తంగా తొలి వన్డేను భారత్( పేలవంగా ప్రారంభించడంతో క్రికెట్ ఫ్యాన్స్ తీవ్రంగా నిరుత్సాహం చెందారు.

# పాక్ దాడి అఫ్ఘాన్ క్రికెటర్లు మృతి

- ట్రై సిరీస్ నుంచి తప్పుకొన్న అఫ్ఘాన్
- వైమానిక దాడులకు నిరసనగా నిర్ణయం




**కాబూల్:** సరిహద్దు దేశాలతో నిత్యం ఘర్షణలకు దిగుతూ అంతర్జాతీయ సమాజం ఎదుట అభాసుపాలవుతున్న పాకిస్థాన్ మరోసారి తన వక్రబుద్ధిని చాటుకుంది. అఫ్ఘానిస్థాన్‌లోని పాక్టికా ప్రావిన్స్‌పై వైమానిక దాడులకు తెగబడి 8 మంది ప్రాణాలు తీసిన కయ్యాలమారికి కాబూలీలు దీటైన బదులిచ్చారు. త్వరలో పాకిస్థాన్ వేదికగా జరగాల్సి ఉన్న ముక్కోణపు టీ20 సిరీస్ (పాక్, అఫ్గాన్, శ్రీలంక) నుంచి వైదొలుగుతున్నట్టు అఫ్గానిస్థాన్ క్రికెట్ బోర్డు (ఏసీబీ) శనివారం తెలిపింది. పాక్ నిర్వహించిన వైమానిక దాడుల్లో మరణించినవారిలో తమ దేశానికి చెందిన ముగ్గురు దేశవాళీ క్రికెటర్లూ ఉన్నారని.. వారి అమరత్వానికి గౌరవసూచకంగా సిరీస్ నుంచి వైదొలుగుతున్నట్టు ఒక ప్రకటనలో వెల్లడించింది.ఫ్రెండ్లీ మ్యాచ్‌కు వెళ్లి.శుక్రవారం పాకిస్థాన్.. పాక్టికా ప్రావిన్స్‌లోని ఉర్గున్ జిల్లాపై వైమానిక దాడులకు దిగింది. అయితే ఈ దాడిలో స్థానిక క్రికెటర్లు కబీర్, సిబాతుల్లా, హరూన్ మృతి చెందారు. ఓ స్నేహపూర్వక మ్యాచ్ ఆడేందుకు గాను షరాన్ వెళ్లివస్తుండగా పాక్ జరిపిన దాడిలో ఈ ముగ్గురూ ప్రాణాలు కోల్పోయారు. ఈ నేపథ్యంలో ఏసీబీ స్పందిస్తూ.. 'ఉర్గున్ జిల్లాలో జరిగిన దారుణ ఘటనపై ఏసీబీ తీవ్ర విచారం వ్యక్తం చేస్తున్నది. పాకిస్థాన్ ప్రభుత్వం చేసిన ఈ పిరికిపంద చర్యతో మేము ముగ్గురు క్రికెటర్లను కోల్పోయాం. బాధితులకు గౌరవ సూచకంగా నవంబర్ చివర్లో పాక్‌లో జరగాల్సి ఉన్న ముక్కోణపు సిరీస్ నుంచి వైదొలగాలని నిర్ణయించుకున్నాం' అని తెలిపింది.హేయమైన చర్య : క్రికెటర్లుఈ ఘటనపై అఫ్గాన్ క్రికెటర్లూ స్పందిస్తూ పాక్ తీరును ఎండగట్టారు. అమాయక పౌరుల ప్రాణాలు తీయడాన్ని హేయమైన చర్యగా అభివర్ణించారు. ఆ జట్టు సారథి రషీద్ ఖాన్ సోషల్ మీడియా వేదికగా స్పందిస్తూ.. 'పాక్ జరిపిన దాడిలో దేశానికి ప్రాతినిథ్యం వహించాలని కలలు కన్న యువ క్రికెటర్లు ప్రాణాలు కోల్పోవడం తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసింది. ప్రజలను లక్ష్యంగా చేసుకుని దాడులు చేయడం క్రూరమైన చర్య. ఇది తీవ్రమైన మానవ హక్కుల ఉల్లంఘనను సూచిస్తున్నది. ఈ సందర్భంగా ఏసీబీ తీసుకున్న నిర్ణయాన్ని నేను స్వాగతిస్తున్నా' అని ఎక్స్‌లో రాసుకొచ్చాడు. పాక్ ఆర్మీ చర్యను అఫ్గాన్ స్వాతంత్ర్యంపై దాడిగా అభివర్ణించిన ఆ జట్టు మాజీ సారథి గుల్బాదిన్ నయాబ్.. ఇవి తమ దేశ ప్రజల స్ఫూర్తిని దెబ్బతీయలేవని తెలిపాడు. మిగిలిన క్రికెటర్లు సైతం మృతులకు సంతాపాన్ని ప్రకటించారు.

# జీఎస్టీ తగ్గినా ఈ 24 వస్తువుల రేట్లు తగ్గలేదు అసలు కథ ఏంటంటే




జీఎస్టీ సంస్కరణలతో కేంద్రం సామాన్యులకు బిగ్ రిలీఫ్ ఇచ్చింది. దీపావళికి ముందే జీఎస్టీ తగ్గింపుతో చాలా వాటి ధరలు తగ్గాయి. జీఎస్టీ తగ్గించాక నిజంగానే వస్తువుల రేట్లు తగ్గాయా..? అనే విషయంపై కేంద్రం స్పెషల్ ఫోకస్ పెట్టింది. మొత్తం 54 గృహోపకరణాల ధరల్లో మార్పులను పర్యవేక్షించగా అందులో 30 వస్తువుల ధరలు ఊహించిన దాని కంటే ఎక్కువగా తగ్గాయని ప్రభుత్వ గణాంకాలు చెబుతున్నాయి. ధరలు తగ్గింది వీటికేదేశవ్యాప్తంగా ఉన్న 21 సెంట్రల్ జీఎస్టీ జోన్ల నుండి అందిన సమాచారం ప్రకారం.. ఎయిర్ కండిషనర్లు, టెలివిజన్లు, టమాటో కెచప్, చీజ్, కండెన్స్‌డ్ మిల్క్, జామ్, సిమెంట్ వంటి 30 వస్తువుల ధరలు అంచనాలకు మించి తగ్గాయి. ఆహార పదార్థాలలో, డ్రైఫ్రూట్స్, చీజ్, జామ్, టొమాటో కెచప్ వంటి వాటిపై జీఎస్టీని 12 శాతం నుండి 5 శాతానికి తగ్గించడంతో ధరలు గణనీయంగా తగ్గాయి. అలాగే షాంపూ, టూత్ బ్రష్‌లు, టాల్కమ్ పౌడర్, ఫేస్ పౌడర్ వంటి సౌం దర్య సాధనాలు, కళ్లద్దాలు, ఏసీ యంత్రాలు, టీవీ సెట్‌లు, కిచెన్‌వేర్ ధరలు కూడా బాగా తగ్గాయి. తగ్గాల్సిన వస్తువులపై ఫోకస్జీఎస్టీ రేటు తగ్గిం పు ప్రయోజనం ఇంకా వినియోగదారులకు పూర్తిస్థాయిలో అందలేదనే చెప్పాలి. ఎందుకంటే ఇంకా 24 వస్తువుల రేట్లు తగ్గలేదు. వీటిలో నోట్ బుక్‌లు, చాక్లెట్లు, హెయిర్ ఆయిల్, టూత్‌పేస్ట్, పెన్సిళ్లు, థర్మామీటర్లు, సైకిళ్ల వంటి నిత్యావసరాలు ఉన్నాయి. నెయ్యి, బిస్కెట్లు, ఐస్ క్రీం, కేక్‌ల ధరలు కూడా ఊహించిన దానికంటే తక్కువగా తగ్గాయి.కంపెనీలతో కలిసి.ధరలు తగ్గని వస్తువులపై ప్రభుత్వం దృష్టి పెట్టింది. ఈ విషయంలో కంపెనీలతో కలిసి పనిచేస్తామని ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ తెలిపారు. జీఎస్టీ తగ్గింపు ద్వారా వినియోగదారులకు ప్రయోజనాలను అందించడంలో ప్రభుత్వం కట్టుబడి ఉందని ఆమె స్పష్టం చేశారు.

# ఒక్కటే పెద్ద లోన్ మంచిదా రెండు చిన్న లోన్లు తీసుకుంటే మంచిదా మీ డబ్బు సేవ్ అవ్వడానికి ఏది బెస్ట్




ఇంటి మరమ్మతులు, వైద్య బిల్లులు, పాఠశాల ఫీజులు లేదా అత్యవసర పరిస్థితులకు డబ్బు అవసరమైనప్పుడు చాలా మంది పర్సనల్ లోన్ తీసుకుంటూ ఉంటారు. అయితే మనకు కావాల్సిన మొత్తాన్ని ఒకే లోన్‌గా అంటే ఉదాహరణకు మనకు ఓ రూ.5 లక్షలు అవసరం అనుకుంటే.. రూ.5 లక్షలకు ఒకే లోన్ తీసుకుంటే మంచిదా? లేదా రెండు చిన్న లోన ్లుగా రూ.2.5 లక్షలు, రూ.2.5 లక్షలు తీసుకుంటే మంచిదా అనేది ఇప్పుడు చూద్దాం.ఒకే లోన్ తీసుకుంటే నెలకు ఒక ఈఎంఐ మాత్రమే ఉంటుంది. సో ఈఎంఐని ట్రాక్ చేయడం సులభం అవుతుంది. తక్కువ ఒత్తిడితో కూడుకున్నదిగా అనిపిస్తుంది. అలాగే మీరు మొత్తం లోన్ మొత్తాన్ని ఒకేసారి పొందుతారు. రెండు రుణాల కోసం దరఖాస్తు చేసుకోవడంతో పోలిస్తే ఒకే రుణం కోసం దరఖాస్తు చేసుకోవడం ఈజీ అవుతుంది. తక్కువ ఫారమ్‌లు, ఆమోదాలు, డాక్యుమెంటేషన్‌లు ఉంటాయి. కానీ, పెద్ద రుణానికి కొన్ని సవాళ్లు ఉన్నాయి. పెద్ద రుణాలు అధిక నెలవారీ చెల్లింపులతో వస్తాయి, ఇది మీ బడ్జెట్‌ను దెబ్బతీస్తుంది. అదే వడ్డీ రేటుతో కూడా, కాలక్రమేణా పెద్ద మొత్తాన్ని చెల్లించడం వల్ల మీరు చెల్లించే మొత్తం వడ్డీ పెరుగుతుంది. ఒక్క కూడా చెల్లించకపోవడం వల్ల పెద్ద ప్రభావం ఉంటుంది, మీ ఆదాయంలో హెచ్చుతగ్గులు ఉంటే అది ప్రమాదకరంగా మారుతుంది.రెండు చిన్న రుణాలు.ఒక పెద్ద రుణానికి బదులుగా రెండు చిన్న రుణాలు తీసుకోవడం కొన్ని పరిస్థితులలో మెరుగ్గా ఉంటుంది. చిన్న రుణాలు సాధారణంగా తక్కువ నెలవారీ చెల్లింపులను కలిగి ఉంటాయి, ఇతర ఖర్చులతో పాటు వాటిని నిర్వహించడం సులభం చేస్తుంది. మీరు ప్రతి రుణాన్ని ఒక నిర్దిష్ట ప్రయోజనం కోసం ఉపయోగించవచ్చు, ఒకటి అత్యవసర ఇంటి మరమ్మతుల కోసం, మరొకటి విద్యా ఖర్చుల కోసం. ఇది మీరు తీసుకున్న లోన్ వేస్ట్ కాకుండా చేస్తోంది. కొంతమంది రుణదాతలు చిన్న రుణాలు లేదా స్వల్పకాలిక రుణాలపై తక్కువ రేట్లను అందిస్తారు, ఇది చెల్లించిన మొత్తం వడ్డీని తగ్గించవచ్చు. మీరు ఒక పెద్ద రుణంపైని చెల్లించలేకపోతే, మీరు ఒక రుణంపై చెల్లించలేని ఆర్థిక ప్రభావం కంటే తక్కువగా ఉంటుంది. పైగా రెండు చిన్న లోన్లలో ఏదైనా ఒక లోన్‌ను ప్రీ క్లోజ్ చేసుకోవచ్చు. ఒకటే పెద్ద లోన్ క్లోజ్ చేయాలంటే ఎక్కువ డబ్బు కావాలి.ఒకటి మాత్రం క్లోజ్ చేయడానికి సగం డబ్బు ఉంటే చాలు.

# దీపావళి స్పెషల్ కొత్త స్కీమ్స్ ప్రకటించిన ఎల్ఐసి




దీపావళి పండుగ సందర్భంగా దేశంలోని ప్రముఖ ప్రభుత్వ బీమా సంస్థ బీమా చేసుకున్న వారికి ఒక పెద్ద బహుమతిని అందించింది. తన కొత్త నెక్స్ట్ జనరేషన్‌పాలనలో రెండు పథకాలను ప్రారంభించింది. (ప్లాన్ 880),ప్లాన్ 881) ప్రకటించింది. ఇందులో బీమా చేసుకున్న వారికి ఆటో కవర్ సౌకర్యంతో పాటు హామీ ఇవ్వబడిన అదనపు సౌకర్యాలు లభిస్తాయి. అండ్ దొరిస్వామి ఈ పథకాలను అక్టోబర్ 16న ప్రారంభించారు. రెండు ప్లాన్‌లు ఆటో కవర్ సౌకర్యం, మూడు సంవత్సరాల ప్రీమియం చెల్లింపు తర్వాత హామీ ఇవ్వబడిన జోడింపులతో వస్తాయి, ఇది పెట్టుబడిదారులకు, పాలసీదారులకు ఆర్థిక భద్రతను ఇసాయి.జన్ సురక్ష (ప్లాన్ 880)ఇది తక్కువ ఆదాయ వర్గాల వారికి సూక్ష్మ బీమా పథకం. ఇది సరసమైన, సులభమైన బీమా కలను నెరవేరుస్తుంది. ఇది నాన్-పార్టిసిపేటింగ్, నాన్-లింక్డ్ వ్యక్తిగత పొదుపు పథకం, ఇది వైద్య పరీక్ష లేకుండానే సాధారణ ఆరోగ్యవంతులైన వ్యక్తులకు అందుబాటులో ఉంటుంది. ప్రతి సంవత్సరం పాలసీ వ్యవధి ముగింపులో వార్షిక ప్రీమియంలో 4 శాతం హామీ ఇవ్వబడిన జోడింపులు అందుబాటులో ఉంటాయి. పాలసీదారుడు అకస్మాత్తుగా మరణిస్తే, కుటుంబానికి ఆర్థిక సహాయం, మెచ్యూరిటీ సమయంలో జీవించి ఉన్న పాలసీదారునికి పాలసీ డబ్బు మొత్తం లభిస్తుంది.ప్రవేశ వయస్సు: 18 నుండి 55 సంవత్సరాలుప్రాథమిక హామీ మొత్తం: కనీసం రూ.1 లక్ష, గరిష్టంగా రూ.2 లక్షలుపాలసీ వ్యవధి: 12 నుండి 20 సంవత్సరాలుపాలసీ వ్యవధి: 5 సంవత్సరాలుఎల్ఐసీ బీమా లక్ష్మి (ప్లాన్ 881)ఈ పథకం ప్రత్యేకంగా మహిళల కోసం రూపొందించబడింది, ఇది ప్రతి 2 లేదా 4 సంవత్సరాల తర్వాత (లేదా ప్రీమియం చెల్లింపులు నిలిపివేయబడినప్పుడు) జీవిత కవర్‌తో పాటు స్థిర డబ్బును తిరిగి అందిస్తుంది. ఇది కూడా నాన్-పార్టిసిపేటింగ్, నాన్-లింక్డ్ ప్లాన్. ప్రతి సంవత్సరం మొత్తం పట్టిక వార్షిక ప్రీమియంలో 7 శాతం పాలసీ కింద హామీ ఇవ్వబడిన జోడింపులు అందుబాటులో ఉంటాయి. మహిళా క్రిటికల్ ఇల్నెస్ రైడర్ అదనపు ప్రీమియంతో అందుబాటులో ఉంది, ఇది మరింత ఆకర్షణీయంగా ఉంటుంది.ప్రవేశ వయస్సు: 18 నుండి 50 సంవత్సరాలు పాలసీ వ్యవధి: 25 సంవత్సరాలుప్రీమియం చెల్లింపు వ్యవధి 7 నుండి 15 సంవత్సరాలుప్రాథమిక హామీ మొత్తం: కనీసం రూ.2 లక్షలు, గరిష్ట పరిమితి లేదు.బోనస్: రూ.10,000ఈ ప్లాన్‌లో మూడు సంవత్సరాల పూర్తి ప్రీమియం చెల్లింపుపై ఆటో కవర్ సౌకర్యం అందుబాటులో ఉంది.

# శాంతించిన బంగారం





ఆకాశమే హద్దుగా దూసుకుపోయిన బంగారం ధరలు ఎట్టకేలకు శాంతించాయి. దేశ రాజధాని న్యూఢిల్లీ బులియన్ మార్కెట్లో పదిగ్రాముల బంగారం ధర రూ.2,400 తగ్గి రూ.1,32,400కి తగ్గింది. అంతకుముందు ఇది రూ.1,34,800గా ఉన్నది. ధంతేరస్ కావడంతో ఆభరణాల దుఖాణాల్లో కొనుగోలుదారుల సందడి నెలకొన్నప్పటికీ ధరలు తగ్గడం విశేషం. అంతర్జాతీయ మార్కెట్లో అతి విలువైన లోహాల ధరలు భారీగా తగ్గడం వల్లనే దేశీయంగా ధరలు దిగొచ్చాయని ఆల్ ఇండియా సరఫా అసోసియేషన్ వెల్లడించింది. అలాగే 99.5 శాతం స్వచ్ఛత కలిగిన పుత్తడి ధర అంతే స్థాయిలో తగ్గి రూ.1,31,800గా నమోదైంది. గతేడాది ధంతేరస్ నుంచి ఈసారి ధంతేరస్ వరకు 24 క్యారెట్ బంగారం ధర రూ.51 వేలు లేదా 62.65 శాతం పెరిగింది. ఏడాది క్రితం రూ.81,400గా ఉన్న పదిగ్రాముల ధర ప్రస్తుతం రూ.1.31 లక్షల స్థాయికి ఎగబాకింది.వెండిది అదే బాటరికార్డు స్థాయిలో దూసుకుపోయిన వెండి కూడా భారీగా తగ్గింది. అధిక ధరల కారణంగా కొనుగోళ్లు పూర్తిగా నిలిచిపోవడంతో వెండి ఏకంగా రూ.7 వేలు దిగొచ్చింది. శుక్రవారం రూ.1.77 లక్షలుగా ఉన్న కిలో వెండి ప్రస్తుతం రూ.1.70 లక్షలకు దిగొచ్చింది. మరోవైపు, గడిచిన ఏడాదికాలంలో కిలో వెండి రూ.70,300 లేదా 70.51 శాతం ఎగబాకింది. కిందటి ఏడాది ధంతేరస్ రోజున రూ.99,700గా ఉన్నది.

# నెక్ట్స్ అల్లు అర్జున్ ఇతనే



దీపావళి పండగను పురస్కరించుకుని టాలీవుడ్ ప్రముఖులందరికీ గ్రాండ్ గా పార్టీ ఇచ్చాడు ప్రముఖ నటుడు, నిర్మాత బండ్ల గణేశ్. శనివారం (అక్టోబర్ 19) తన ఇంట్లో నిర్వహించిన ఈ గ్రాండ్ పార్టీకి మెగాస్టార్ చిరంజీవి, విక్టరీ వెంకటేష్, శ్రీకాంత్, సిద్దు జొన్నల గడ్డ, దర్శకుడు హరీశ్ శంకర్, నిర్మాతలు అశ్వనీదత్, నవీన్ యెర్నేని, రోషన్, బెల్లంకొండ సాయి శ్రీనివాస్, తేజ సజ్జ, జేడీ చక్రవర్తి, తరుణ్, మౌలి ఇలా చాలా మంది స్టార్స్ హాజరయ్యారు. ఈ పార్టీకి సంబంధించిన ఫోటోలు, వీడియోలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. ఇదే పార్టీలో కొందరు సినీ ప్రముఖులపై ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు బండ్ల గణేశ్. ముఖ్యంగా హనుమాన్, మిరాయ్ సక్సెస్ లతో ఫుల్ జోష్ లో ఉన్న హీరో తేజ సజ్జా పై ప్రశంసలు కురిపించాడు. ‘ ప్రస్తుతం భారతీయ చలనచిత్ర పరిశ్రమలో నెక్ట్స్ అల్లు అర్జున్ తేజ సజ్జానే’ అంటూ కాంప్లిమెంట్ ఇచ్చాడు. దీంతో అక్కడున్న వారందరూ బండ్ల గణేశ్ మాటలకు చప్పట్లు కొట్టారు. ఇందుకు సంబంధించిన వీడియో ప్రస్తుతం సామాజిక మాధ్యమాల్లో వైరల్ గా మారింది. ఇదే పార్టీలో డైరెక్టర్ హరీశ్ శంకర్ ను ఉద్దేశించి ఇంట్రెస్టింగ్ కామెంట్స్ చేశాడు బండ్లన్న. ‘నా జీవితాన్ని మార్చేసిన డైరెక్టర్’ అంటూ తన అభిమానాన్ని చాటుకున్నాడు. కాగా పవన్ కల్యాణ్ హీరోగా హరీశ్ శంకర్ తెరకెక్కించిన గబ్బర్ సింగ్ సినిమాకు బండ్ల గణేశ్ నిర్మాతగా వ్యవహరించిన సంగతి తెలిసిందే. కాగా ఈ పార్టీకి ఒకే కారులో వచ్చారు చిరంజీవి, శ్రీకాంత్. ఈ సందర్భంగా కారు దిగగానే బండ్ల గణేశ్ చిరంజీవి పాదాలకు నమస్కరించాడు. అనంతరం తనే స్వయంగా చేతులు పట్టుకుని ఇంట్లోకి తీసుకెళ్లాడు. అక్కడ ఓ ప్రత్యేకమైన కుర్చీలో చిరంజీవిని కూర్చొబెట్టాడు. కాగా కొంతకాలంగా సినిమా ఇండస్ట్రీకి దూరంగా ఉంటున్నారు బండ్ల గణేశ్. త్వరలోనే అతను మళ్లీ సినిమాలు చేయనున్నట్లు తెలుస్తోంది. ఈక్రమంలోనే టాలీవుడ్ ప్రముఖులందరికీ గ్రాండ్ గా దీపావళి పార్టీ ఇచ్చినట్లు తెలుస్తోంది.

# ఈ వారం షాక్ ఎలిమినేషన్ - స్ట్రాంగ్ కంటెస్టెంట్ భరణి హౌస్ నుంచి బయటికే



బిగ్ బాస్ సీజన్ 9లో ఈ వారం నామినేషన్ల జాబితాలో ఆరుగురు హౌస్ మెట్స్ ఉన్నారు. భరణి, సుమన్ శెట్టి, దివ్య, తనూజ, డీమాన్ పవన్, రాము ఈసారి నామినేషన్లలో చోటు చేసుకున్నారు. అయితే ఈసారి అత్యంత స్ట్రాంగ్ కంటెస్టెంట్‌గా గుర్తింపొందిన భరణి ఎలిమినేట్ అవుతున్నట్లు తెలుస్తోంది. ఇది బిగ్ బాస్ సీజన్ 9 సండే స్పెషల్ దీపావళి ఎపిసోడ్‌లో ప్రేక్షకులని కొంత ఆశ్చర్యానికి గురి చేయను ంది. మరోవైపు ఈ ఎపిసోడ్‌లో కొంతమంది సెలబ్రిటీస్ షోలో ప్రత్యక్షమవుతారని సమాచారం. భరణి మొదటి రెండు వారాలు స్ట్రాంగ్ కంటెస్టెంట్‌గా కనిపించగా, ఇటీవల రిలేషన్ షిప్ ఫోకస్ కారణంగా ఆటపై దృష్టి పెట్టకపోవడం, టాస్కలలో సరైన ప్రదర్శన కనబరచకపోవడం వంటి కారణాల వల్ల ఆడియన్స్ లో అతనిపై కాస్త నెగెటివిటీ ఏర్పడింది. మొదటి వారం నుంచి తనజ్‌తో ఉన్న భరణి, దివ్య ఎంట్రీ తర్వాత ఆమెతో ఎక్కువగా సమయం గడిపినట్లు కనిపిస్తుంది. హౌస్‌లో టాస్కలలో పర్ఫార్మెన్స్ లేకపోవడం, ఎమోషనల్ అనుబంధాలపై ఎక్కువ దృష్టి పెట్టడం వంటి కారణాల వల్ల భరణి ఈ వారం ఎలిమినేషన్‌కి కారణమవుతున్నాడు. ఎలిమినేషన్ సమయంలో తనూజ బాగా ఎమోషనల్ అయ్యిందని, నాగార్జున కన్‌ఫెషన్ రూమ్‌లో ఆమెను ఓదార్చారని సమాచారం. దీపావళి స్పెషల్ ఎపిసోడ్‌లో ఎలిమినేషన్ మూడ్‌తో పాటు ఎమోషనల్ మోమెంట్స్‌తో కూడిన అనుభవాన్ని ప్రేక్షకులకు అందించనుంది. భరణి ఎలిమినేషన్ కచ్చితంగా ఆడియన్స్‌కు షాక్ ఇవ్వనుంది. పూర్తి సీన్‌ను ఈ సండే ఎపిసోడ్‌లోనే చూడాల్సి ఉంటుంది. ఇక దీపావళి స్పెషల్ ఎపిసోడ్‌కి పలువురు సెలబ్రి టీలు కూడా హాజరై సందడి చేయనున్నారు.

## ఆ స్టార్ హీరో సినిమా అంటే చాలా ఇష్టం



ప్రేమలు సినిమాతో తెలుగులోనూ మంచి ఫాలోయింగ్ సంపాదించుకుంది కేరళ బ్యూటీ మమితా బైజు. ఒక్క సినిమాతోనే తనకంటూ ఓ ఇమేజ్ క్రియేట్ చేసుకున్న ఈ బ్యూటీ. ఇప్పుడు డ్యూడ్ సినిమాతో మరోసారి తెలుగు అడియన్స్ ముందుకు వచ్చింది. కోలీవుడ్ హీరో ప్రదీప్ రంగనాథన్ నటించిన ఈ చిత్రాన్ని తమిళంతోపాటు తెలుగులోనూ రిలీజ్ చేసిన సంగతి తెలిసిందే. ప్రస్తుతం బాక్సాఫీస్ వద్ద మంచి రెస్పాన్స్ అందుకుంటున్న సినిమాల్లో డ్యూడ్ ఒకటి. లవ్ టుడే, డ్రాగన్ చిత్రాలతో హిట్స్ అందుకున్న హీరో ప్రదీప్ రంగనాథన్ ఇప్పుడు డ్యూడ్ సినిమాతో మరోసారి తెలుగు అడియన్స్ ముందుకు వచ్చారు. అక్టోబర్ 17న విడుదలైన ఈ సినిమాకు మంచి రెస్పాన్స్ వస్తుంది. ప్రస్తుతం బాక్సాఫీస్ వద్ద మంచి రెస్పాన్స్ అందుకుంటున్న సినిమాల్లో డ్యూడ్ ఒకటి. లవ్ టుడే, డ్రాగన్ చిత్రాలతో హిట్స్ అందుకున్న హీరో ప్రదీప్ రంగనాథన్ ఇప్పుడు డ్యూడ్ సినిమాతో మరోసారి తెలుగు అడియన్స్ ముందుకు వచ్చారు. అక్టోబర్ 17న విడుదలైన ఈ సినిమాకు మంచి రెస్పాన్స్ వస్తుంది. ఇందులో ప్రదీప్ సరసన మమితా బైజు హీరోయిన్ గా నటించిన సంగతి తెలిసిందే. అంతకు ముందు ప్రేమలు సినిమాతో తెలుగులో మంచి ఫ్యాన్ ఫాలోయింగ్ సంపాదించుకుంది మమితా. మలయాళంలో చాలా కాలంగా క్యారెక్టర్ ఆర్టిస్టుగా, కథానాయికగా అనేక సినిమాల్లో నటించింది ఈ ముద్దుగుమ్మ. ఇందులో ప్రదీప్ సరసన మమితా బైజు హీరోయిన్ గా నటించిన సంగతి తెలిసిందే. అంతకు ముందు ప్రేమలు సినిమాతో తెలుగులో మంచి ఫ్యాన్ ఫాలోయింగ్ సంపాదించుకుంది మమితా. మలయాళంలో చాలా కాలంగా క్యారెక్టర్ ఆర్టిస్టుగా, కథానాయికగా అనేక సినిమాల్లో నటించింది ఈ ముద్దుగుమ్మ. కానీ ప్రేమలు సినిమాతో ఈ బ్యూటీ క్రేజ్ ఒక్కసారిగా మారిపోయింది. ప్రేమలు సినిమా తర్వాత ఆమెకు తెలుగులో సెపరేట్ ఫ్యాన్ బేస్ క్రియేట్ అయ్యింది. ఈ మూవీ తర్వాత ఇప్పుడు డ్యూడ్ సినిమాతో మరోసారి తెలుగు అడియన్స్ ముందుకు వచ్చిన ఈ బ్యూటీ.. ఇటీవల తనకు ఇష్టమైన హీరో గురించి చెప్పుకొచ్చింది. కానీ ప్రేమలు సినిమాతో ఈ బ్యూటీ క్రేజ్ ఒక్కసారిగా మారిపోయింది. ప్రేమలు సినిమా తర్వాత ఆమెకు తెలుగులో సెపరేట్ ఫ్యాన్ బేస్ క్రియేట్ అయ్యింది. ఈ మూవీ తర్వాత ఇప్పుడు డ్యూడ్ సినిమాతో మరోసారి తెలుగు అడియన్స్ ముందుకు వచ్చిన ఈ బ్యూటీ.. ఇటీవల తనకు ఇష్టమైన హీరో గురించి చెప్పుకొచ్చింది. ఇటీవల ఓ ఇంటర్వ్యూలో తెలుగు సినిమాలు చూసేవారా అని అడగ్గా మమితా బైజు మాట్లాడుతూ.. రామ్ చరణ్ మగధీర సినిమా అంటే చాలా ఇష్టమని.. మలయాళంలో ఈ మూవీ ధీర పేరుతో వచ్చిందని.. ఆ సినిమా చాలా బాగుంటుందని చెప్పుకొచ్చింది. ఇటీవల ఓ ఇంటర్వ్యూలో తెలుగు సినిమాలు చూసేవారా అని అడగ్గా మమితా బైజు మాట్లాడుతూ.. రామ్ చరణ్ మగధీర సినిమా అంటే చాలా ఇష్టమని.. మలయాళంలో ఈ మూవీ ధీర పేరుతో వచ్చిందని.. ఆ సినిమా చాలా బాగుంటుందని చెప్పుకొచ్చింది. అలాగే తాను స్కూల్ టైంలో ఉన్నప్పుడు ఆర్య, ఆర్య 2 చిత్రాలు చూశానని.. ఆ రెండు సినిమాలు చాలా బాగుంటాయని చెప్పుకొచ్చింది. ఇక రీసెంట్ టైమ్స్ మూవీ గురించి చెప్పలేదు. దీంతో అల్లు అర్జున్, చరణ్ ఫ్యాన్స్ మమిత చేసిన కామెంట్స్ తెగ షేర్ చేస్తున్నారు. అలాగే తాను స్కూల్ టైంలో ఉన్నప్పుడు ఆర్య, ఆర్య 2 చిత్రాలు చూశానని.. ఆ రెండు సినిమాలు చాలా బాగుంటాయని చెప్పుకొచ్చింది. ఇక రీసెంట్ టైమ్స్ మూవీ గురించి చెప్పలేదు. దీంతో అల్లు అర్జున్, చరణ్ ఫ్యాన్స్ మమిత చేసిన కామెంట్స్ తెగ షేర్ చేస్తున్నారు.



## విడాకులు అనారోగ్యం పబ్లిక్‌గానే జరిగాయి


చాలా కాలం తర్వాత ఇప్పుడిప్పుడే సినిమాల్లోకి రీఎంట్రీ ఇస్తుంది హీరోయిన్ సమంత. కొన్నాళ్లపాటు మయోసైటిస్ కారణంగా సినిమాలకు దూరంగా ఉన్న సామ్... ఇప్పుడు నిర్మాతగా మారి పలు చిత్రాలు నిర్మిస్తుంది. ఈ క్రమంలోనే తాజాగా ఓ ఆంగ్ల మీడియాకు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆమె మాట్లాడుతూ.. విడాకులు, అనారోగ్యం, ట్రోలింగ్స్ పై స్పందించారు. సమంత.. చాలా కాలం తర్వాత తిరిగి సినిమాల్లో యాక్టివ్ అయ్యారు. ఈ క్రమంలో తాజాగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న ఆమె ఆసక్తికర కామెంట్స్ చేశారు. సామ్ మాట్లాడుతూ.. “నా జీవితంలో జరిగిన ప్రతి చిన్న విషయం అందరికీ తెలుసు. ఏది జరిగినా అది ప్రజల సమక్షంలోనే జరిగింది. విడాకుల విషయంలో కానీ, ఆరోగ్యం విషయం కానీ అన్ని పబ్లిక్ గానే జరిగాయి. సమంత.. చాలా కాలం తర్వాత తిరిగి సినిమాల్లో యాక్టివ్ అయ్యారు. ఈ క్రమంలో తాజాగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న ఆమె ఆసక్తికర కామెంట్స్ చేశారు. సామ్ మాట్లాడుతూ.. “నా జీవితంలో జరిగిన ప్రతి చిన్న విషయం అందరికీ తెలుసు. ఏది జరిగినా అది ప్రజల సమక్షంలోనే జరిగింది. విడాకుల విషయంలో కానీ, ఆరోగ్యం విషయం కానీ అన్ని పబ్లిక్ గానే జరిగాయి. నేను ఎంతో స్ట్రగుల్ ఫేస్ చేశాను. ఆ సమయంలో సోషల్ మీడియాలో నాపై ఎన్నో ట్రోల్స్ వచ్చాయి. ఎవరికి నచ్చినట్లు వాళ్లు నా గురించి జడ్జిమెంట్స్ ఇచ్చారు. అథెంటిసిటీ అనేది ఓ గమ్యస్థానంగా నేను భావించడం లేదు. ఇది కొనసాగుతూనే ఉంటుంది. నా జీవితంలో ప్రతీది సెట్ కాలేదు. కానీ దాని గురించి నేను మాట్లాడుతున్నాను. నేను ఎంతో స్ట్రగుల్ ఫేస్ చేశాను. ఆ సమయంలో సోషల్ మీడియాలో నాపై ఎన్నో ట్రోల్స్ వచ్చాయి. ఎవరికి నచ్చినట్లు వాళ్లు నా గురించి జడ్జిమెంట్స్ ఇచ్చారు. అథెంటిసిటీ అనేది ఓ గమ్యస్థానంగా నేను భావించడం లేదు. ఇది కొనసాగుతూనే ఉంటుంది. నా జీవితంలో ప్రతీది సెట్ కాలేదు. కానీ దాని గురించి నేను మాట్లాడుతున్నాను. నేనేమి పర్ఫెక్ట్ కాదు. ఒప్పుకుంటాను. నేను కూడా చాలా తప్పులు చేశాను. వాటి నుంచి గుణపాఠం నేర్చుకుంటున్నాను. కానీ ఇప్పుడు నేను బెటర్ గా ఉండటానికి ప్రయత్నిస్తున్నాను అంటూ సమంత

# టాలీవుడ్‌లోకి విక్రమ్ తనయుడు

కోలీవుడ్ ఇండస్ట్రీలో అత్యధిక డిమాండ్ ఉన్న హీరోలలో చియాన్ విక్రమ్ ఒకరు. హీరోయిజం చిత్రాలు కాకుండా కంటెంట్ ప్రాధాన్యత ఉన్న సినిమాలు ఎంచుకుంటూ తనకంటూ ప్రత్యేక బ్రాండ్ క్రియేట్ చేసుకున్నారు. ఇప్పటివరకు తమిళంతోపాటు తెలుగులోనూ ఫ్యాన్ ఫాలోయింగ్ సొంతం చేసుకున్న విక్రమ్.. ఇప్పటికీ వరుస సినిమాలతో బిజీగా ఉంటున్నారు. మరోవైపు విక్రమ్ తనయుడు ధృవ్ విక్రమ్ సైతం ఇండస్ట్రీలో హీరోగా తెరంగేట్రం చేసిన సంగతి తెలిసిందే. తమిళంలో వర్మ సినిమాతో హీరోగా ఎంట్రీ ఇచ్చాడు ధృవ్ విక్రమ్. తొలి చిత్రంతోనే నటుడిగా తానేంటో నిరూపించుకున్నాడు. కానీ కమర్షియల్ గా ఈ సినిమా అంత సక్సెస్ కాలేదు. నటుడిగా విమర్శకుల ప్రశంసలు అందుకున్నాడు ధృవ్. ఆ తర్వాత తన తండ్రితో కలిసి మహాన్ చిత్రంలో నటించారు. ఈ మూవీ నేరుగా ఓటీటీలో విడుదలై మంచి రివ్యూస్ అందుకుంది. ఇక ఇప్పుడు హీరోగా బైసన్ సినిమాతో హిట్టు కొట్టాడు. సరైన కథ.. దర్శకుడి చేతిలో పడితే తన సత్తా చాటగలనని బైసన్ సినిమాతో నిరూపించుకున్నాడు ధృవ్. మారీ సెల్వరాజ్ దర్శకత్వంలో వచ్చిన బైసన్ సినిమా దీపావళి పండగ సందర్భంగా శుక్రవారం అడియన్స్ ముందుకు వచ్చింది. కబడ్డీ క్రీడ నేపథ్యంలో యథార్థ సంఘటనల ఆధారంగా రూపొందించిన ఈ మూవీ విడుదలకు ముందే మంచి బజ్ క్రియేట్ చేసుకుది. డైరెక్టర్ పా. రంజిత్ సొంత నిర్మాణ సంస్థ నీలం ప్రొడక్షన్స్, అప్లాజ్ ఎంటర్టైన్మెంట్, శాంతి సినిమా సంస్థలు కలిపి ఈ సినిమాను నిర్మించగా.. శు క్రవారం విడుదలైన ఈ మూవీకి మంచి రెస్పాన్స్ వచ్చింది. విడుదలైన మొదటి రోజే సూపర్ హిట్ టాక్ అందుకుంది. అత్యున్నత పురస్కారం అర్జున్ అవార్డును గెలుచుకునే స్థాయికి ఎలా ఎదిగాడు అనేదే బైసన్ చిత్రం. ఇందులో ధృవ్ విక్రమ్ హీరోగా, అతడి అక్కగా రజిషా విజయన్, తండ్రి పశుపతి, కథానాయికగా అనుపమ పరమేశ్వరన్ నటించారు. వీరితోపాటు అమీర్, లాల్ ముఖ్యపాత్రలు పోషించారు. ఈ చిత్రానికి కే. ప్రసన్న అందించిన మ్యూజిక్ మరో హైలెట్. ఈ సినిమాలో తనదైన నటనతో పాత్రకు ప్రాణం పోశారు ధృవ్ విక్రమ్. ఇక ఇప్పుడు బైసన్ సినిమాను తెలుగులోనూ రిలీజ్ చేసేందుకు సిద్ధమయ్యారు మేకర్స్. అదే పేరుతో తెలుగులో అక్టోబర్ 24న విడుదల చేయనున్నారు. అంతకుముందు మారీ సెల్వరాజ్ తెరకెక్కించిన మామన్నన్, కర్ణన్, వాజై చిత్రాలు తెలుగులో విడుదలై మంచి విజయాన్ని అందుకున్నాయి. ఇప్పుడు బైసన్ సైతం తెలుగులో సూపర్ హిట్ కావడం ఖాయమని అంటున్నారు



# మహేశ్ బాబుతో రాజమౌళి మైథికల్ అడ్వెంచర్



ప్రపంచ సినీ వేదికపై తెలుగు సినిమాకి కొత్త పుంతలు తొక్కించిన దర్శకుడు ఎస్.ఎస్. రాజమౌళి. ‘బాహుబలి’ సిరీస్‌తో భారత సినిమా ను గ్లోబల్ మ్యాప్‌పై నిలబెట్టారు. ‘ఆర్ఆర్ఆర్’తో ఆస్కార్ దక్కేలా చేశారు. ఇక ఇప్పుడు సూపర్‌స్టార్ మహేశ్ బాబుతో కలిసి మరొక భారీ ప్రాజెక్ట్‌కి సిద్ధమవుతున్నారు. గా పిలుస్తున్న ఈ సినిమా భారత సినీ చరిత్రలోనే అత్యంత భారీ స్థాయిలో తెరకెక్కనుందని ఇండస్ట్రీ టాక్. దుర్గా ఆర్ట్స్ పతాకంపై ఎస్. గోపాల్‌రెడ్డి ఈ సినిమాను భారీ బడ్జెట్‌తో నిర్మిస్తున్నారు. హాలీవుడ్ స్థాయి టెక్నీషియన్లు, యాక్షన్ స్టంట్ మాస్టర్స్, మరియు టాప్‌నాచ్ ఆర్టిస్టులు ఈ ప్రాజెక్ట్‌లో భాగమవుతు న్నారు. రాజమౌళి గ్లోబల్ మార్కెట్‌పై దృష్టి సారించి, హాలీవుడ్ ప్రొడక్షన్ సంస్థలతో టైఅప్ లను కూడా ఫైనలైజ్ చేస్తున్నట్లు సమాచారం. ప్రపంచ ప్రఖ్యాత వార్నర్ బ్రదర్స్‌తోనూ చర్చలు కొనసాగుతున్నాయట. అడ్వెంచర్ యాక్షన్ డ్రామా జానర్‌లో రూపొందుతున్న ఈ చిత్రంలో మహేశ్ బాబు ఓ “గ్లోబల్ ఎక్స్‌ప్లోరర్” పాత్రలో కనిపించబోతున్నారు. బాలీవుడ్ స్టార్ ప్రియాంక చోప్రా హీరోయిన్‌గా నటిస్తుండగా, మలయాళ సూపర్‌స్టార్ పృథ్వీరాజ్ సుకుమారన్ మరియు నటుడు మాధవన్ కీలక పాత్రల్లో కనిపించనున్నారు. ఇప్పటికే ఆఫ్రికా అడవులు, దక్షిణ అమెరికా అమెజాన్ బేసిన్, ఐస్‌లాండ్ వంటి విభిన్న లొకేషన్లలో చిత్రీకరణ జరగగా, యూనిట్ ప్రస్తుతం తదుపరి షెడ్యూల్ కోసం సిద్ధమవుతోంది. ఇక ఫ్యాన్స్ ఆసక్తిగా ఎదురుచూస్తున్న బిగ్ అప్‌డేట్ కోసం కౌంట్‌డౌన్ ప్రారంభమైంది. తాజా సమాచారం ప్రకారం, నవంబర్ 16న రాజమౌళి ” టైటిల్ మరియు ఫస్ట్ గ్లింప్స్‌ను విడుదల చేయాలని నిర్ణయించారట. ఈ అప్‌డేట్‌ను హాలీవుడ్ స్థాయిలో ప్లాన్ చేసిన ఓ గ్రాండ్ ఈవెంట్‌లో విడుదల చేయనున్నారు. అందులోనూ మరో సెన్సేషన్ ఏమిటంటే ఆ ఈవెంట్‌కి “అవతార్” దర్శకుడు జేమ్స్ కామెరూన్ హాజరయ్యే అవకాశం ఉందని ఫిల్మ్ నగర్ టాక్. ప్రమోషన్ కోసం ఇండియాకు రానున్న కామెరూన్‌తోనే గ్లోబల్ లెవల్‌లో ఈ అప్‌డేట్ విడుదల చేయించాలనే రాజమౌళి ప్రణాళిక రూపొందించినట్లు సమాచారం. ఈ గ్లింప్స్ ప్రపంచవ్యాప్తంగా తెలుగు సినిమా హైప్‌కి కొత్త మైలురాయి అవుతుంది అంటున్నారు. మొత్తం మీద, “”తో మహేశ్ బాబు, రాజమౌళి కాంబినేషన్ మరోసారి ఇండియన్ సినిమాను ఇంటర్నేషనల్ రేంజ్‌కి తీసుకెళ్లనుందనే నమ్మకం పెరిగింది

Published by Goli Sammi reddy , Owned by VIJETHA PUBLICATIONS, H.No. 19-6-113/1, Laxminagar, Godavarikhani, Karimnagar-505 209, Printed at VIJETHA GRAPHICS & OFFSET PRINTERS, H.No. 19-6-113/1, Laxminagar, Godavarikhani, Karimnagar-505 209 and Published at H.No. 19-6-113/1, Laxminagar, Godavarikhani, Karimnagar-505 209 Editor: Pittala Ravinder, Associate Editor NAYANI RAJESH, RNI.No.APTEL/1998/02685, email: charcha123@gmail.com